వింత విమర్శలు

(పురాణములు)

★

గ్రంథకర్త:

వాడరేవు సీతారామాంజనేయులు, B. A.

భాగవతార్

కరీదు: రు. 8/-

ప్రథమ ముద్రణ : 1980

గ్రంథములకు:

వాడరేవు సీతారామాంజనేయులు B. A. భాగవతార్

డోరు నెం. 20-91, బాలాజీనగర్

(స్టీలు ఫ్యాక్టరీవద్ద)

నెల్లూరు - 2. A. P.

ముద్రణ :

కమలాంబిక ప్రెస్,

నెల్లూరు—1.

విషయసూచిక

అంకితము

సీ॥ గ్రంథరచన పూర్వగ్రంథ రాజములపై సాగె సత్పథమున సాధురీతి
వింతవింతగ మంచి వింతైన శోధన వింత విమర్శల వెలువరించె
పుణ్యపురాసులౌ పూర్వ పురాణముల్ వివరించె సతతము విశ్వమయుని
విశ్వమయుడె నాకు విజ్ఞానము నొసంగి వ్రాయించె నీ చిత్ర వ్యాసరచన

గీ॥ అంకితం బొనర్చెద దీని నందుచేత
పుణ్యముల నిచ్చెడి పురాణ పూరుషునకు
పాపముల బాపి నాపైని కృపను జూప
వేడ్క ముక్తిని గోరుచు వేడుకొనుచు.

రచనోద్దేశము

మానవజన్మ మెత్తినందులకు మాధవుని స్మరించుటే మనధర్మమని తలంచి, హరిదప్ప మనపాపముల హరియించువా డింకొకడు లేడనియెంచి, పురుషుడనై పుట్టినందులకు పురాణపురుషుని గొనియాడుటే కర్తవ్యమని భావించి, ఇంతకు పూర్వము రచించిన "ఆంధ్ర హరికథా వాఙ్మయము"పై విద్యావంతులు పంపిన ప్రక్కపేజీలోని ప్రశంసాపత్రములచే ప్రభావితుడనై మరొకగ్రంథము ముద్రించ దలంచి, ఊరూపేరూలేని వారు పురాణముల మొగమే యెరుంగనివారు పురాణములపై విమర్శలు సేయుచూ వూకదంపు డుపన్యాసము లిచ్చుటవిని, వికలమనస్కుడనై, వివేకులు సయిత మాధ్యాత్మిక విషయములందు వింతగా వితండవాదన లొనర్చుచుండ వేదన జెంది, తమ మతమునే తామెరుంగక పరమతమును తర్కించు పెద్దలను గాంచి చింతించి, పురాణములను సక్రమముగ జూడక వక్రమార్గమున గాంచుట అక్రమమని నా మనసును మీకెరుకపరచ దలంచి, భక్తుడనైన నేను నా బాధ్యతగ భావించి, నా పామర పురాణ పరిశీలనను మీముందుంచ సాహసించితి. మంచిని గమనించు మాన్యులకు నాతల వంచితి. నేత్రలోప మించుక దాపురించినందున కొంచెము హెచ్చుగనే అచ్చులో తప్పిదములు వచ్చినందుకు మిక్కిలి చింతించితి. పామర పరిశీలనమునకు తోడుగ భాషయు పామరమే జతయైనది. గనుక పండితులు రుసరుసలు పడక దండిగ తమ మనసును, భావముపైకి మెండుగ విసరమని కొసరుకొనుచుంటి.

అభిప్రాయము లొసంగిన శ్రీ వసంతవెంటరావుగారికి శ్రీ కె. యగ్గెన్నగారికి, శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి భాగవతారుగారికి. శ్రీ బిడి గురవారెడ్డిగారికి, శ్రీ పదాల రామమూర్తిగారికి మరియు కమలాంబిక ప్రెస్సువారికి కృతజ్ఞతాభివందనము లర్పించుచుంటి. ద్రవ్య దాతలకు నమస్కరించుచుంటి.

ఇట్లు,

వ్యాసకర్త,

వాడరేవు సీతారామాంజనేయులు బి. ఎ.,

భాగవతార్.

నెల్లూరు,

1-1-1980,

INDIAN EXPRESS

Vijayawada, Saturday. August-4, 1979.

Andhra Harikatha Vangmayam by Vadarevu Seetharamanjaneya Bhagavatar Nellore. Thea uthor has given many details about the origin and the lives of those Haridasus. The attempt is praise worthy. It is a Good Book on Harikatha litarature which every body ought to know.

There are many mystic legends in our Country. The hidden truths enshrined in them should be brought out to convince the dry rational intellect and open its blind eyes to the divine lighit. The proud and Ignorant mind of the present age revelling in the marvels of science does not beleave the legends of our glorious past. They do not seem to be mere fanciful creations of ancient scenes. But if we properly scrutinise them we can find in them profund messsages wrapped up in beautiful tales. They are the moral and spiritual treasures of age less India. The book must be read by those who love our immortal heri tage.

K. Yeggenna.

ప్రశంస

శ్రీయుత వాడరేవు సీతారామాంజనేయ భాగవతార్‌గారికి నమస్కారములు. మీ "ఆంధ్ర హరికథా వాఙ్మయము సాంతంగా చదివి ఆనందించే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు.

హరికథావిర్భావము, క్రమపరిణామము, ప్రస్తుతస్థితి గురించి మీరు చేసిన కృషి ప్రశంస నీయము. మీరు సేకరించిన అమూల్యమైన సమాచారాన్ని చక్కగా విశ్లేషించి ప్రదర్శించిన విధానం ఎంతో బాగుంది. హరికథకు యక్షగానానికి గల సంబంధం ఇటీవల హరికథా విధానంలో వచ్చిన మార్పులు కథకుని లక్షణాలు నేటి దీనావస్థ వీటిని హృదయానికి హత్తుకునేటట్లు వర్ణించారు. హరికథలో మెళకువ తెలిసిన మీ స్వానుభవాన్ని పురస్కరించుకొని "అట్టి కాలక్షేపమొక పాలకడలి" గా చేసిన వివరణ (పుట 72) ఎంత హృద్యంగా ఉందో చెప్పలేను.

ఆంధ్ర సారస్వతంలో మీ రచన ఉన్నతస్థానం సంపాదించుకొందని మనవిచేస్తూ, శుభాకాంక్షలతో :

మీ

వసంత వేంకటరావు, M. sc.,

28-6-1979.

Research Officer,

విశాఖపట్నం—4.

ఆశీర్వచనము

శ్రీరస్తు చిరంజీవి సుప్రసిద్ధ హరికథా కథన ప్రవీణులు ప్రియ మిత్రులునగు వాడరేవు సీతారామాంజనేయ భాగవతులు B. A, కు కృతానేక మంగళాశీర్వాదములు.

తమరు వ్రాసిన "వింత విమర్శలు" (పురాణములు) అను గ్రథమును ఆమూలాగ్రముగ చదివి ఎంతో ఆనందించితినన్న అతిశయోక్తిగాదు. నాస్తిక వాదము ప్రబలిన యీ కాలమున యీలాంటి గ్రంథము లత్యంతావశ్యకములని నా నిశ్చయాభిప్రాయము, కర్ణునిగూర్చి మీ విమర్శనము అత్యంత నిర్దుష్టముగ నున్నదని చెప్పుటకు వెనుదీయను. కర్ణపాత్రనుగురించి మీరు ఎన్నియో గ్రంథములను పరిశీలించి ఆ పరిశీలనకు సునిశిత విమర్శనాత్మకమగు మీ బుద్ధిని తోడ్పరచి కువిమర్శకులకు కనువిప్పు గలుగునటుల రచియించితిరి. అటులనే రావణపాత్రనుగూడ బహుగ్రంథపరిశీలతతో విమర్శించి రచియించితిరి. అందులకు అనరణ్య రావణులవైరవిషయమే ప్రబలసాక్ష్యము. మీరింకను యిట్టి ఉత్తమ విమర్శగ్రంథముల రచియించి ఆస్తికత కాధారభూతులగునటుల పరమేశ్వరుడు మిమ్ముల కటాక్షించుగాక!

నెల్లూరు,
30-12-79.

ఆశీస్సులతో, భవదీయుడు,
త్యాగరాజ భిక్షువు,
శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి.

అభినందన

నేడు పవిత్రములైన మన పురాణములపై వింత విమర్శలు విరివిగా గానవచ్చుచున్నవి. ఇందులకు ముఖ్యకారణములు రెండు. మన ఆర్షసంస్కృతి మనకు దెలియకపోవుట. పాశ్చాత్య సంస్కృతి మనలో జీర్ణమయి యుండుట. ఇట్లు మనవారే మన పురాణములను విమర్శించుట శోచనీయము. అట్టి విమర్శలకు పండితులు తగిన సమాధానము చెప్పక ఔదాసీన్యము వహించుట అంతకంటె శోచనీయము. పురాణములందలి అమూల్యములగు అంతర్గతమయిన భావములను అవగాహన చేసుకొనలేని స్థితిలోనున్న నేటి ప్రజలు, భారతము వ్యభిచారముల పుట్ట రామాయణము అధర్మముల కట్ట అని చేయు వింత విమర్శలను నిజములేయని నమ్మెదురు. అట్టి కువిమర్శలకు చక్కని సమాధానములతో శ్రీ వాడరేవు సీతారామాంజ నేయులుగారు యీ గ్రంధమును రచించుట యెంతో ముదావహము. పురాణ ములు కేవలము చరిత్రలుగావు. అందు కావ్యాత్మగలదు. కావ్యములలో కల్పనము కొంత చోటు చేసికొనును. ఈ కారణముచే పురాణములు విమర్శ కనర్హములు. కాలానుగుణ్యముగ సాంఘిక ధర్మములు మారు చుండును. అందుచే ఒక కాలపు ధర్మములు తరువాత కాలమువారికి వింతగ దోచుట సైజము. పై విషయములను దృష్టిలో పెట్టుకొని పురాణము లను పరిశీలించిన మనకు వాని విలువ దెలియగలదు. అట్టి దృష్టితో రచించబడిన యీ గ్రంధము ఈకాలమునకు మిక్కిలి అవసరము. ఈనాడు కావ్యరచనకంటె నిట్టి కృతి యెంతయో ప్రయోజనకారి అనుటకెట్టి సందే హము లేదు. ఇందలి భాష నిర్దుష్టము, సరళమునగు గ్రాంధికము. సులభ గ్రాహ్యముగా నున్నదని చెప్పుటకు సంతసించుచు గ్రంధకర్తను అభినందించు చున్నాను.

కావలి,
2-1-1980.

పదాల రామమూర్తి,
విద్వాన్ అండ్ ఎం. ఎ.

అ భి ప్రా య ము

ఆడలేని బోగముసాని మద్దెలమీదబడి కొట్టుకొనినడను నానుడికి తగినట్లు స్వార్థపూరితులగు నేటి జనులు తమకుతాము బాగుపడజాలక తమ తప్పిదములను కప్పిపుచ్చుకొనుటకై పురాణములు తమ అభివృద్ధికి ఆటంకములని పలుకుట మనము వినుచున్నాము. ఇట్టి యభిప్రాయము సరియైనదిగాదు.

మానవుడు మానవతాదృష్టితో బ్రతుకుటకు తోడ్పడునటివి పురాణములు. ప్రపంచము మంచిచెడుల కలయికయని తెలుపునట్టివి పురాణములు. ప్రభుత్వము ప్రభుత్వాంగములతోబాటు ప్రపంచ శాంతికి దోహదమొసంగునవి పురాణములు. ఇట్టి పురాణములను గూర్చి అపోహలు అనుమానములు గలవారు చదువదగినట్టిదీ గ్రంధము. ఆధునికముగ ఆసక్తి జనకముగ సులభశైలిలో రచింపబడిన యీ "వింత విమర్శలు" అను గ్రంధకర్త శ్రీ వాడ రేవు సీతారామాంజనేయులు ధన్యుడు. ఈయన భక్తుడు భాగవతారు. నాకు మిత్రుడు. ఈ గ్రంధ పఠనము ఆధునికుల కెంతయో ఉపయోగపడుననుటలో సందేహమునకు తావులేదు. గ్రంధకర్తను హృదయపూర్వకముగ అభినందించుచున్నాను.

ఇట్లు,

బడి గురవారెడ్డి,

మాజీ ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక

సాహిత్య అకేడమీల సభ్యుడు.

నెల్లూరు,

31-12-1979.

గ్రంథ ముద్రణకు ఆర్థిక సహాయ మొనరించిన దాతలు

శ్రీ ఒ. యస్. సాకరియా జైన్‌గారు,
ఆచారి వీధి, నెల్లూరు రు 116-00

శ్రీ పొన్నాల రామసుబ్బారెడ్డిగారు,
రామకృష్ణ నాట్యమండలి, నెల్లూరు రు. 75-00

శ్రీ పేటేటి వెంకటేశ్వర్లుగారు,
ఆనంద జ్యూయలరీ, నెల్లూరు రు. 58-00

శ్రీ కొండా శేషారెడ్డిగారు, పెనుబల్లి	రు.	58-00
శ్రీ కర్లపూడి పుల్లపనాయుడుగారు, ఒవ్వేరు	రు.	58-00
శ్రీ వేముల ఆదిశేషయ్యగారు, కట్టుబడిపాలెం	రు.	50-00
శ్రీ తాటిపర్తి ప్రసాదరావుగారు, నాయుడుపేట	రు.	25-00
శ్రీ ఎం. ఎస్. సూర్యనారాయణగారు	రు.	25-00
శ్రీ బి. కిరీటిగారు	రు.	25-90
శ్రీ ఏ. వెంకటేశ్వర్లుగారు	రు.	20-00
శ్రీ కంచర్ల సుబ్రహ్మణ్యంగారు	రు.	20-00
శ్రీ ఎం. శేషాద్రిరావుగారు	రు.	20-00
శ్రీ ఎం. సూర్యప్రకాశంగారు	రు.	20-00
శ్రీ పి. రంగనాథంగారు	రు.	20-00
శ్రీ పొందూరు లక్ష్మీనరిసింహంగారు	రు.	20-00
శ్రీమతి రామాయణం వరలక్ష్మమ్మగారు	రు.	20-00

మరియు....

వై. వి. శాస్త్రిగారు, బచ్చలి సుబ్రహ్మణ్యంగారు, పంచాగ్నుల జానకిరామశర్మగారు, ఎం. వి. సుబ్బయ్యగారు, చుండి శ్రీరాములుగారు, దుగ్గిశెట్టి రమణయ్యగారు, కశ్శెట్టి కృష్ణమూర్తిగారు, డి. సి. వి. సుబ్బారావుగారు, శనగవరపు సుబ్రహ్మణ్యంగారు, నర్లా రామమూర్తిగారు, అర్రా కృష్ణమూర్తిగారు, బి. సత్యనారాయణగారు, కానుగో సుబ్బారావుగారు, కె. వి. సుబ్రహ్మణ్యంగారు, ఎ. రత్నమ్మగారు, ఎ. ఇందిరమ్మగారు, కె. కామాక్షమ్మగారు, భట్టారం కృష్ణమూర్తిగారు, పి. శ్రీరాములురెడ్డిగారు, ఆర్. వి. యస్. హనుమంతరావుగారు. కె సుబ్రహ్మణ్యంగారు, వి. రామారావుగారు పునుగు శేషశాస్త్రి భాగవతార్‌గారు. ఎం. శంకరరెడ్డి భాగవతార్ గారు, బి. శేషయ్య భాగవతార్‌గారు, వి. శ్రీరాములు భాగవతార్‌గారు, దేగా వెంకటసుబ్బయ్య భాగవతార్‌గారు, సుగుణ భాగవతారిణిగారు, సావిత్రి భాగవతారిణిగారు, ఎన్. మహేశ్వరి భాగవతారిణిగారు, సి. హెచ్. భవానీబాయి భాగవతారిణిగారు, వేల్పుల సరస్వతి భాగవతారిణిగారు, వాణిశ్రీ భాగవతారిణిగారు, నందనవనం వెంకయ్యగారు, ధూళిపాళ శ్రీనివాసరావుగారు, శింగరాజు పుల్లయ్యశర్మగారు, కె. రాజారావుగారు. వాడరేవు వెంకటేశ్వర్లుగారలకు నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనము లర్పించుకొనుచు పురాణపురుషుడు వారినెల్లర సదా రక్షించ ప్రార్థించుచున్నాను.

ఇట్లు,
రచయిత,
వాడరేవు సీతారామాంజనేయులు బి. ఏ.,
భాగవతార్.

వింత విమర్శలు

(పురాణములు)

ఓంకారముతో ప్రారంభమైనదటి ప్రపంచం. నవనాగరిక మను పేరిట విలసిల్లుచున్నదీనాటి ప్రపంచం. మహా అహంకార మమకారములతో మిన్నుముట్టినదిప్పటి ప్రపంచం. శివస్మరణ తగ్గి సిగ్గువిడచి శృంగారమే ప్రధానరంగముక గలిగి యున్నది నేటి ప్రపంచం. వారించువారు నిర్వీర్యులైనారు. క్రీడించువారు కోవిదులైనారు యంత్రాగారములు మెండైనవి. మంత్రశాలలు మాయమైనవి, సిల్కుదుస్తుల తళుకుబెళుకులు మెళకువగ లోకమును మోసబుచ్చుచున్నని, ధమ ధమయని డప్పులతో తమ గొప్పను తామే చాటుకొనుచున్నారీనాడు పరుని గొప్పను పరికించలేని పామరులు! నహినహియని యాచకులకు సున్నాజుట్టు సంపన్నులు మితిమీరిన సుఖములో సౌఖ్యము సున్నయని యెరిగి మనస్సును మత్తులో ముంచి మూర్ఖులై మనుచున్నారీనాడు పాపం, మహాత్ములగు ఋషులపై పుట్టగొడుగులవంటి యీనాటి పండితులు విమర్శయను నాయుధమును చేబట్టుటయా! అరెరె ఏమిటీవిమర్శ? ఎందులకీవిమర్శ? అన్నింటికీవిమర్శే, అడుగడుగునకు విమర్శే, వింత విమర్శ, విడ్డూరపు విమర్శ. ఆహా! ఏమి యాధునికము, ఎంత విపరీతము, అంతయూ మార్పే, అర్థములేని తీర్పే, ఇంట

మార్పు, బయట మార్పు, మనసు మార్పు, మాట మార్పు, భాషమార్పు, వేషం మార్పు, మతం మార్పు, మార్గం మార్పు, కులం మార్పు, కూడు మార్పు, సాహిత్యం మార్పు, సంస్కృతి మార్పు ఈ మార్పుకు తుది యెక్కడో? అంత మెప్పుడో? అయినా కాస్త్రైశ్వర్య మొచ్చినదని ఆనందం శృతి మించరాదు సుమా! ఒకనాటికందర మొకేచోటికి జేరుట తప్పదను విషయము తెలిసినదే గదా! ఓయీ భాయీ! ముందు నిన్ను నీవెరిగి పిదప పరులకు నుడువవోయీ! నడుమవచ్చిన సిరి నడుమనే వీడునోయీ! ఔరా ఎంతచెప్పినా వినవుగా! కాలం ఖర్మం కలిసిరావాలి నీ అజ్ఞాన తిమిరం పోవాలంటే అందమగు యీయనంత సృష్టికి అల్పుడవు నీవా కర్తవు?

ఆహా! విజ్ఞానశాస్త్రమొచ్చినా వొచ్చినదిగాని యీ మార్పు దేవత మానవ ప్రపంచాన్ని మారెమ్మ వలె ఆవేశించినది. ప్రపంచము ప్రక్కత్రోవలు ద్రొక్కుచున్నది. గమ్యములేని నిర్ణయముతో అగమ్యగోచరమగు యానందమునకై పయనించుచున్నది. గగనము భూమిపై యెచ్చట వంగినదాయని వెదకుచు వెళ్ళినటులున్నదీ మార్పుల ప్రయాణము. ఈ మార్పు సాహిత్యరంగమున సయితము కొట్టవచ్చినట్లు పట్టపగ్గములు లేక పరుగిడుచున్నది.

కావ్యసృష్టి కరిగిపోయినది, అదువాద మంతరించినది, కష్టమగు కవిత్వము నిష్ఠురము దెచ్చుచున్నది. దిగంబర కవిత్వమునకు దివ్యత్వ మబ్బినది. భావకవిత్వమునకు పండుగ. పండితుని

భావములకు ఎండుగ. నవలలకు విలువ, నీతులకు చలువ. ఇట్టి ఆధునిక గ్రంథములన్నింటిలో మనకు ముఖ్యముగ గన్పట్టునది విమర్శ. ఆ విమర్శ పరమార్థమేమాయని పరిశీలింప పాతది రోత, క్రొత్తది వింత. పూర్వుల జ్ఞానులు, ఆధునికులు, విజ్ఞానులు, గతము చెడ్డది, వర్తమానము మంచిది. ఇట్లు అంతయు తలక్రిందులే. ఇట్టి విమర్శతో మంచిని చెడ్డగ, చెడ్డను మంచిగ మార్పుచేసి అందమైన గ్రంథములను సుందరముగ సృష్టించబడుచున్నవీనాడు. పూర్వులవునన్నది కాదనుటయే ఆధునిక సాహిత్యాశయము. న్యాయవాదులు కొందరు అన్యాయవాదమును జీవనాధారముగ జేసుకొని దోషిని నిర్దోషిగ, నిర్దోషిని దోషిగ నిరూపించినటులున్నదీనాటి విమర్శనా ప్రపంచం.

రాక్షసులు సమర్థులు, దేవతల సమర్థులు, రావణుడు వీరుడు, రాముడు భీరుడు, కంసుడుత్తముడు, కృష్ణుడు క్రూరుడు, పాండవులు చెడ్డవారు, కౌరవులు మంచివారు, అని వ్రాయబడి గ్రంథములను చదువునప్పుడాధునికుల యానందమునకు హద్దుయుండదేమో? వీరలకు శిశుపాలుడు సన్మార్గుడు, జరాసంధుడు సచ్ఛీలుడు, కీచకుడు కళారాధకుడు, సైంధవుడు చక్కని రశికుడు, ఇక శూర్పణఖ శుద్ధ పతివ్రత, తాటకి యుత్తమ వనిత, పూతన పుణ్యవతి, మంధర మహాయిల్లాలు. ఇది ఆధునికపు పోకడ. ఇట్టి తలక్రిందుగ వర్ణించబడిన యీనాటి కృత్రిమ గ్రంథపఠన ప్రభావమున తినగ తినగ వేము తియ్యనుండుననినట్లు వినగ

పేనగ ఆధునిక మానవుని ఆచార వ్యవహారములు అనుకోకుండగనే మార్పులకు లోనగుచున్నవి.

ఆధునిక షటాచారములకు హద్దు పద్దులు నీతి నియమములు మంచి చెడ్డలను పట్టింపులు లేవు. అన్నియు మంచివే, అంతయు మంచిదే, సర్వము అనుభవింపదగినదే. అనుభవించుటకే మనము పుట్టినది. ఇది ఆధునిక తత్వము. ఇందులకు విరుద్ధము పూర్వీకము, సనాతన ధర్మములు ఇంద్రియ భోగములకు హద్దు లేర్పరచినవి, పాప పుణ్యములకు తూకమేసినవి అట్టి కట్టుబాట్లేవియు లేవుగనుకనే ఆధునిక పుటలవాట్లు అవలీలగా వ్యాప్తినొందుచున్నవి. ఇట్టి ఆధునిక కల్పిత రచనాప్రాబల్యమున మానవ సమాజము మనకు తెలియకుండగనే మారిపోవుచున్నది. ప్రేక్షకుల నాకర్షించి పదిరూపాయలు సంపాదించుటకై చలన చిత్ర పాత్రధారులు అడుగడుగునకు అందముగా వేషములు ధరించుచు చిత్రవిచిత్రములుగల వస్త్రధారణ సినిమాలలో చేయుచుందురు. కాని నేటి ప్రేక్షకలోకము ఆ యర్థమును మరచి తామే చలనచిత్ర పాత్రధారులవలె పూటకొకబట్ట కట్టుటకలవాటు పడినారు. చూచితిరా మానవజీవితము గాలివాటమునబోవు ఓటి పడవవలె ఎట్లు పయనించుచున్నదో?

చంద్రమతి మంగళసూత్రము భర్తకు దప్ప పర పురుషునికి గన్పింపకుండునటుల వసిష్ఠ మహాముని యొక్క శాసనమున్నదని పురాణ గాథలందు మనము వినుచున్నాము. అట్టి

పురాణము లాదర్శముగ గైకొనిన పూర్వపుస్త్రీల మంగళసూత్రములు పెనిమిటులకు దప్ప అన్యులకనుపించకుండుట యలవాటుగా నున్నదని తెలిసిన విషయమే. కాని చలనచిత్ర ప్రభావముచే నేటి స్త్రీల మంగళసూత్రములేగాక తత్ప్రాంత సీమలుగూడ కన్నులపండువుగ గాంచుటకు భర్తతోబాటు పరులకుగూడ సదవకాశము సులభముగ లభ్యమగుచున్నది. ఔరా! పరికించండి ప్రచార ప్రభావము ప్రజలపై నెట్లు పనిచేయుచున్నదో? ఇట్టి వారికి పురాణములు రుచించుటెట్లు? అందువలననే పురాణములను బూజుపట్టిన వనుచున్నారీనాటి నవనాగరికులు. ఎందువలన తాళిబొట్లు ప్రాంతములట్లు మారినవని యంటే తమ తాళిబొట్లను జూచి పరాయివాడు తమవైపు జూడకుండుటకై యని ఒకామె వ్యాఖ్య. తల్లులవంటి పరస్త్రీలను తన్మయత్వముతో గాంచుట తప్పుగదా యని యంటే నేనామెను జూడలేదు. ఆమె అందమును మాత్రమే పరికించి బ్రహ్మసృష్టిని పొగడుచుంటినని ఒక ఆధునిక పండితుని విమర్శ. నువ్వొకందుకు పోసితివి, నేనొకందుకు త్రాగితినన్న సామెతగ యున్నదీనాటి కల్పిత కవితా శిల్ప రచనాప్రభావము. అందమునకు ఆనందమునకు వ్యాపారమునకు కాలక్షేపమునకు సృష్టించబడిన రచనా సమూహము కాలక్రమేణ సాహిత్యమును సంస్కృతిని ఆచారమును అలవాట్లను ఆస్తికతను ఆధ్యాత్మికతను తలక్రిందుగ మార్పుచేసి వికృతముగ వికారముగ మానవాళిని గంతులు వేయునట్లు గావించుచున్నది.

ఇట్లు వికారముగ వింతవింతగ వితండముగ పురాణముల పై చేయు విమర్శలకు సమాధాన విమర్శనమే యీ గ్రంథరాజము.

వింతవిమర్శ వితండవాదనకు యుదాహరణముగ కర్ణుని పాత్ర నిందు చర్చించబడినది. కర్ణుడు దాత, త్యాగశీలి యని లోకములో ప్రసిద్ధమైయుండ అందులకు విరుద్ధముగ యిందు జూపిన వాదన చదువరుల కచ్చెరువుగనే గన్పట్టును. అయినను నిష్పక్షపాత బుద్ధులకు యీవాదన సబబుగనే దోచును.

కర్ణుడు త్యాగశీలియా ?

తన సహజకవచ కుండల దానము, రాయబార సమయమున కృష్ణుడాశజూపిన కాంతాకనకముల తిరస్కారము దుర్యోధనునిపై గల స్వామిభక్తి, అర్జునునిదక్క అన్యుల జంపనని శపథమొనర్చి మాతృఋణము దీర్చుకొనుట. దానగంట తనయింట నెలకొల్పి అడిగినవారికి లేదనక దానమిచ్చుట, ఒకసారి గురితప్పిన నాగాస్త్రమును రెండవమారు వేయ నిరాకరించుట, పసిబిడ్డగ నున్నపుడే తల్లిచే గంగలో పారవేయబడుట, పరశురామునిచే శపింపబడుట, శల్యుడు సారథియై నిరుత్సాహపరచుట, విరథుడై యున్నపుడు తాను చంపబడుట, కర్ణుని పొగడ్తలకాధార భూత కారణములైనవి. అంతేగాని అతని చర్యలలోని రహస్యమును యూహించిన కర్ణుడతి కపటి దుర్యోధనుని మించిన దుర్మార్గుడని తెలగలదు,

విద్యా ప్రదర్శనలో కర్ణుని ప్రవేశము సక్రమమా?

కురుకుమారుల విలువిద్యా నైపుణ్య ప్రదర్శన సమయమున అర్జునుని నేర్పునకు సభికులు జేజేధ్వానములు జేయుచుండ కర్ణుడాసభలోనికి ప్రవేసించి అర్జునునకెదిరి నిలుచుట కర్ణునునిది అక్రమమని ద్రోణుడే చెప్పియుండెను. మంచిదో చెడువో ఆయా కాలములలో అమలునందున్న రాజ్యాంగ చట్టమును బట్టియే మనుజుల ప్రవర్తనల మంచిచెడ్డలు న్యాయాధిపతులు నిర్ణయించుటమనిమిపుడెరింగిన విషయమేగదా! రాజ్యాంగమును ధిక్కరించినవాడు శిక్షార్హుడు. అట్లు పరిశీలించినచో రాజవంశీయుల విద్యాప్రదర్శన సభలోనికి సూతపుత్రుడు ప్రవేశించుట ఆనాటి ధర్మశాస్త్రమునకు పరమ విరుద్ధము గనుక కర్ణునిచర్య అక్రమమని చెప్పవలయును. అధికారుల సభలలో అనధికారులు ప్రవేశించుట ఎట్లు నరిపడదో అట్లే కురుకుమారులకై ఏర్పాటు గావించిన సభలో సూతపుత్రుడనబడు కర్ణుడు గూడ ప్రవేశించుట సమంజసముగ లేదు. కర్ణుడుగూడ ద్రోణునిశిష్యుడే. సూతుడౌ అతిరథుడు కర్ణుని బాల్యముననే దెచ్చి ద్రోణ కృపులయొద్ద శిష్యునిగా జేర్చి పోయెను. కానీ ఈ విలువిద్యా ప్రదర్శన ద్రోణశిష్యులకై యేర్పాటు గావించినదిగాదు. కురుకుమారులకై యేర్పాటైనది. అందుచే అట్టిసభా ప్రవేశము కర్ణునకర్హముగాదు. అయినను ద్రోణుని అనుమతి పుచ్చుకొని సభలో ప్రవేశించి కర్ణుడు అర్జునుడు చూపిన విద్యల నెల్ల ప్రదర్శించి మెప్పుబొందెను. కౌరవులు సంతసించిరి. దుర్యో

ధనుడు కర్ణుని సఖ్యము గోరెను. అంతటితో కర్ణుడు సరిపెట్టుకొని యున్నచో కర్ణుని గౌరవము ఇనుమడించి యుండెడిది. కానీ అర్జునుని తనతో ద్వంద్వయుద్ధమునకు రమ్మని పిలుచుటలోనే కర్ణుడు కయ్యాలమారివాడని దెలియుచున్నది. అనవసరముగ తగాదాకు రమ్మని పిలచినపుడు ఎట్టివారికైనను కోపము వచ్చుట సహజము. అపుడర్జునుడు కోపగించి కర్ణుని సభాప్రవేశమును ఆక్షేపించెను. రాజపుత్రుల సభలోనికన్యుల ప్రవేశ మాక్షేపనీయమని పలికెను. కౌరవుల ప్రోత్సాహమున ద్వంద్వయుద్ధము జరుగుచుండ నడుమ ప్రవేశించి కృపాచార్యులు కర్ణుని కులగోత్రముల నడిగెను. ద్వంద్వయుద్ధ శాస్త్రనిపుణుడు కృపాచార్యుడు అర్జునుని ప్రశ్నను ఆమోదించి కర్ణుని యాక్షేపించెను. కాని కర్ణుని కయ్యంపుతనమునకు దుర్యోధనుడు అగ్నికాజ్యమువలె తోడయ్యెను. కర్ణుని కంగ రాజ్యమిచ్చి ఆతనిని రాజనిపించెను. ఈచర్యకు కురువృద్ధుల యనుమతి బుద్ధిపూర్వకముగ లభింపలేదు. పొగరుబోతుబిడ్డలు చేయు చెడ్డపనులను వారింపలేని వృద్ధులు అయిష్టముతో తలలూపినట్లు కురువృద్ధులు కర్ణుని కంగరాజ్యాభిషేకము నామోదించిరి.

అంగరాజ్యాభిషేకము న్యాయమా ?

రాజ్యము వీరభోజ్యముగనుక తాను యుద్ధమొనరించి గెలిచి సంపాదించినచో అది న్యాయముగనే యుండును. లేదా వారసత్వముగ సంక్రమించిననూ సరియైన రాజ్యార్హుడే కర్ణుడని యనవచ్చును. అటుగాక దాయాదుల ఔన్నత్యమున కోర్వజాలని దుర

భిమాని దుర్యోధనుడు పాండవుల నదుపులోనుంచుటకై పెద్దలతో యాలోచింపకనే కర్ణుని అంగదేశపు రాజుగ జేసెను. ఇది చట్టవిరుద్ధము. రాజ్యాభిషేకమునకొప్పుకొనుట కర్ణుని ఆశపోతుతనమునకు నిదర్శనము. శ్రీకృష్ణుడాశజూపిన రాజ్యాభిషేకమును తిరస్కరింపగలిగిన త్యాగశీలి అంగరాజ్యమేల తిరస్కరించి యుండరాదు? వృద్ధనారీపతివ్రత అనుసామెతగా అన్నిభోగములననుభవించిన పిదప వృద్ధాప్యములో లభింపబోవు రాజ్యాధికారము కృష్ణుడాశజూపినది గావున కర్ణుడప్పుడు నిరాకరించగలిగెను. ఇప్పుడట్టి కర్ణుడు గాడుగదా! మంచి యౌవనములో నున్నకోడెకాడు, కోడెవయస్సులో కోరికలు గలిగియుండుట సహజమేగదా! గనుక కర్ణుడు అసామాన్యుడుగాడని తెలియనగును.

దానగంటలోని రహస్యము

కర్ణుడు తనయింట దానఘంట కట్టించెను. ఆయనను మించ దలంచి సుయోధనుడుగూడా నొకదానఘంటను కట్టించెను. కాని కర్ణుడు దానముచేయుటలో సుయోధనుని మించెను. కర్ణుని పరీక్షించుటకై ఇంద్రుడు బ్రాహ్మణవేషధారియై వర్షాకాలమున వంటకట్టియలకై వచ్చి యాచించెను, ముందు రారాజుయింటికేగెను. ఆతడు వీలుగాదనెను. కర్ణుడు తనయింటిని పడగొట్టి ఇంటికొయ్యలను దానమిచ్చెను. అందులకు సిగ్గుజెంది సుయోధనుడు తన దానఘంటను విప్పి పారవైచెను. ఇది కర్ణుని గొప్పదనమును చెలుపునట్టి యొకకథ. ఈకథనుబట్టి కర్ణుడు గొప్పదాతయని పేరువహించి

యున్నాడు. యదార్థముగ పరిశీలించినచో కర్ణుడంతటి గొప్ప దాన పరుడు గాడని విదితమగును. అల్పసంపాదనను అన్యాక్రాంతము గావించినటుల కష్టార్జితమును ఖర్చుపెట్టుట బహుదుస్తరమైన విషయము, గనుక కర్ణుని దానము అత్తసొమ్మల్లుడు దానమొసర్చి నటులున్నది. ఆవేశములో ఆక్రోశముతో ఈర్ష్యాసూయలు ఆవహింప దుర్యోధనుడపుడు కర్ణున కంగరాజ్యమివ్వగలిగినాడు కానీ ఆస్థితిలో యిపుడతడులేడు, అందుచే నిజమైన మానవప్రవృత్తి ననుసరించి బ్రాహ్మణునకు దుర్యోధనుడు తనయిల్లును పడగొట్టి యివ్వలేక పోయినాడు, ఇక కర్ణుని బంగళా తనస్వంతముగాదు. పిత్రార్జితముగాదు. ఒకపొగరుబోతు తనకొట్లాటలలోసాయపడుటకై మరొక మదించిన బలిష్ఠునకు బహూకరించినట్టిది. ఒకవేళ ఆ భవనము పోయినను స్నేహితుడు తనకింకొక మేడను యిచ్చునను ధైర్యము కర్ణునకుగలదు. అర్జునుని హతమార్చెదనని పలుకు వినబడిన జాలును కౌరవాగ్రజుడు కర్ణునకొక బహుమతి పారవేయును. బ్రతికినంతకాలము పాండవుల జంపెదమని ప్రగల్భములు గొట్టుచు కౌరవుల పంచ జేరి పొట్టబోసుకొనుచున్న కర్ణుని దానము విలువ నివ్వదగినది గాదని మనమేల యాలోచింపరాదు?

కవచకుండల దానము శ్లాఘనీయమా?

తన ప్రాణములకు హానియని దెలిసియూ ఇంద్రునకు సహజకవచ కుండలములు దానమిచ్చిన త్యాగశీలి యట కర్ణుడు. పరిశీలించినచో ఇదియును నిజమైన దానముగాదని తేటతెల్లము

గాగలదు ఎప్పుడీ దానము చేసినది? పాండవుల అరణ్యవాసాంత మున, యుద్ధమునకు పూర్వము, అప్పటికే కర్ణుడు వయసుపండిన ముదుసలి. ఒకప్పుడు కర్ణుడు కృష్ణునితో నిట్లనెను, కృష్ణా! నీవు విష్ణుమూర్తివని నేనెరుంగుదును. పాండవులు జయింతురని నాకు దెలియును, గనుక నేను తనకు అన్ననగుదునను సంగతి ధర్మజున కెరిగింప వలదనియు ధర్మమే పక్షమునసున్న ఆ పక్షమే యుద్ధములో గెలుచుననియు రాయబార సమయమున కృష్ణునితో కర్ణుడు పలికెను. అటుల తన మరణము నెరింగిన కర్ణుకు ఎదిరి గెలుపు తథ్యమని దెలిసీన కర్ణుడు వయస్సు మళ్ళి శరీరము కృశించి నశింపునకు సిద్ధముగా నున్న తన సహజ కవచ కుండల ములను గోసి యిచ్చుట గూడ యొక గొప్ప కార్యము క్రింద పరిగణింప వచ్చునా? యని సంశయము కలుగును. కవచకుండ లముల దానము గ్రహియింప వచ్చినవాడు దేవేంద్రుడేనని తన కింతకు పూర్వమే సూర్యుడు చెప్పి యుండుట ద్వారా తెలియును. "ఇంద్రునికి నీవు సహజ కవచ కుండల దానము చేయవలదు. ప్రాణమునకు హాని దెచ్చుకొనవలదని సూర్యుడు తనకు చెప్పి నపుడు" అంతటి ఇంద్రుడే వచ్చి నన్ను యాచించినచో నాకు అంతకన్న మిన్నయగు భాగ్యమేమున్నది? ఆయనకు దానమిచ్చిన యడల మిక్కిలి కీర్తి తద్వారా పుణ్యము లభించును. గనుక నేనాతనికి దానము చేయకుండ నుండ జాలనని కర్ణుడు సూర్యునకు జవాబు చెప్పియుండెను. అట్టి గొప్పవానికి దానము చేయుటలో కర్ణుని గొప్పతనమీషన్మాత్రమును లేదని ఘంటాపథముగ జెప్ప

వచ్చును. స్వర్గలోకాధిపతియగు దేవేంద్రునకు దానము చేయ నిరాకరించువాడెవడుండును ? సామాన్యుడు సయితము దానము చేయగలడు. ప్రధాన మంత్రియో రాష్ట్రపతియో జోలె బట్టుకొని భిక్షమున కొచ్చినచో కటిక దరిద్రుడు గూడ నలుగురు చూచుటకో లేక గొప్పవారి దృష్టిలో బడుటకో గొప్పవాడు తన వాకిలి ముందున కొచ్చెనను సంబరము చేతనో తలతాకట్టు బెట్టియైనను దానకార్య మాచరించు చుండుట నైజము. నిజమైన దానము దరిద్రునకు జేసినదేగాని భాగ్యవంతునకు జేసినది గాదుగదా ! నేత్ర దానములు రక్తదానములీకాలములో గూడ ఎందరు జేయుటలేదు? పదిపావుల కొరకై ఇన్స్యూరెన్సులు కట్టి బుద్ధిపూర్వకముగా ప్రాణములు పోగొట్టుకొనువారల నెందరిని మనమిపుడు గాంచుట లేదు ? గనుక ఇందుకర్ణుని గొప్పదన మేమున్నది ? మరియు ఇంద్రునకు దానమిచ్చినందున కలుగు ఫలితము పుణ్యసము పార్జనము. ఈ విషయములను మున్నె యెరింగి స్వార్థచింతనతో దానముజేసిన రాధేయుడు ముమ్మాటికి స్వార్థపరుడని వేరుగ చెప్పనవసరములేదు. అంతియేగాక కవచకుండలదానమునకు బదులుగ ఇంద్రుని వద్దనుండి 'విమల' యనుశక్తి నాయుధమును బదులుగ పొందిన కర్ణుని దానములో పరిపూర్ణత్వము లేదని విశదమగుచున్నది. మరియు కవచకుండలముల గోసి యిచ్చినందున తన శరీరమునకగు గాయము, తోడనే మానున్నట్లు శరీరమారోగ్యముగ నుండునటుల ఇంద్రునిచే కర్ణుడు వరముల బొందియుండెను. ఇక యిట్టిదానములో కర్ణుని గొప్పదనమేము

న్నదో గమనింపుడు. తమ్ము జయించుటకుగల యుపాయమును ధర్మరాజునకు జెప్పి ధర్మసంస్థాపన కొఱకై తమ ప్రాణములు పోగొట్టుకొనిన భీష్మ ద్రోణులు సర్వదా శ్లాఘనీయులు. ఇట్టి మహనీయులతో పోల్చిన కర్ణుని ప్రాణత్యాగము సూర్యుని కాంతిముందు మిణుగురు పురుగు వెలుగువంటిదని దెలియగలము.

దేవేంద్రుడు డేగగా అగ్నిదేవుడు పావురముగా మారి శిబి చక్రవర్తి దానమును పరీక్షింప వచ్చిరి. డేగ తరుముచుండగా పావురమొచ్చి శిబిని శరణువేడెను. తనయాకలి దీరుటకు పావురమును విడువమని డేగ శిబినిగోరెను. పావురమును రక్షించుటకై డేగకాహారముగ శిబి తన మాంసమునంతయు యిచ్చెను. తాను చావ సిద్ధమయ్యెను. డేగ ఇంద్రుడేనని శిబికి తెలియదు. కానీ తనను దానమడిగిన బ్రాహ్మణుడు ఇంద్రుడేనని కర్ణునకు తెలుసును, గనుక వీరిలో దానవీరుడెవ్వడో పరిశీలించిన కర్ణునికంటె శిబిచక్రవర్తి వెయ్యిరెట్లధికమని విదితమగును. అయితే శిబి యుగము వేరు. కర్ణుని కాలము వేరుగదా! కృతయుగపు ధర్మములను ద్వాపరయుగముతో పోల్చరాదని యనవచ్చును అట్లగుచో ద్వాపరయుగపు విషయములను కలికాలపు భావనలతో పోల్చి విమర్శింపవచ్చునా?

కర్ణుడు వీరుడా?

ఆధునికమున కర్ణుని దానవీరశూర యని సంభోధించుట వినుచున్నాము. సూక్ష్మదృష్టితో పరిశీలించిన కర్ణునకీ బిరుదులు,

సరిపడవని బోధపడును. ద్రోణునికి గురుదక్షిణగా ద్రుపదుని అర్జునాదులు బంధించి తెచ్చిరే గాని దుర్యోధనునకు సహాయముగా కర్ణుడాపనిని జేయజాలకపోయెను. ద్రౌపది స్వయంవరమునకేగియూ మత్స్యయంత్రమును గొట్టలేకపోయేను. పాండవరాజసూయము వంటి దానిని కర్ణుడు సుయోధనునిచే జేయించి యుండవచ్చును. అట్లు చేయలేకపోయేను. మయసభలో అవమానపడి దుఃఖించు దుర్యోధనుని శకుని ఓదార్చెనేగాని కర్ణుడోదార్చడాయె. ఘోష యాత్రాసమయమున అడవిలోని పాండవుల నేడిపించబోయిన కౌరవులు గంధర్వులచే బంధింపబడగా వారిని భీమార్జునులు విడిపించిరేగాని కర్ణుడేమియు జేయజాలడయ్యె. ఉత్తర గోగ్రహణ కాలమున కిరీటి వేసిన మోహనాస్త్రమున కందరును కర్ణునితోసహ మూర్ఛ మునింగిరేగాని కర్ణుడప్పుడేమియు కౌరవులకు సాయము చేయకపోయేను. ఇట్టికర్ణునికి వీరుడను బిరుదెట్లు కలించెనో ఆశ్చర్యముగా యున్నది. ఆయనకు గల శాపములు గూడ అంత్యకాలమున సంభవించెనేగాని అంతకుపూర్వము గాదుగదా! మరి కర్ణుడేల జయములు పొందలేదు? తనకుగల శాపముల నెరింగియున్న కర్ణుడు ముందు జాగ్రత్తలో నుండి జరుగబోవు ప్రమాదముల తప్పించుకొన యత్నించ వలయునేగాని వెర్రిమొగ మువలె నేలగ్రుంగిన రథ చక్రమును నెత్తజాలక అర్జునునితో తనను జంపుట పాటిగాదని బేరమాడుట హాస్యాస్పదముగ యున్నది. ఇట్టిపని ఆతని యవివేకమును వెల్లడిచేయుచున్నది గదా! ధీరుడను బిరుదర్జుననకే జెల్లును గాని కర్ణున కన్న

యించదు. ఆతఁడొనర్చిన యద్భుతములలో నీతఁడొక్కటియును
చేసి యుండలేదు.

ద్రోణుడు తన శిష్యులలో ఫల్గుణుని అగ్రగణ్యునిగానెంచి ఆతడు తనతో పోరాడకుండునటుల గురుదక్షిణగా వరము గైకొనెనే గాని అట్టి వరమును కర్ణుని గోరియుండలేదు. విద్యార్థుల యేకాగ్రతను పరీక్షించుచు ఒక చెట్టు మీఁద గల పక్షిని గురిచూచుచుండ విద్యార్థులను ప్రశ్నించెను, ఆ పరీక్షలో అర్జునుడు నెగ్గెనే గాని కర్ణుడు నెగ్గలేదుగదా ! ద్రోణుడొకవేళ పక్షపాతియని తలంతుమా తనకు కుమారుడయిన అశ్వత్థామను సయితము తిరస్కరించి అర్జునుని ప్రేమించి విద్యగరపిన ద్రోణుడు నిష్పక్షపాతియని రూఢియగుచున్నది. తక్కువకులజుడని కర్ణుని చిన్నచూపు చూచెనని ద్రోణుని విమర్శింతుమా, అట్టిభావన ఆయనకున్నచో అసలు కర్ణుని తన శిష్యునిగనే చేర్చుకొని యుండెడివాడు గాడుగదా! అందాల సుందరీ మణులలో మిన్న అయోనిజ అగ్నిసంభవ రాజలోకమున కందని మావియగు ద్రౌపదిని మత్స్యయంత్రమును గొట్టి వెంట బెట్టుక వచ్చిన భీభత్సుడు, తల్లి మాట మేరకు పెద్దలను గౌరవించి తనకు సర్వహక్కులుగల కృష్ణను సోదరుల కప్పగించుట త్యాగమా ! లేక వయస్సు మీరిన ద్రౌపదిని తన హృదయమును పరీక్షించుటకై నామకార్థముగ కృష్ణుడాశ జూపిన ద్రోపదిని వృద్ధుడగు కర్ణుడు నిరాకరించుట త్యాగమా ? యని పలికించి చూడ అర్జునుని త్యాగము మిన్నయని గ్రహింప నగును.

సంపూర్ణాధికారమును గలిగి సోదరులలో అధికబలుడై యుండియు ద్రౌపదీ కాంతను త్యాగమొనర్చిన వాడర్జునుడు. ఊరక తనకు జూపిన ఆశను మాత్రమే త్యజించినవాడు కర్ణుడు.

ద్రౌపదిని మించిన యందగత్తె ఊర్వశి. పుణ్యపురుషులకు స్వర్గములో సౌఖ్యము నిచ్చునది. జరామరణములు లేని యప్సరస. నిత్య యౌవనవతి. సర్వులు యనుభవించు టకర్హురాలైనట్టిది. ఆమెకు లోబడి మహర్షులెందరో తమ తపోభంగములు గావించు కొనిరి. అట్టి సుందరి తనకు తానే వచ్చి స్వయముగా ధనంజయుని గోరగా ఆమెను తిరస్కరించిన ధీరుడు అర్జునుడు. కానీ ద్రౌపది కర్ణుని నేరుగా గోరలేదు. అసలు ద్రౌపదికి కర్ణునిపై ప్రేమయుండెనో లేదో యనుసంగతి కర్ణునకు తెలియదు. కృష్ణుని మాటలు నిజమో యబద్ధమో ఇట్టి కోరికను ద్రౌపది తనకు వెలిబుచ్చినట్లు కృష్ణుడు కర్ణునితో చెప్పియుండలేదు. ఇది ఆయన స్వంతయూహయే అయి యున్నది. ఇన్ని అనుమానములతో కూడుకొని యున్నది కర్ణుని త్యాగము. ఒకవేళ కర్ణుడేక పత్నీవ్రతుడనుకొందమా! అదియునూ లేదు. సూతకులమున ననేక మంది స్త్రీలను పెండ్లాడి యుండెను. ఇట్లు పరిశీలించిన కర్ణుని త్యాగము పార్థుని త్యాగము ముందు అతి స్వల్పాతిస్వల్పమని చెప్పవలయును. తనకు తానే వలచిన యూర్వశిని త్యజించిన పార్థుడు నిజముగ ఋషులను మించిన ఋషీశ్వరుడే అట్టి యర్జునుడేడ? కర్ణుడేడ? నక్కయేడ నాక లోకమేడ బ్రాహ్మణుని యావును రక్షించినవాడర్జునుడు. బ్రాహ్మ

ఋని గోవును జంపిన వాడంగరాజు. తండ్రి పరోక్షమున అభి మన్యుని వధించినవాడు కర్ణుడు. తండ్రి సమక్షమున కర్ణపుత్రుని వధించినవాడర్జునుడు. అవిభక్త కుటుంబములో అణగిమణగి ఇంద్రియ నిగ్రహముతో మెలగినవాడు పార్థుడు. తనకుతానే పెద్దగ బ్రతికినవాడు కర్ణుడు.

స్వామిభక్తుడా కర్ణుడు?

స్వామి యనగా యజమాని. కర్ణుని స్వామి సుయోధనుడు అట్టి యజమానికనుకూలముగ నడచు కొనుచు ఆయన క్షేమము గోరుచుండుట స్వామిభక్తి యని యనబడును. స్వామిభక్తి యనగా మంచియైనను చెడ్డయైనను స్వామి చెప్పినట్లు చేయుట యేనా? భవితవ్యము దెలిసియున్నచో యదార్థమును స్వామికి దెలిపి స్వామిని నాశనము గాకుండా గాపాడు కొనుట స్వామిభక్తి యని యనిపించదా? మంద బుద్ధి యగు స్వామికి మారుమాటా డకుండుటయేనా స్వామిభక్తియనుమాట కర్థము. స్వామితోబాటు తానుగూడ చెడుప్రవర్తనలో మగ్నుడు గావలసినదేనా? తన కంటెను మించినివాడని గదా కర్ణుని సుయోధనుడు దగ్గిర జేర్చు కొనినది. దుర్యోధనుని యెడ కర్ణుని ప్రవర్తన తగురీతిగలేదు. అజ్ఞానముగ అవ్యక్తముగ అనుసరించినటులున్నది. నిజముగ జూడ కర్ణునిలో స్వామిభక్తియే లేదని దెలియుచున్నది. శకునిని మించిన రీతిలో నీతడును సుయోధనుని నాశనమే కోరినటులున్నది. లేదా సుయోధనునికి వ్యతిరేకముగ మాట్లాడినచో అంగరాజ్యము

యాడిపోవునేమో నను బెంగచే కర్ణుడు స్నేహితుని పలుకులకు ప్రక్కతాళము వేసెనాయని యనిపించును. అంతకు పూర్వమనేక మార్లు పాండవుల నెదిరించ సాహసించలేని కర్ణుడు యుద్ధము వలదని సుయోధనుని వారించ వలయునుగదా ? అట్లు వారించ లేదు. పైగా పాండవులను నాశన మొనర్తునని వదరు బోతు మాటలు బల్కుచు యుద్ధమునకు ప్రోత్సహించినాడు. తన కవచ కుండలములు దానమిచ్చిన తదుపరి యైనను తనశక్తి తగ్గినది గనుక తనను నమ్ముకొని రణరంగమునకు గడంగ వలదని కర్ణుడు సుయోధనునకు జెప్పి యుండిన యతని నిజమైన స్వామిభక్తి ప్రకటితమై యుండెడిది. దుర్యోధనుని యనుమతి లేనిదే యీ దానమును కర్ణుడు చేయుట పెద్దపొరబాటు. దీని వలన తనకంటే దుర్యోధనుడే ఎక్కువ నష్టపోయినది, కానీ కర్ణుని కవచకుండల దానము ఉభయపక్షములకును దెలిసినది. పాండవులు సంతసించిరి. కౌరవులు దుఃఖించిరి. అయిననూ కర్ణుడు ప్రగల్భములు గొట్టుట మానలేదు. దుర్యోధనుడు వానిని అనుసరించుటయునూ వీడలేదు. ఇది వారి పురాకృత ఖర్మముగాబోలు తనకుగల భార్గవుని శాపము సంగతి గాని బ్రాహ్మణ శాపమునుగాని భూదేవి శాపమునుగాని ఇదివరకెప్పుడైనను కర్ణుడు సుయోధనునకు దెలిపియుండెనా ? లేదు. అట్లు దెలిపియుండినచో సుయోధనుడు యుద్ధమునకు దిగి యుండెడివాడు గాదుగదా ! ప్రజానాశనము గాదుగదా ! ఇంతటి ఘోరమునకు కారణభూతుడయిన కర్ణుడెట్లు స్వామిభక్తి పరాయణు డగును ? అతడు తన ప్రాణమును సుయోధనున కిచ్చితిననెను.

ఉభయుల శరీరములు వేరు, కానీ మనసులు మాత్రమొక్కటే. అట్టి కర్ణుడు తన శాపము లెందుకు దాచినట్లు? పాండవులు గెలుతురను విషయము తనకు దెలిసియు కృష్ణునితోననెనేగాని సుయోధనునకు చెప్పియుండలేదు. ఇది పచ్చి మోసముగదా? ఇట్లు మోస కృత్యము లొనరించుచు యుద్ధమునకు రారాజుని ప్రోత్సహించినందుననే "కర్ణుడు లేని భారతమా" యను నానుడి లోకములో ప్రసిద్ధమాయెను. అంతియేగాని భారతములో కర్ణుడు గొప్పవాడని మాత్రముగాదు అని గ్రహింపవలయును. కర్ణుని ప్రోత్సాహము లేనిచో దుర్యోధనుడు యుద్ధమునకు దిగియుండెడివాడుగాడుగదా!

తనను అర్థరథునిగావించిన భీష్మపై కోపగించి భీష్ముడు నేలబడువరకు తానాయుధము పట్టనని ప్రతిజ్ఞబూనిన కర్ణుడు స్వామికి స్వామి ద్రోహము జేసిన వాడాయెను. కర్ణుడు యుద్ధము మానినందున కౌరవుల బలము క్షీణించినది. అర్జునుని దప్ప మిగత పాండవులను జంపనని కుంతికి మాట యిచ్చుటయూ కర్ణుని స్వామిద్రోహ కార్యమే అయియున్నదని చెప్పనగును. ఇట్టి వరమును కుంతి కోరియుండలేదు. కర్ణుని పాండవుల వైపు మాత్రమే రమ్మని గోరినది. గురి దప్పిన నాగాస్త్రము మరల తనపు పార్థునిపై ప్రయోగింపమని వేడినపుడు ఎంగిలిబాణమును వేయజాలనని కర్ణుడు భీష్మించుట అక్రమము అన్యాయము. ఈ చర్యగూడ కౌరవాగ్రజునకు నష్టము గలుగచేయునదే. ఇట్టి పరిస్థితులు కర్ణుని కపట యుద్ధమును వెల్లడిచేయుచున్నవి. భీమునిచే

దెబ్బదినిన కౌరవులు భీముని చంప ప్రయత్నించుట సబబే యని యనిపించునేమో గాని తనకేలాంటి అపకారమొనరింపని యర్జునుని మాత్రము తప్పక వధించెదనని కర్ణుడు ప్రతిన బూనుట ఆయన అన్యాయమును అక్రమమును ప్రకటన చేయుచున్నది. పంచ పాండవులేగాని ఆరుగురు పాండవులుండరాదట. అర్జునుడు చని పోయినచో ఆస్థానమును తాను పూర్తిచేయునట: ఇంతకూ అర్జునుడు తనకు జేసిన యపకారమేమిటో పాపం. తనను విలు విద్యలో మించుటయేగదా !

త్యాగశీలియా కర్ణుడు ?

కర్ణుడు త్యాగశీలి కాదని చెప్పుటకింతకు పూర్వమే దాన గంట విషయము, కవచకుండల దానము చర్చించబడినది. ఇక యిప్పుడు తనకు శ్రీకృష్ణుడాశ జూపిన పాండవ రాజ్యలక్ష్మిని ద్రౌపదిని పరిత్యజించుటను గూర్చి పరిశీలింతము. ఇందును సహితమాతని స్వార్థము దాగియేయున్నది. ఎనుబదేండ్ల ముదుసలి కిప్పుడు, కాంతా కనకములనవసరముగదా ! ఈ విషయము సర్వులకనుభవైక వేద్యము. భోగములన్నియు తానిదివరకే పూర్తిగా ననుభవించి యుండెను. అంగరాజని పేరేగాని అసలు భారతదేశమున కంతటికిని అతడే అసలు రాజు. రారాజునామ మాత్రమే. తాను సామంతరాజైనను తనకు రారాజుతోగల మిక్కి- నేస్త ప్రాబల్యమున కడు చక్రవర్తి భోగముల నన్నింటిని యనుభవించి యున్నాడు ? అతనికడ్డేలేదు. సర్వ స్వతంత్రుడు,

ఒకనాడు రారాజు భార్య భానుమతితో తాను పాచికలాడు చుండెను. అప్పుడు సుయోధనుడచ్చోటికి విచ్చేసెను, భర్త రాకను గమనించి భానుమతి లేవబోయెను ఆట రక్తిచెడునని కర్ణుడామె కొంగును బట్టి గుంజి కూర్చుండబెట్టెను. ఆ దృశ్యమును గాంచిన కౌరవా గ్రజుడు మారుమాటాడక పోగా భార్యను ఆటయాడుమని యాజ్ఞాపించెను. ఇంత గాఢమైనదా యిరువురి వాత్సల్యము, కర్ణునిపై దుర్యోధనునకంతటి ధృఢనమ్మకము గలదు. అంతకన్న మిన్న యగు స్వతంత్రత కర్ణునికి పాండవుల వైపునకు పోయినంత మాత్రమున లభ్యమగునా ? దుర్యోధనునివద్ద కర్ణుడనుభవించినది బాధ్యతలేని సౌఖ్యము పాండవులపై వెళ్ళినచో లభింపబోవునది బాధ్యతా యుత సౌఖ్యము, పై రెంటిలో మిక్కిలి యానందము నిచ్చునది బాధ్యతారహిత సౌఖ్యమేగదా. ఈరహస్యమెరింగియే రాధేయుడు పాండవులవైపు జేరలేదని సులభముగా దెలియు చున్నది.

అతిలోకసుందరి అయోనిజ అగ్నిసంభవ యగు ద్రౌపదిని నిరాకరించుటలో గూడ రహస్యము లేకపోలేదు. మంచి వదివయస్సులో నున్న ద్రౌపది యందముగనే యుండును. కాని యిప్పటి ద్రౌపది అందము తగ్గినది ముదుసలి యైనది. ఉపపాండవుల తల్లి అయినది. కర్ణుడు నలుగురు బిడ్డల తండ్రియైనాడు (సత్యసేన, చిత్రసేన, సుశర్మ, వసుషేణ). ఎనుబదేండ్ల తాత. అట్టి వయసులో ఈ యిరువురకు వివాహమగుచో ఇటు కర్ణుని పుత్రులు అటు ఉపపాండవులు ఛీ! ఛీ! యని యుందురను విషయము కర్ణునకు

బాగుగా దెలియును. ఇన్ని విషయముల నెరింగిన కర్ణుడు నేర్పుగ కృష్ణుని వలనుండి తప్పించుకొని నాడు. అంతియే గాని ఇందాతని త్యాగమావంతయును లేదనుట మనకు సులభగ్రాహ్యము.

ఆకాలపు రాజధర్మమునకు విరుద్ధముగ నడచి తనకులమును దాచి పరశురాముని మోసగించి విద్యనార్జించుట కర్ణునిది యక్రమమే. ఈనాడాధర్మము ప్రజలకు నచ్చకపోవచ్చును. ఆనాటికా ధర్మము యోగ్యమే గనుక దానిని పాటించు బాధ్యత కర్ణునిదై యున్నది. అట్లు పాటించక పోవుట కర్ణునికి రాజ శాసనముల యెడగల నిర్లక్ష్యమై ఖరి వెల్లడియగుచున్నది.

ద్రౌపదీ వస్త్రాపహరణ సమయమున కౌరవుల దుర్మార్గమును యెవ్వరునూ వారించలేని సందర్భమున నిష్కపటుడగు వికర్ణుడు (కర్ణుని కొడుకుగాదు) సభలో నిలబడి ఆ దుష్ట చేష్టను ఖండించెను. అప్పుడాతనిని యితడు వారించెను. అనాటి దుశ్చర్య నిష్కపటులకు కోపము దెప్పించెను. మిగత సభికులు భయముచే పలుకరైరి. రారాజు తమ్ముడయ్యునూ వికర్ణుడు అన్నల దురాగతమున కాగ్రహావేశుడై ధర్మమును పలికెను. కర్ణుడు ఉత్తముడగుచో సభలోని యితర పెద్దలవలె పూరకుండ వలయునేగాని వికర్ణుని వారించరాదు, కేవలమాతనికి గావలసినది తన యజమానికి తాళము గొట్టుటయే యని యీ పరిశీలన వలన విదితమగుచున్నది. "అయిదుగురు భర్తలయినందున ఉమ్మడి గొడ్డువలె నుంటివి. వస్త్రాపహరణ సమయమున నీ భర్త లెవ్వరును వచ్చి

నిన్నాదుకొనలేదు గనుక వేరొక భర్తను గట్టుకొనమని కర్ణుడెగతాళి చేయగా దుర్యోధనుడు తన యంకమును జూపి యాజ్ఞసేనినాహ్వానించును. ఇట్లు గేలిసేయుట యుత్తములకు తగునా? ఒకవేళ మయసభలో యవమానపడిన దుర్యోధనుడిట్టి మాటలన్నను సబబుగ యుండునేమో? కౌరవులు గాని శకునిగాని అనినను కొంతన్యాయముగా నుండును. ఏ బంధుత్వములేని తేరగా పొందిన అంగరాజ్యలాభమునకు బదులుగ స్నేహితుని తృప్తిపరచుటకై ప్రోత్సహించు పొగరు బోతు మాటలవంటివే గాని యివి కర్ణుడంతటివాడనదగినవి గావు. ఇది అతని నీచస్వభావము చెడ్డ సహవాస దోష ఫలితమునకు నిదర్శనము, బాలుడగు నభిమన్యునెదిరించలేక వెనుకపాటున బాణమువైచిన కర్ణుడు పార్థుని చంపుదునని పలుకుట హాస్యాస్పదముగాదా? తన కుమరులను రక్షించుకొనజాలని కర్ణుడు దుర్యోధనుని రక్షించుటయన్న కల్లయని దెల్లమేగదా!"

ఈ సూతపుత్రుడిట్టి యన్యాయముల నక్రమముల జేసినందుననే సర్వనాశనమైనాడు. చట్టప్రకారము నేరము చేసిన వాని కంటెను ప్రోత్సహించు వానికే యెక్కువ శిక్ష విధింప బడును. గనుక కౌరవాగ్రజుని కంటే కర్ణుడే మిక్కిలి దుర్మార్గుడని చెప్పవలసి యుండును.

కర్ణుని గురుభక్తి యదార్థమా?

పరశురాముని కడ శిష్యత్వము చేయుచుండగా గురువుగారొకనాడు కర్ణునితొడ తలగడగా నిద్రించుచుండెను, అప్పుడొక

పురుగు ఆయన తొడలో ప్రవేశించి బాధించు చుండెను. నెత్తురు ప్రవహించుచున్నను గురువుగారికి నిద్రాభంగమగునని కర్ణుడు ఓర్పుతో తన తొడను గదల్పక అట్లే యుంచి బాధను భరించెను. ఈకథనాధారముగ గైకొని కర్ణుని గురుభక్తిని ప్రశంసించెదరు కొందరు. కానీ పరికించిచూడ ఏకలవ్యుని గురుభక్తిముందు ఈయనగారి గురుభక్తి తీసిపోవునని చెప్పదగును. ఏకలవ్యుడు తనవిలువిద్యానేర్పరి తనమున కాధారభూతమైన తన కుడిచేతి బొటన వ్రేలునే గోసి యిచ్చెను. ఈ మహానుభావుని గురుభక్తి కర్ణుని గురుభక్తి కంటే వెయ్యిరెట్లు మిన్నయని నొక్కి చెప్ప వచ్చును. తనకు విద్యగరపుటకు నిరాకరించిన గురువును ఏవ గించుకొనక గురుదక్షిణగ బొటన వ్రేలును యొసంగిన ఏకలవ్యుని గురుభక్తి సర్వదా శ్లాఘనీయము. కర్ణుని గురుభక్తి స్వార్థమైనది. గొప్పవాడగు పరశురాముకడ విద్యనేర్వవలయునను యుద్దేశముతో ఆయనకు కోపము రాకుండుటకై ఆయనకు గల అతీతమగు శక్తి సామర్థ్యములకు భయపడి కర్ణుడట్లు బాధను భరించెను. ఏకలవ్యుని కట్టి అపేక్షయేమియును లేదనునది మనము గమనింప దగిన విషయము. కనుక కర్ణుని గురుభక్తి కపటము స్వార్థపూరితమని యెరుంగవలయును.

నీచస్వభావము :

దుర్యోధనాదుల చెడ్డపనులకు ప్రోత్సాహ మిచ్చిన వాడు కర్ణుడు. ద్రౌపదీ మానభంగమునకు మూలకారకుడు కర్ణుడేగాని

దుర్యోధన దుశ్శాసనులుగారు. కురువృద్ధుల వెనుక నిలబడిన పాండవపత్నిని దుశ్శాసనుడు కొప్పుబట్టి సభామధ్యమునకు దెచ్చెను. రారాజు తమ్ముడు గనుకనే ఆదుశ్చర్యను వికర్ణుడు ధైర్యముగా విమర్శించెను అప్పుడు మిగత సభికులాతనిని ప్రశంసించిరి. ఆ విమర్శకు సుయోధనుడెక్కడ నిరుత్సాహ పడునో యని తటాలున కర్ణుడు వికర్ణుని వారించి దుర్యోధనుని యిట్లు ఉత్సాహపరిచెను, "అయిదుగురు భర్తలుగల ద్రుపదపుత్రి బంధకి యనబడును అట్టిదానిని విగత వస్త్రను గావించినను తప్పులేదని అంగరాజనిన మీదటనే ద్రౌపదిని వస్త్రవిహీనగ గావింప దుశ్శాసనునకు అన్నయాజ్ఞ నిచ్చెను. అంతేగాని అంతకు పూర్వమామెను వస్త్రవిహీనగ జేయుతలంపు రారాజుకు లేదాయె, ఇట్టి చర్య కర్ణుని నీచస్వభావమును వెల్లడి చేయుటలేదా? ఘోషయాత్ర చేయుతలంపు గూడ కౌరవాగ్రజునకు గలుగలేదు. దానికి ప్రోత్సహించిన వాడు గూడ కర్ణుడే. "సంపదలుగలిగి యుండుటయే భాగ్యమనబడదు. తన సంపదను జూచి శత్రువులు దుఃఖించవలయును, అదియే నిజమైన భాగ్యమని కర్ణుడు దుర్బోధచేయగా దుర్యోధనుడు పాండవుల గేలిచేయుటకై ఘోషయాత్రకు బయలుదేరెను. ఈ పనియును కర్ణుని నీచస్వభావమునకు నిదర్శనము. ధృతరాష్ట్రుడు వెడలగొట్టగా విదురుడు అడవిలోనున్న పాండవుల వద్దకేగెను, కానీ చిత్తశాంతి లేక గ్రుడ్డివాడు మరల విదురుని హస్తిపురికి రావించుకొనెను అట్లు వారిద్దరేకమైనందులకు దుర్యోధనుడు చింతించెను. పాండవులను మరల వారు హస్తినాపురికి

రావింతురేమోనని యనుమానమును వెలిబుచ్చెను. అప్పుడు కర్ణు డిట్లనెను, "ఇప్పుడే సర్వసైన్య సమేతముగ పోయి అడవిలో నున్న పాండవుల హతమార్చి వత్తము నీవు నిశ్చితంగా రాజ్య మేలుకొనవచ్చునని పల్కగా దుర్యోధనుడు యుద్ధమునకు సిద్ధ మయ్యెను. దివ్యదృష్టిచే నెరింగిన వ్యాసుడరుదెంచి ఇట్టి యుద్ధమ ధర్మమని బోధించి నివారించి గ్రుడ్డివానిని మందలించి పోయెను. అనుకున్న మేరకు పాండవు లరణ్యవాస మొనరించుచుండ దుర్యో ధనున కిట్టి చెడ్డ తలంపును బోధించుటలో కర్ణుని నీచ స్వభావమ తెల్లమగుచున్నదిగదా!

కానీ యిందులకు విరుద్ధముగ బ్రతుకులశాశ్వతములు గనుక ముందు కౌరవుల జంపి పిదప అరణ్యవాస మొనరింతుమనిన భీమునికి ధర్మపద్ధతిని బోధించి అతనిని శాంతపరచిన వాడు ధర్మజుడు. చూచితిరా పాండవులకు కౌరవులకు గల తారతమ్యము. మరియు ధర్మజుని ఔన్నత్యము అందుచేతనేగదా కృష్ణరాయబార సమయమున ధర్మజుడే రాజ్యమేలదగును. అయన పక్షమే గెలు పొందును అని నిజమగు పలుకులు కర్ణుని నోట వెలువడెను.

తాను పాండవులపట్ల చేయరాని యపరాధములను చేసితి ననియు అక్రముగ వారల నవమాన పరచితిననియు కృష్ణునితో మాట్లాడు నపుడును యుద్ధభూమిలో భీష్మునితో మాట్లాడునప్పు డును కర్ణుడు తన తప్పులను తానే యొప్పుకొని యుండ మనమిప్పు డాతనిని మంచివాడని చెప్పుకొనుట కడువింతగ యుండలేదా?

రారాజు సొత్తు తినినందున వానికి లోబడి అక్రమ మార్గమును అనుసరించినవాడు కర్ణుడు. అట్లు ఉభయులసొత్తును ఆశించక తమ సామర్థ్యముపై తామే బ్రతుకుచు నిష్కపటముగా దుర్యోధనుని దుశ్చర్యలను ఖండించినవారు భీష్మద్రోణ విదురాదులు. ఇట్టి పండితుల ననేకమార్లు పాండవ పక్షపాతులు తిన్నయింటి వాసాలు లెక్కించువారని కర్ణుడు వ్యాఖ్యానించెను. అసలు నిజముగ జూడ చేజిక్కిన ధర్మభీమ నకులసహదేవుల వధించక విడచిన కర్ణుడే పాండవ పక్షపాతియని తెల్లమగును. ఇట్లు గురువగు ద్రోణుని విమర్శించిన కర్ణుని గురుద్రోహి యని యనవలయును. పరశురాముని యెడల గురుభక్తిని ప్రకటించిన శిష్యుడు ద్రోణుని నిందించుట యేలకో యని విచారించిన తన స్వామిని తృప్తిపరచుటకే యని తెలియనగును, పరాయివానిపై యాధారపడి జీవించువారి బ్రతుకులిట్లు కర్ణునివలెనే అధోగతిని పయనించుచుండునని యెల్లరెరింగిన విషయమే గదా.

భీష్మద్రోణాదులిట్లితరులపై యాధారపడినవారు కాదు. ద్రోణుడు భీష్మునిచే నియోగింపబడెను. కానీ సుయోధనుడాయనకు యుద్యోగమివ్వలేదు. అందుచే ద్రోణుడు సుయోధనుని అనుసరించవలసిన యవసరములేదు. భీష్ముడు విదురుడు దుర్యోధనుని అనుగ్రహమున బ్రతుకవలసిన అవసరములేదు ధృతరాష్ట్రుడు వెడలగొట్టగా సంతోషముతో విదురుడు అరణ్యములోనున్న పాండవుల వద్దకు బోయెను, అట్టి విదురుడు దుర్యోధనుని అక్రమచర్యల

నామోదించుట జరుగనిపని. ఇట్టి మహామహులను పాండవ పక్ష పాతులని తిన్నయింటి వాసాల లెక్కించు వారని విమర్శించుట కర్ణుని అమాయకత్వమునకు అస్వతంత్రతకు నీచస్వభావములకును నిదర్శనముగా నున్నది.

కర్ణుని పెంచిన పిదప రాధాసూతులకు పెక్కుమంది పుత్రులు పుట్టిరి. అందువలన తనను పెంచి పెద్దజేసిన తలిదండ్రులను వదలి పాండవ పక్షమునకు రాజాలనని కర్ణుడు కృష్ణునితో పలుకుట అర్థములేని విషయము. వాని తలిదండ్రులకు బాల్యమున కర్ణునిపై మక్కువ యుండిన యుండవచ్చును, కానీ వారికి స్వంత పుత్రులు కలిగిన మీదట కర్ణునిపై ప్రేమ తగ్గుట సహజము, మరియు కర్ణుడు పాండవుల పక్షముజేరి నందున రాధా సూతులకు సంభవింప బోవు నష్టమేమియునులేదు అంతేగాక కర్ణుడు పాండవ పక్షమునకు పోయి యుండిచిచో మిక్కిలి మేలుగలిగి యుండెడిది. దుర్యోధనునకు ప్రోత్సాహము యిచ్చువారు తగ్గినట్లగును. అందుచే అతడు కయ్యమునకు కాలుదువ్వి యుండడు. పాండవులచే కౌరవులకు చావులేకుండునట్లు పాండవుల వద్దనుంచి గాని కృష్ణుని వద్దనుండి గాని హామీ తీసుకొనిన మీదటనే కర్ణుడు పాండవ పక్షము జేరియుండినచో అపుడు కర్ణుడు ఉభయులకు కావలసిన వాడై యుండును గాన యుభయులకు నచ్చ జెప్పి యుద్ధమును వారింపజేసి యుండెడివాడు. అట్లు ఉభయులకు సర్దికుదిర్చిన మీదటనే కర్ణుడు పాండవ పక్షమునకు జేరి సుఖశాంతులతో తుళ

డూగి యుండవచ్చును. అపుడు కర్ణుని కీర్తి మిన్నుముట్టి యుండెడిది. సైనికులకు అకాలమరణములు దప్పియుడెండివి. ఆట్లొనరింపక దుర్యోధనుని ప్రోత్సహించి భవిష్యత్తు నెరింగియును సర్వనాశనమునకు మూలకారకు డయినాడు కర్ణుడు. ఇట్టి కర్ణుడీనాడు కీర్తింపబడుచున్నాడన ప్రజలపై నేటి విరుద్ధపు సాహిత్యప్రభావ మెంతమార్పునకు దోహద మొనరించుచున్నదో యూహింప వచ్చును.

కర్ణుడవకాశవాది:

ఈతడవకాశవాది యని చెప్పుట కీదిగువ నుదాహరణము జాలును. కులతారతమ్యము పనికిరాదని భావించి బాల్యమున విలు విద్యా ప్రదర్శనలో ఎదిరించి జోరబడిన కర్ణుడు పెద్దవాడయిన పిదప ద్రౌపదీ స్వయంవర సమయమున ఓడిన రాజులకు నాయ కుడై ద్రుపదుని యాక్షేపించెను, క్షత్రియ కన్యను బ్రాహ్మణున కిచ్చి వివాహము చేయుట అక్రమమని వాదించెను. గనుక సూత కులస్థుడుగా నున్నపుడు కర్ణునదొకరకమైన భావము అంగరాజైన పిదప కులమును గురించి మరియొక భావమూ, ఇట్టి యవకాశవాదిని కీర్తించుట యుచితమా? మరియొక విధముగ యాలోచించిన బాల్యమున నుండు భావన యొకతీరు. గృహస్థుడై పెద్దవాడయిన తదుపరి యుండు భావన మరియొక తీరుగా మనసు మార్పుదల వెల్లడి యగుచున్నది. అయితే సూర్యుని వరమువలన బుట్టిన కర్ణుడింతటి ఘనయుక్తుడు కుట్రపరుడగునా యని చదువరుల కను

మానము కలుగవచ్చును. కాని సహస్రకవచుడను రాక్షసుడు తన ప్రాణ రక్షణార్థమై సూర్యునిలో దాగి నరనారాయణులచేతిలో చావు తప్పించుకొనెను. ఆ రాక్షసుడే కర్ణుడుగా జన్మించెను. వానిని వధించుటకే నరనారాయణులు కృష్ణార్జునులుగా జననమొందిరి. ఆ రాక్షసుని నీచలక్షణములు కర్ణునిలో గోచరించుచున్నవా యని యనిపించును. సహవాసము చెడ్డది గనుక అతడొనరించిన పనులునూ యిట్టివే. ధర్మనిరూపణము, జేయుశక్తి మానవులకన్నను దైవమునకే సుసాధ్యము. మంచివానిచావు మరణ కాలమున దెలియునందురు. కాబట్టియే వీరుడై యుండియు దిక్కులేని చావు చచ్చినాడు. అతడు తెలివిగలవాడై యుండినచో రామాయణములోని విభీషడు దుర్మార్గులనువీడి సన్మార్గులను జేరినటుల, పాండవ పక్షము జేరి బాగుపడి యుండెడివాడు.

ఎరువెట్టిదైనను పంటఫలితమును బట్టియే దానిశక్తి దెలియును అటులే పురాణగాథలందు ధర్మమేదో యధర్మమేదో మంచివాడెవడో చెడ్డవాడెవడో ఆయా రణరంగ పర్యవసానములే ఋజువుచేసి యున్నవి. వానినిపుడు తిరుగదోడి మనము చెడ్డవారిని మంచిగా వర్ణించుట న్యాయమనిపించదు. ఆకాలపు ధర్మముల నీకాలవులతో బోల్చుకొని విమర్శించుకొనిన యదార్థము గోచరింపదు ఒకమతమునందలి ధర్మముల వేరొకమతస్థుడు విమర్శించుట కెట్లనర్హుడో అట్లే ఆకాలపువారిని ఈకాలపువారు విమర్శించుట కనర్హులు, యుగమునుబట్టి ధర్మములు మారుచుండు

నని పురాణములందే చెప్పబడి యుండెనుగదా। రాచరికపు పాలన యొక విధము. ప్రజాస్వామ్య పాలన మరొక విధము. ఇట్లే దేశకాలమాన పరిస్థితుల ననుసరించి ధర్మములు మారుట సహజము గాన ఆనాటి పురాణముల నీనాడు విమర్శించుట అర్థరహితము. అసలు మతము పరలోక సౌఖ్యమునకు ప్రాధాన్యమిచ్చి మార్గము చూపును. విజ్ఞాన శాస్త్రిమందులకు విరుద్ధముగ ఇహలోక సుఖమునకు ప్రాధాన్యత నొసంగును. గనుక ఈ రెండింటికి పొందిక కుదురుట దుర్లభము. ఈ దృష్టితో హేతువాదనయాధార ముగా విమర్శలు సాగించిన అవి తూర్పు పడమరలుగా పయనించునే గాని రెండు కలిసి ఒకదిక్కుకేగుట జరుగనిపని. అయితే మాన వులు నాగరికముగ సర్దుబాటు ధోరణిలో రెండు పద్ధతుల సమన్వయ పరచుకొనుచు సమభావములు గలిగి త్యాగబుద్ధితో మంచిగా మన వచ్చును, లేనిచో జీవితములో ప్రతిమనిషికి రామరావణ యుద్ధ ములు కౌరవ పాండవ కురుక్షేత్ర రంగములవలె వైరములు సంభవించును. ఇది యదార్థము. ఈ యదార్థమును గ్రహించుటకే పురాణపఠన మవసరము. ఇట్టి పురాణముల సృష్టించిన వ్యాస మునీంద్రుని ఆశయమెంతటి ఔన్నత్యమైనదో వర్ణనాతీతము.

వ్యాసుడు — వ్యభిచారము

వ్యాసుని గొప్పతనమును గూర్చి వివరించుటకు కలికాలపు పండితులు పనికిరారని చెప్పవచ్చును. లోకోపకార మొనరించిన మునీశ్వరులలో వ్యాసుడగ్రగణ్యుడని వేరుగ చెప్పనవసరము లేదు.

వ్యాసుడు లేనిచో హిందూమతమేలేదు. భారత చరిత్రయే గాన రాదు. భారత సంస్కృతియే శూన్యము. ఇట్టి జ్ఞానిని గూడ నేటి యజ్ఞానులు వింతకొరకే విమర్శించుచున్నారని తలంపవచ్చును.

వ్యాసుడు, పరాశర మునీంద్రుని వలన సత్యవతికి కన్నె ప్రాయమున సద్యోగర్భమున జన్మించెను. మొట్టమొదట వ్యభిచారి అను పదమునకు అర్థమును గ్రహించినచో మనము పురాణ పురుషుల చర్యలను విమర్శింప బూనము. వ్యభిచారి యనగా పర స్త్రీలపై వ్యామోహము గలవాడు. నిలకడ మనస్సు లేనివాడు, తృప్తి నెరుంగనివాడు, వ్యసనపరుడు. ఇట్టి లక్షణములుగల వ్యభిచారులను నేటిమానవ లోకములో నిత్యము మనము గాంచుచున్నాము గదా! మానవుల వ్యభిచార లక్షణముల పోలికలతో మునీశ్వరుల చర్యలను విమర్శింప బూనిన మనకు యదార్థము గోచరింపదు. పరాశరునికి వ్యభిచరించుటకు కన్నెపిల్లయే కావలసివచ్చెనా? సంసారమునకు స్త్రీలు కావలెనన్నచో పండితుడు పరమ మునీంద్రుడగు పరాశరు నికి పెండ్లికి దొరకరా? పెండ్లిచేసుకొని భార్యను పోషింపజాలడా? పగలును రాత్రిగ మార్చి మత్స్యగంధిని సుగంధినిగ జేసి ఆమె కన్యాత్వమునకు భంగము లేకుండ వరమిచ్చిన శక్తి సామర్థ్యములు గల పండితునకు కావలెనన్న వివాహమునకు కాంతల నిచ్చువారే యుండియుండరా? ఇట్టి నిందాపూరిత నీచకార్యమాచరించ వలసిన ఖర్మ ఆయన కెందులకు సంప్రాప్తమై యుండును? ఏమిటీ వింత చర్య? ముని తనను గోరినపుడు సత్యవతి యిట్లనెను, "మీరు

మునీంద్రులు జితేంద్రులు మహనీయులు, నేను నీచురాలను, పడవ నడుపుకొని బ్రతుకు దానను. నన్ను వాంఛించుట మీకు తగదని" మునీంద్రుని సత్యవతి వేడుకొనినదేగాని నిందించలేదు. మగవాడు కోరికను వెలిబుచ్చినపుడు స్త్రీకాతనిపై అధికారము లభించును. అప్పుడామె ఎంత గొప్పవానినైనను తృణీకరించగలదు. కానీ సత్యవతి, మునిని నిర్లక్ష్యముగ చూడలేదని మనము గమనింప వలయును. తరువాత శంతనమహారాజు తనను వలచినపుడు తన తండ్రి యనుమతి గోరమని పలికిన సత్యవతి మునీంద్రుని కడ్డు చెప్పలేక పోవుటేమిటి? పరాశరుడామెతో జీవితములో ఒక్క-మారు మాత్రమే కలియును. వ్యభిచారి వ్యసనపరుడు గనుక ఇది వ్యభిచార పద్ధతికి విరుద్ధము. మునీంద్రుల కలయిక మానవుల వంటిది కాదు. గనుకనే ఆమె శంతనునకడ్డు చెప్పినట్లు పరాశరు నికి చెప్పలేదు. మరియు మునీశ్వరులు పరకాంతలతో యిట్లొక్క-సారి మాత్రమే గలియుట, వెంటనే పుత్రుడు గలుగుట పురాణ ములందు గన్పట్టుచున్నది. గనుక వంశాభివృద్ధికై లోకకళ్యాణార్థమై కారణజన్ములగు పుత్రులను ప్రసాదించుటకు మాత్రమే ఋషులు పరసతులను మానసికముగ గలిసిరని గ్రహించవలసి యున్నది, అంతేగాని తమకామవాంఛ దీర్చుకొనుటకు మాత్రము గాదు. అట్టి మంత్రశక్తి తపోమహిమగల మునుల చర్యలు వ్యభిచారచర్యలే యగుచో అది లోకనింద్యమగు గాన, వారు యిట్టినిందలు పడకుం డుటకై తమకలయికచే సంతతి యుత్పత్తిగాకుండ, మహత్తుగల మునులు చేసుకొని యుండరా? అని ఆలోచించవలయును. లేదా

హాయిగా తాము కామ క్రీడలొనర్చి. లోకనింద పాలు గాకుండా గుట్టుగా తమ తప్పులు కప్పిపుచ్చ ప్రయత్నింతురేగాని రట్టుజేసు కొందురా ? వారపనిందల పాలగుదురా ? గనుక ఇట్టి కలయిక లను మనము నీచబుద్ధితో పరిశీలింపరారు.

వ్యాసుడు వ్యభిచరించెనా ?

ఈయన అంబిక అంబాలిక మరియొక శూద్రవనితతో ఒక్క మారు మాత్రమే కలిసెను. ఆ కలయికల సమయమున ఆయా స్త్రీల భావముల గుర్తెరింగిన మునీంద్రుడు ముందుగనే పుట్టబోవు బిడ్డల రూపురేఖలు వెల్లడించెను. ఈనాడు వ్యభిచారమాచరించు మహానుభావులట్లు భవితవ్యమును చెప్పగలరా ? వ్యాసునితో కలియుటకు పూర్వము అంబికాదులు వ్రతములాచరించి పవిత్రులై దైవసన్నిధికేగినటుల వ్యాసునివద్దకేగిరేగాని ఈనాటి వ్యభిచారి ణులవలె తళుకు బెళుకులతో కుల్కు పలుకులతో నటన నాట్యము లతో క్రీడించలేదని మనము గ్రహించ వలయును. అసలు వ్యభిచార చర్యలకు వ్రతములనవసరముగదా ? వ్యాసుడంతటి పండితుడు విధవలగు అంబిక అంభాలికలతో గలియవలసి వచ్చెనా? అసలు ఆవిధవలను వ్యాసుడపేక్షించెనా ? గనుక వ్యాసుని చర్య వ్యభిచార చర్యగ పరిగణింపరాదు.

భీష్ముడొక మహాత్మునిగా మనము ఆరాధింతుము. అట్టి భీష్మునిచే పొగడబడిన వ్యాసుడు ఉత్తమోత్తముడని వేరుగ నుడువ

నవసరము లేదుగదా! భీష్ముడు పితృభక్తి పరాయణుడు. వ్యాసుడు మాతృభక్తి పరాయణుడు. గనుక భీష్మునికన్న వ్యాసుడే మిన్నయని యెరుంగవలయును. వ్యాసుని సలహాను భీష్ముడు పొందెనేగాని బీష్ముడు వ్యాసునకు బోధింపలేదు. భీష్ముడు తన ప్రతిజ్ఞ భంగముగాకుండ బ్రహ్మచర్యమును బూని కీర్తినార్జించెను. తనకు సంసార లంపటలు వలదని తల్లితో మొరబెట్టుకొని యా తల్లికోరికను తిరస్కరించలేక రాజ్యమరాచకముగాకుండుటకై ప్రజాక్షేమముగోరి లోకకల్యాణార్థమై తన స్వార్థమునువీడి తన బ్రహ్మచర్య వ్రతమునుసడలించి పెద్దల యనుమతిబడసి భక్తితో తనవద్దకొచ్చిన వనితలకు వికార స్వరూపుడు వ్యాసుడు పుత్ర దానము జేసి పంపెనేగాని తనకామ తృప్తికై ఆటలాడలేదుగదా! వ్యాసుని వికార రూపమును గాంచిన అందమగు రాణులగు అంబిక అంబాలికలు భయభ్రాంతులైరి. ఆయన రూపు రేఖలే ఆతడింద్రియ భోగముల కాసపడువాడు గాడని విదితము జేయును. శూద్రస్త్రీ మునిని భక్తితో సేవించెను. గనుక ఆయన మహాత్ముడని దెలియును. అసామాన్యుడు సామాన్య రాలికి లభ్యమయ్యెను. వారివారి భక్తిప్రపత్తులను బట్టియే తగిన పుత్రులు వారికి పుట్టిరి. లోకములో సహజముగా కోరికలు గలవానికి ఆ కోరికలు దూర మగుచుండును. కోరిక రహితులకు అయాచితముగా ఫలితములు లభించును, కోరికలు గలవానికి ఫలితము దొరికినపుడున్నంత యానందము వాంఛారహితునికి యుండదు. మునీశ్వరుల కలయిక లిట్టివి. వారిచర్యలు స్వార్థరహితములు, లోకకళ్యాణార్థములు.

మనచర్యలందులకు విరుద్ధములు. గనుక మన భావనలతో వారిని విమర్శించిన మనకు దొరకునది అయోమయము అగమ్యగోచరము.

భవిష్యత్తు నెరింగిన వ్యాసుడు ముందు జరుగబోవు భారత యుద్ధ పరిణామముల సత్యవతి అంబికాదులకు తెలియజెప్పి వారిని తపోవనములకు బంపెను. భారత చరిత్రలో కురువంశపురాజులతో సంబంధము గలవారిలో ప్రథమముగా జన్మించిన వాడు వ్యాసుడు. అందరునూ పరమపదించిన పిదప చిట్టచివరన స్వర్గమేగిన వాడు వ్యాసుడు, అట్టివానినా మనము విమర్శించునది ? అట్టి మహాను భావుడగు వ్యాసుడే పాండవులకు భవిష్యత్తు నెరింగించుచు వారికి సాయపడగా మనము పాండవుల విమర్శించి కౌరవులను మెచ్చు చున్నాము. మనకు ధర్మరాజు మానహీనుడు కౌరవాగ్రజుడు మానధనుడు.

దుర్యోధనుడు మానధనుడా ?

మానధనుడనగా మానమే ధనముగా గలవాడనిగదా యర్థము. మనమెవరినైనను నిందించునపుడు అతడుచేసిన పనిని అవహేళన చేయుచు "నీకు పరువులేదా ? మానములేదా ? యిట్టి నీచపు పని యెట్లు చేసితివి ! ఛీ ! ఛీ ! యని నిందింతుము అనగా లోకులు ఛీ ! యని యనకుండునట్లు ప్రవర్తించుటయే మానధన మని దెలియుచున్నది. అట్లు ప్రజానురంజకముగ రాజ్యమును పాలించి పేరు వహించిన రాజును మానధనుడనుట న్యాయముగ

నుండునేగాని ప్రజాభిప్రాయమునకు విరుద్ధముగ పాలన జరిపి ప్రజానాశనమొనరించిన రారాజులాంటి వారెట్లు మానధనులగుదురో అగమ్యగోచరము.

దుర్యోధనుని జీవితమంతయు కుట్రలుకుయుక్తులు ఈర్ష్యా ద్వేషము అసూయ అహంభావములను ముండ్లపొదలతో నల్లుకొని యుండ అట్టివాని నాధునికులు మానధనుడని కొనియాడుటాశ్చర్యముగనున్నది. ఈతడొనరించిన పనులన్నియు విఫలములతో అవమానములతో నిండియుండెను. దుష్టబుద్ధి దుష్టస్నేహము దుష్టసలహాలతో దాయాదుల నణచుటకొనరించిన యీతని దుర్మార్గ కార్యములన్నియు చివరకు దుష్ఫలితములనే నిచ్చి, చెరుపకురా చెడెదవన్న నీతిని యదార్థమని ఋజువుచేసినవి. దురాశ దుఃఖము చేటు అను నానుడి దుర్యోధనునియెడల సార్థకమైనది. చెప్పుడు మాటలు చేటు అను నీతికి యితడేసాక్షి. దైవభక్తి పెద్దల సలహాల యందనురక్తి లేని వాడు చివరకు దుర్గతిపాలగు ననుటకు దుర్యోధనుడే నిదర్శనము.

బాల్యమున విలువిద్యా ప్రదర్శనలో పాండవులను మించలేకీతడు ఖిన్నుడయ్యెను. తనవారినందరిని దూరముగావించుకొని పరాయివాడగు కర్ణుని దరిజేర్చుకొనెనే గాని ఆతని వలన యీతడు పొందిన ఫలితము శూన్యము. బాల్యమున భీముని చంప ప్రయత్నించి విఫలుడయ్యెను. పాండవులను లక్కయింట గాల్పింప ప్రయత్నించి విఫలుడయ్యెను. మత్స్యయంత్రమును గొట్టుటలో

విఫలుడయ్యెను. సుభద్రను పెండ్లాడగోరి విఫలుడయ్యెను. ద్రౌపదిని మానభంగము చేయదలచి విఫలుడాయెను. అజ్ఞాత వాసము భంగమొనర్ప ప్రయత్నించి విఫలుడాయెను. యుద్ధములో గెలువ దలంచి నాశనమయ్యెను. ఇట్టివాడా మానధనుడు?

అవమానములు :

రాజసూయగానంతరమితర బంధుగులవలె తానును యింటి కేగక ఒంటరిగా మయసభ రహస్యముల నెరుంగదలచి అందు ప్రవేశించి. అవమానమొందెను. అడవిలోనున్న పాండవుల శపింప దుర్వాస మైత్రేయులను మునులను కుట్రతో బంపి తుదకు వారిచే తానే శాపము బొందెను. ఘోష యాత్రలో పాండవులకు తనభోగ భాగ్యములను ప్రదర్శించి వారి నవమానపరచ దలచి చివరకు తానే గంధర్వులచే బంధింపబడి అవమాన మొందెను. ఇవియా మానధనుడనుటకు నిదర్శనములు?

దుష్టసలహాలు :

ఇతనికి ధర్మరాజువలె స్వంతబుద్ధి శూన్యము. పరులబుద్ధిపై ఆధారపడినవాడు గావుననే యీతడన్ని ప్రయత్నములందు భిన్నుడయ్యెను. కణికుండనువాని సలహాగైకొని పాండవులను లక్కయింట గాల్పించ ప్రయత్నించెను. పరుల సలహాపై రాబోవు యుద్ధములో బలరాముని తనవైపు జేర్చుకొనదలచి సుభద్రను పెండ్లాడుటద్వారా చుట్టరికము చేయదలంచెను. శకుని సలహామీద

ధర్మరాజును జూదమునకు దింపెను. కర్ణుని ప్రోత్సాహమున ద్రౌపదిని వస్త్రవిహీనగా జేయదలచెను. కర్ణుని ప్రోద్బలమున పాండవుల నేడ్పింప ఘోషయాత్రకేగెను. అంగరాజు మాటలునమ్మి కృష్ణరాయబారమును భగ్నముజేసుకొనెను, చివరకు యుద్ధసన్నద్ధుడై కురుక్షేత్రమును స్మశానవాటికగా నొనర్చెను.

దుష్టరాజనీతి జ్ఞత :

రాజనీతిజ్ఞత మంచిదగుచో శత్రువులు నశించి తాను జయించి రాజ్యము సుభిక్షముగా ప్రజలు క్షేమముగా నుండవలయును. అట్టి పాలకుని రాజనీతిజ్ఞుడనవచ్చును. కానీ దుర్యోధనుని పాలనలో అన్నివిధముల అతని తలంపులకు విరుద్ధములే జరిగినవి గనుక అతని రాజనీతిజ్ఞత విజ్ఞతతో లేదని చెప్పదగును. కర్ణుని సహాయ ముండియు తాను ద్రౌపదిని పెండ్లాడలేకపోయెను. రాజసూయ యుగమువంటి దానిని యొనర్చి పాండవుల మించలేకపోయెను. చివరకు యుద్ధములో గెలువజాలక పోయెను. తొడలు విరిగిన సమయమున ధర్మరాజుతో దుర్యోధనుడిట్లనెను, సర్వసౌఖ్యములు దేవేంద్రునివలెనే యనుభవించితిని. ఇప్పుడు స్మశానవాటికవంటి రాజ్యమును నీవు పొందగలిగితివి. ఏలుకొమ్మని నిష్ఠూరముగా సుయోధనుడు పలికెను. అట్లు తన రాజ్యమును స్మశానముగ మార్చుకొనిన రారాజుగారి రాజనీతిజ్ఞతను భూషించవలయునా? దూషించవలయునా ? చదువరులే గ్రహించగలరు. ఇంచుమించు రావణుని రాజనీతిజ్ఞతనే యీతడును అనుసరించినటులున్నది.

అర్జునునికి కర్ణునికి యుద్ధముపెట్టి ఎవరుజయించిన వారిపక్షము గెలిచినట్లు నిర్ణయించవచ్చునని చెప్పిన విదురుని సలహాను పాటించక సర్వనాశనమును గోరిన దుర్యోధనుడు రాజ్యపాలన కర్హుడా? రాజు అనగా ప్రజలను రక్షించు వాడేగాని భక్షించు వాడు గాడుగదా! అట్టివాడెట్లు మానధనుడనబడును? ఈతడొక అవకాశవాది జూదమునగెలిచి ఇంద్రప్రస్థ పట్టణము రాజధానిగా గల పాండవ రాజ్యలక్ష్మిని పందెముగా పుచ్చుకొనిన దుర్యోధనుడు వారిభాగముపై పాండవుల రాజ్యాధికారము నంగీకరించినట్లేగదా! అట్లగుచో కృష్ణరాయబార సమయమున పాండవులు నా సోదరులే గాదు. రాజ్యభాగము గోరుటకు వారికి హక్కులేదని ఎట్లు వాదించి నాడు? ఇదిఅవకాశవాదముగదా! ఇట్టివారా మానధనులు?

పాండవుల తండ్రి పాండురాజేయని నారదుడామోదించెను. తండ్రికి సద్గతులు గలుగుటకై పాండవులచే రాజసూయమును చేయించెను. కానీ పాండవులు యమునికిగాని వాయుదేవునకుగాని ఇంద్రునకుగాని అశ్వనీదేవతలకుగాని వారి సద్గతులకై రాజసూయమును చేయలేదను సంగతి పాఠకులు గుర్తించవలయును. అసలు యీ దేవతలకు మరణమననునది యుండినగదా వారికి రాజసూయము చేయుట తటస్థించునది? ఈ పరిశీలనను బట్టిచూడ పాండవుల తండ్రి పాండురాజేయని తెలియుచున్నది. అట్టిచో పాండవులు పాండురాజు పుత్రులుగారు గనుక వారికి రాజ్యమందు భాగములేదని దుర్యోధనుడు చేయు వాదము అవకాశవాదమేగదా!

దుర్యోధనుడొనర్చిన అక్రమ కార్యములన్నియు రాజకీయ తంత్రములా ? ధర్మరాజొక్క అబద్ధమును ఆత్మరక్షణకై ఆడెనోలేదో ఆయనను అధర్మపరుడని విమర్శకులనుటయా ? ఇదియే మివిచిత్రము. ఒకవేళ ఉభయులును అక్రమము లొనర్చిరని యనుకొందమా? రారాజు యక్రమములకు కారకుడు కర్ణుడు. ధర్మ జుని అధర్మములకు కారణభూతుడు కృష్ణుడు. అయితే కర్ణుడు స్వార్థపరుడు కృష్ణుడు నిస్వార్థపరుడు, కౌరవుల యక్రమములు కావలయునని జేసినవి. పాండవుల యక్రమములు కృష్ణుని బలవంతముపై యొనరించినవి

రాజసూయమునందు పాండవుల వైభవమును గురించి శకునితో చెప్పి తన తక్కువ తసమును సుయోధనుడే వెల్లడించు కొని యుండగా ఆధునికులు కొందరు దుర్యోధనుని మానధనుడు దానపరుడు భోగపరుడని పొగడుట హాస్యాస్పదముగా యున్నది. పాండవులు రాజసూయము చేసినందులకు బదులుగా వారితో సమా నులమని యనిపించుకొనుటకై కౌరవాగ్రజుడు గూడ ఒక యజ్ఞము చేసెను. ఇది దాయాది ద్వేషమునకు నిదర్శనమేగదా ! కానిచో తండ్రి చనిపోయినపిదప చేయవలసిన యాగమును ధృతరాష్ట్రుడు బ్రతికియుండగానే చేయుటేమిటి ? పురోహితుడు వారించిన మీదట వైష్ణవంబును యజ్ఞమును చేసెను గాని అది రాజసూయ మును మించలేదు. మరియు పాండవుల మయసభను జూచిన పిదప దానికీడుగ నుండదగు సభనొకదానిని సుయోధనుడు గూడ

గట్టించెను, కాని వారిసభలో రాజసూయము జరుగగా వీని సభలో జూదము జరిగినది.

ఏకాంతముగ మాటలాడు సంభాషణలు యదార్థములయినవి. పదిమందిలో పలుకుమాటలు మెప్పుబొందునవి. నిజమునరయ వలయుననిన పై సూత్రమును గమచించవలయును కర్ణుడు కృష్ణునితో ఒంటరిగా మాట్లాడిన విధమువేరు, రాయబారసభలో పల్కిన తీరువేరు. ఈమాటలు బాగుగా కర్ణుని కపట హృదయమును తెల్లము జేయుచున్నవి. అట్టికర్ణుని మెప్పుమాటలకు లోబడిన దుర్యోధనుని అమాయకత్వమునకు దిగులొందవలసి వచ్చుచున్నది. పాండవులే గెల్చెదరు కృష్ణా! యని నిజముపల్కిన కర్ణుడు అంతకు పూర్వము కృష్ణుని తృణీకరించి కురువీరుని యుద్ధమునకు ప్రోత్సహించుచు మాట్లాడెను.

వ్యక్తిగతముగ పాండవులు కౌరవులకొనరించిన ఘోరమగు ద్రోహమేమియునూ లేదు కాని వారి ఔన్నత్యమున కోర్వలేకనే కౌరవులు పాండవుల కపకారమొనరింప దలపెట్టిరి. అట్టి యపకారముల తప్పించుకొనుటకు మాత్రమే పాండవులు యత్నించిరి గాని బదులు అపకారమునకు పూనుకొనలేదు. అందుచే సుయోధనుడు అవమానధనుడే గాని మానధనుడు మాత్రముగాదు.

యుద్ధము :

యుద్ధములో నయితమీతని రాజకీయ చతురతలు అవకతవకలుగనే యున్నవి. తనపై ప్రేమగల రాజులను తన

వైపుంచుకొనినచో అట్టివారు తీవ్రముగా పోరాడుదురు. తాను గెల్చియే యుండును. కానీ ఆతడు రాజులనేకులను మోసముచే పొగడ్తలచే కుట్రలచే తనవైపు త్రిప్పుకొనెను. అందుచే యుద్ధములో ఓడెను. కృతవర్మను కృష్ణుని శల్యుని కుట్రలతో త్రిప్పుకొన యత్నించెను. కానీ కృష్ణుడుమాత్రమాతని కుట్రకులో బడలేదు. తాను చేర్చుకొనిన సైనికులందరు పాండవాభిమానులే. కృతవర్మ యాదవుడు. శల్యుడు నకులసహదేవుల మేనమామ. పుత్రునికన్నను శిష్యుడగు అర్జునుని మిక్కిలి ప్రేమించినవాడు ద్రోణుడు. పాండవుల పద్ధతి ధర్మమని పలుమార్లు కౌరవులకు చెప్పిన వినని. కౌరవుల వైపయిష్టముగా యుద్ధముజేయువాడు భీష్ముడు. భీష్ముడు నేలబడువరకు కత్తిపట్టనని భీష్మించిన కపటి కర్ణుడు. చేజిక్కిన పాండవుల విడచిన వ్యర్థప్రగల్భుడంగరాజు. ఇట్టి అయిష్టపరులగు సైన్యమైనందుననే పదకొండక్షౌహిణుల సేన గలిగియుండియు దుర్యోధనుడు ఓడిపోవలసివచ్చెను. అయితే ఇట్టి అయిష్టుల నెందులకుంచుకొనినట్లు? వెళ్ళగొట్టవచ్చునుగదా! అని ఆలోచించిన అతడట్లుచేయజాలడని తెల్లమగును.

భీష్మద్రోణ కృపాశ్వత్థామ విదురాదులు పాండవ పక్షపాతులు. వారిని వెళ్ళగొట్టిన మరొక చోటికేగి బ్రతుకలేనివారా వారు? ఒక్కొక్కరు మేరునగ సమధీరులను సంగతి సుయోధనునకు బాగుగా దెలియును. కానీ వారిని వెళ్ళగొట్టుటకీతనికి హక్కులేదు. కౌరవుల వారిపితరుల పెంచి పెద్దజేసి రాజ్యమును రక్షించిన

వాడు భీష్ముడు. భీష్మునిచే గురువులుగ నియోగింపబడినవారు ద్రోణుడు కృపుడు. అశ్వత్థామ గురుపుత్రుడు. విదురుడు కొంత వారసత్వాధికారముగలవాడు. అట్టిమహామహులకు సుయోధనుడు తన సొత్తుపెట్టినదెప్పుడో ? ఊరక ఊకదంపుడు మాటగ కర్ణునితోబాటు తానుగూడ వారిని తిన్న యింటి వాసాల లెక్కించు వారని దెప్పుటయే దప్ప అంతకు మించి వారిని శిక్షించు అధికారము తనకు లేదని అతనికి విదితమే. పెద్దలు చచ్చినపిదపనేగదా పిన్నలకు సంపూర్ణాధికారముకలుగునది. జూదమాడిన పిదప దుర్యోధనునాజ్ఞమేరకు పాండవులు పై అంగవస్త్రములను తీసి క్రిందనుంచిరి. ద్రౌపదిని మాత్రము కోకలాగ ప్రయత్నించిరి. అసలు యిట్లువస్త్రములు వదలించుటలోగల భావమేమిటని యాలోచించిన, ఓడిన పాండవులకు రాచమర్యాదలు తీసివేయుట అని తెలియును. అట్లుగుచో పాండవుల వస్త్రముల వలెనే ఆమెపైగల రాజలాంఛన తెలుపు వస్త్రమును మాత్రమే తీసివేయుట న్యాయము. అంతియే గాని దిగంబరిగా యొనరించ యత్నించుట కౌరవుల నీచస్వభావమునకు తార్కాణము, అసలు ద్రౌపది చేసిన తప్పిదమేమున్నది. అవివేకపు పనులొనరించు వారిని జూడ నవ్వువచ్చుట సహజము గదా ? మయసభలో దుర్యోధనుని అవివేకపు చేష్టలకు నవ్వినది. అంతమాత్రమే, కౌరవులకసలు శత్రువులు భయంకరులు భీమార్జునులేగదా ! నిండుకొలువులో వారినే దిగంబరులుగచేసి అవమానపరచుట ఒకవిధముగా న్యాయము. అట్లొనర్పలేక అబలయగు అమాయకురాలగు ఆడదానిని అవమానపరచ ప్రయ

త్నించిన దుర్యోధనుని ధీరత ఆతనిలోని పశుత్వమును వెల్లడి చేయుచున్నది. తానుగోరిన స్త్రీ తనకు దక్కలేదు. మత్స్యయంత్రమును కొట్టలేదు. అంతియేగాక ఆమె దాయాదులగు శత్రువులకు చెందినది. అట్టి కామసంబంధమైన ఈర్ష్యను దుర్యోధనుడిట్లు దీర్చుకొనెనాయని గూడ యనిపించును. కర్ణుడీతనికి ప్రోత్సాహకుడు గనుక ఉభయుల భావములొక్కతీరుగనే యుండును. అహల్యను ఇంద్రుడు, సీతను రావణుడు బాధించిన పద్ధతి వారి బుర్రలలో బాగుగా నాటుకొని యుండవచ్చును. ఇట్టివానిని మానధనుడని యీనాడు పొగడుట. విచిత్రము వినోదమునకే అయి యుండనోపు. నిజమైన మానధనుడు ధర్మరాజేయని చెప్పనగును.

ధర్మజునివియన్యాయములా ?

పాండవులొక్కొక్క రొక్కొక్క విద్యలో అగ్రగణ్యులు. అది వారి పూర్వజన్మ పుణ్య ప్రాబల్యము వలన లభ్యమయినవే గాని కేవలము గురుబోధచే వచ్చిన విద్యలు గావు. అందువలననే వీరులైన సోదరులు ధర్మాధర్మ విచారణ సంభవించినప్పుడు మాత్రము అన్నగారగు ధర్మజుని ఆజ్ఞకే బద్ధులగుచుండిరి. ధర్మజుడు నీతి నియమాదులలో అందరిని మించినవాడు. గనుకనే అతడు శకుని దుర్యోధనునిచే గూడ కీర్తింపబడినాడు. మంచి విద్యార్థియని అర్జునునిపై ద్రోణున కభిమానముగలదు. కాని సత్యసంధత ఉన్నత ఉదాత్తత ప్రమాణములతో సత్పథమున సంచరించు ధర్మజుని పైగల గౌరవము నమ్మకములు ద్రోణునికి

మిగతవారియందులేవు. ఇందుకునిదర్శనము "అశ్వత్థామహతః" అని ధర్మజుడు పలికినప్పుడు మాత్రమే నమ్మి ద్రోణుడు అస్త్ర సన్యాసమొనరించుటయే చాలును.

ధర్మజుడు శాంతము శాంతమని పల్కుచు కష్టముల పాల య్యెననియు, ఇతనిలో క్షత్రియ ధర్మములు లేవనియు విమర్శించు చుందురు. అది అసంపూర్ణమగు విమర్శ. రాజులకుండదగు లక్షణ ములన్నియు నితనిలో గలవు. ఇతడు కార్యసాధకుడు, శాంతముతో పెద్దల ప్రజల అభిమానము చూరగొనినవాడు. అడుగకనే నితరుల సహాయమును పొందిన లౌకికుడు. దైవము తనవద్దకొచ్చెనే గాని తాను దైవము వద్దకు పోలేదు. కష్టములు తనకు లోబడినవే గాని తాను కష్టములకు లోబడలేదు. ఈతడు యుద్ధమునకు పూర్వము శాంతము నారాధించెను. యుద్ధములో మాత్రము చక్కని సైన్యా ధ్యక్షునివలె వ్యవహరించెను. భీష్మ ద్రోణుల ఆయువుపట్టెరింగెను. తన పరోక్షమున అభిమన్యుని యుద్ధమునకు పంపవలదని పార్థుడు పలికిననూ అభిమన్యుని యుద్ధమునకు పంపిన ధైర్యవంతుడు, అభిమన్యుని మరణానంతరము ఆగ్రహావేశుడై వచ్చిన అర్జునుని కత్తిముందు తలవంచి సత్యాగ్రహమను ఉపాయము ద్వారా తమ్ముని శాంతపరచిన సత్యాగ్రహి ధర్మజుడు. గాండీవమును వీడమని కఠినముగా బలికి అర్జునుని రెచ్చగొట్టి తనను తోలాడ గొట్టిన కర్ణుని వధింపజేసిన పౌరుషవంతుడు. నీళ్ళలోదాగిన దుర్యోధనుని తన పౌరుషవాక్కులచే బయటకు రప్పించి అందరు

గలిసి ఆతనిని చంపక ఎవరితో పోరాడుదువో కోరుకొమ్మని తమ్మునకవకాశమిచ్చిన ధీమంతుడు నీతిమంతుడు న్యాయశీలి ధర్మజుడు.

ఇట్లు లెక్కకుమిక్కుటమగు సద్గుణరాశి సంపన్నుడగు ధర్మజుని గూడా విమర్శకులు నేడు విమర్శించుచుండిరి. ఔరా! ఏమి విచిత్రము! ఈయన వ్యసనపరుడట అసమర్థుడట అబద్ధమాడెనట, అక్రమ యుద్ధమొనరించెనట.

ధర్మరాజు వ్యసనపరుడా ?

ఈయన జూదమాడినది శకునితో రెండు మార్లు. మరల విరాట రాజువద్ద జూదమాడెను. జూదమందితడు కడునేర్పరి. అందుచేతనేగదా దుర్యోధనుడీతనితో ఆడలేక శకునిని అడ్డముగా పెట్టుకొనినది, ఆశకునిగూడ మోసముజేసి ధర్మజుని ఓడించగలిగెనే గాని యదార్థముగగాదు. వ్యసన పరునికి తాత్కాలికానందమే ప్రధానమగును గాని దాని ఫలితాఫలితములతో నిమిత్తముండదు. కానీ ధర్మజుడట్టివాడుగాడు. జూదము వలదని సోదరుని వారించెను. త్రాగుబోతు యితరులకు త్రాగరాదని బోధించునా ? వ్యసనములు ఏడు. ఇట్టి వ్యసనపరులకు సిగ్గు బిడియము గౌరవము పరువు యేమియు యుండవు. ఒకవేళ యున్నను కొన్నాళ్ళకవి తప్పక దూరమగును. అన్నదమ్ములు జూదమాడరాదు. పూర్వము పుష్కరుడు నలుడు జూదమాడి ఇబ్బందుల పాలైరి అని బోధించిన పండితుడగు ధర్మజుని వ్యసనపరుడనుటయా ? అయినను కౌరవు

లతో ఆతడాడిన జూదము అయిష్టముతో గూడినదే గాని ఉల్లాస ముగా నాడినదిగాదు. క్షత్రియగౌరవము నిలబెట్టుటకు పెద్దల మన్నలందుటకు మాత్రమే ఆయన శకునితో జూదమాడవలసి వచ్చెను.

మొదటి జూదములో పడరాని పాట్లు బడియు మరల రెండవ జూదమునకు సమ్మతించుటేమిటి యని ప్రశ్న. అందుకు ప్రబలకారణములు గలవు. మొదటి జూదములో కౌరవులెంతయక్రమములు సాగించిననూ తమకేమియు అవమాన ములు జరుగలేదు. దైవకృప తమయందున్నది. పెద్దల యభిమా నము తమపై ఇనుమడించినది. శత్రువులగు కౌరవులకు అపఖ్యాతి వృద్ధియైనది. జూదము చెడ్డదని ధృతరాష్ట్రుని దుర్యోధనుని మందలించిన వ్యక్తియు ఇంతకు పూర్వము లక్కయింటిలో గతించ కుండ తమకు సలహాపంపి సాయమొనరించిన ఉపకారియగు విదురుడే జూదమునకు రమ్మని ఆహ్వానించుటకొచ్చినప్పుడు. ధర్మరాజాయన పిలుపును తిరస్కరించగలడా ? మొదటి జూదమున కౌరవాగ్రజుడక్రమొనరించిననూ తాను జూదములో ఓడిన రాజ్యము నంతయూ తిరిగి తనదిచ్చిన పెదనాన్నగారి ఆహ్వానమును నీతీ పరుడగు ధర్మజుడెట్లు తృణీకరించగలడు ? ఇట్లు సూక్ష్మదృష్టిని యోచించి ధర్మజుడు రెండవ జూదమునకేగెనే గాని వ్యసనపరుడై పోలేదని తెలియనగును.

పాండవులడవిలో నుండగా ధృతరాష్ట్రునిచే వెడలగొట్ట బడిన విదురుడు పాండవులవద్ద కేగుచుండెను ఆతనిని చూచిన

ధర్మరాజు మరల జూదమునకు రమ్మని పిలుచుటకై వచ్చుచుండె నేమో నను భయమును వెలిబుచ్చుచు "ఇకమీదట నేను జూద మాడనని" భీమునితోనను. వ్యసనపరుని నోట యిట్టిమాటరాదు గదా! అట్లయినచో విరాటరాజింటనుండు సమయమున ధర్మజుని వద్ద పాచికలేల యుండెను? ఆయనతో జూదమెట్లాడెను? అను ప్రశ్న వచ్చును. దానికి కారణముగలదు. పాండవులు తమ పరివారమును అస్త్రశస్త్రములనన్నింటిని విడచి కట్టుబట్టలతో అజ్ఞాతవాసమేగిరి, విరాటరాజు తనతో జూదమాడమని కంకు భట్టును గోరెను. అప్పుడు "నావద్ద డబ్బులేదు. కానీ నీవు మాత్ర మోడినచో డబ్బును ఫణముగా పెట్టవలెనని" ధర్మజుడు విరటుని గోరెను. అట్లు జూదములో ధనము సంపాదించుకొని పాండవులు పై ఖర్చులకు వాడుకొనుచూ వత్సరకాలమును ధర్మజుడు గడిపెనే గాని వ్యసనపరుడు మాత్రము గాదని యెరుంగవలయును. మరియు జూదము రాజులకు వినోదము అట్లు విరాటుని వినోద పరచుటకై పాచి కలను ధర్మజుడు వెంట గొనిపోయెను.

ధర్మజుడ బద్ధమాడెనా ?

అసలు సత్యవంతుడను బిరుదు హరిశ్చంద్రునకే గాని ఈయనకులేదు. ఈయన బిరుదు శాంతమూర్తి. అయితే పండితుడు గనుక అసత్యమాడరాదను నీతిని ఈయన పాటించెను. ఈయన జీవితములో పరులకపకారమొన రించునట్టిదగు ఒకే ఒక అబద్ధ మాడెను. ఆయబద్ధముగూడ యుద్ధసమయములో ఆపత్కాలములో

ఆత్మరక్షణకై దైవమగు కృష్ణుని ప్రోత్సాహమున తనకొరకు మాత్రమేగాక తనపక్షమువారి జయమునకై పలికెను. సైన్యాధ్యక్షులు శత్రువులనోడించుటయే ప్రథమకర్తవ్యముగా తలంతురు. సామాన్యుని ధర్మాచరణ పద్ధతివేరు, సైనికుని పద్ధతివేరు. పాలకుల ప్రవర్తనవేరు, ప్రజల ప్రవర్తనవేరు.

అబద్ధమాడజాలనో దేవుడా యని అల్లాడుచు విధిలేక కృష్ణుని సలహా పాటించి పలికెను. అదియును యదార్థముగ చూచిన అబద్ధము గానేగాదు. "అశ్వత్థామ హతః" అని బిగ్గరగా "కుంజరః" అని మెల్లగా పలికెను. అశ్వత్థామ యను ఏనుగ జచ్చియుండెను. గాన అట్లు ధర్మజుడు పలికెను, కానీ ద్రోణుడు తనకుమారుడే మరణించెనని అస్త్రములు విడచెను. అపుడు ఆయనను సులభముగా వధించగలిగిరి, ధర్మజుడట్లు పలుకనిచో పాండవపక్షము అపజయమంది యుండెడిదేమో? యుద్ధమందు ప్రాణములు బోవుచున్నపుడు తెలివిగల కృష్ణుని సలహా పాటించి యుండనిచో పాండవులు సర్వనాశనమై యుండెడివారేగదా? అప్పుడీవిమర్శకులు ద్రౌపతీవస్త్రాపహరణ సమయమున పాండవుల నసమర్థులుగ వర్ణించి నటులే ధర్మరాజును చేతగాని దద్దమ్మ యని వ్యాఖ్యానించి యుండెడివారు. పాండవులు చెప్పినట్లు చేయు కూలివాడా కృష్ణుడు? కృష్ణుడు పాండవులను గెలిపించుటకు వారిపక్షము జేరెనునుగాని వారితో పాటు జచ్చుటకు జేరలేదుగదా? జరాసంధుని సహాయకులగు హంస, డిభకులను వారలను యింతకు పూర్వము

కృష్ణుడిటులే అబద్ధమాడి వుపాయముగ చంపగలిగెను. ఆవిషయము నెరింగినవాడు కృష్ణుడు. అంతేగాక కృష్ణుడింతకు పూర్వమనేకులతో యుద్ధములొనరించి యుద్ధములందలి కష్టనిష్టూరము లెరింగినవాడు. తన విరోధియగు కాలయవనుని నిక్లై ఉపాయముగ ముచికుం దునిచే కృష్ణుడు జంపించెను. గనుక ఉపాయములచే అపాయ ముల తప్పించుకొనవలయునను నీతిని అమలుపరచి కృష్ణుడు భీష్మ ద్రోణాదుల జయింప పాండవులకు మంచిసలహా నిచ్చెను. ధర్మరాజుకట్టి రణరంగ పరిజ్ఞానము అంతకు పూర్వమనుభవములో లేదు. పాండవులు కృష్ణుని "నీవే దిక్కని" నమ్మిరి. అట్టి కృష్ణుని సలహాను ధిక్కరించుటకు పాండవులకధికారము లేదు, పాండవుల పాపపుణ్యములకు తానేబాధ్యతవహింతునని పల్కిన వాసుదేవుని సలహాను పాటించియుండనిచో పాండవులు వుభయభ్రష్టులయి యుందురు. గనుక పాండవుల అక్రములకు కృష్ణుడు బాధ్యుడుగాన ఆయనను విమర్శింపవచ్చునేమో గాని పాండవులు విమర్శనీయులు గారు.

కృష్ణుని పనులు అక్రమములా?

ధర్మసంస్థాపనకై పుట్టినవాడు కృష్ణుడు, కృష్ణుని నమ్మిన వారు పాండవులు. అట్టి కృష్ణుడు పాండవ పక్షపాతి యగుటలో లోపమేమియును లేదు. నమ్మిక లేనివారికి సాయమొనర్చినను ఆది విపరీతముగనే యుండును. ఆ సాయము తిరస్కరింప బడుటయు జరుగును నూరు కల్లలాడి ఒకయిల్లు నిలిపిన, పుణ్య

మను సామెతవలె కార్యసాఫల్యతకెన్ని వక్ర మార్గములైనను ద్రొక్క వలయును. అట్టివాడే సమర్థుడనబడును. పర్యవసానము మంచిదా లేక చెడ్డదా యని పరిశీలింపవలయునే గాని నడుమ నడుమ సంభవించు ఆటంకములు లెక్కసేయక ఉపాయముచే గట్టెక్కుట కార్యసాధకుని లక్షణము. అట్టివాడు కృష్ణుడు. చతురోపాయ నిపుణుడు. కృష్ణుడొనరించిన అక్రమములు స్వార్థమునకు గాదు. పరార్థముకొరకే నని ముందెరుంగవలయును. కౌరవులకు కృష్ణునిపై నమ్మికలేదు, తనకు మేనత్తకొడుకులే పాండవులు. అందువలన కృష్ణుడు పాండవ పక్షముండుట సహజము, న్యాయము, అట్టివారి నెట్లయినను రక్షించుట కృషునికి ధర్మము. మత్స్య యంత్రము గొట్టిన నాటి నుండియూ కృష్ణుని తీర్పులు పాండవుల కనుకూలముగనే యున్నవి. అనగా న్యాయ సమ్మతముగా ధర్మ పద్ధతినే యున్నవి. రాయబారసమయమున ఆయన న్యాయమైన పలుకులు విని పునీతులమగుదుమని ఋష్యాదులు మునీశ్వరులనేకులు విచ్చేసిరి. లోకమాయనను న్యాయమూర్తిగ భావించినదే గాని ఆయన మాత్రము పాండవ దూతగనే కౌరవ సభకు విచ్చేసెను, గనుక కృష్ణుని పాండవ పక్షపాతి యని విమర్శించుట యనవసరము కౌరవులు నమ్ముకొనిన కర్ణుని కంగబలమే గాని బుద్ధిబలము లేదు. అందుచే వారు ఓడిరి పాండవులు నమ్ముకొనిన కృష్ణునికి బుద్ధిబలమెక్కువ గనుక జయమందిరి, అ బుద్ధిబలమునే నేడు అక్రమములని విమర్శించుచున్నారు.

కృష్ణుడు దేవుడెట్లయ్యెను?

ఈయన యొనరించిన కార్యములద్భుతములు, మానవాతీతములు, పరోపకారములు, లోకకళ్యాణార్థములు. పసిబాలుడుగ నున్నపుడే తనను జంపవచ్చిన పూతనను గుర్తెరింగి హతమార్చెను. మద్దిచెట్ల రూపమున నున్న నలకూబర మణిగ్రీవుల శాపముబాపెను. తనను వధింప కంసుడుబంపిన మాయారూపులగు శకటాసుర తృణావర్తాది రాక్షసుల హతమార్చెను. యాదవుల గోవుల జంపుచు విషముగ్రక్కు కాళీయునిపై దుమికి నృత్యమాడి దాని మదమడంచి కరుణించిపంపి యాదవుల రక్షించెను. దేవేంద్రుడు కలుగజేసిన రాళ్ళవర్షమునుండి, గోవర్ధనగిరిని గొడుగువలె తన వ్రేలితో నెత్తి భక్తులగు గొల్లల గాపాడెను. గొల్లల గోవులను దూడలను బ్రహ్మదేవుడు మాయమొనర్చగా తానే గొల్లలుగా గోవులుగా లేగలుగా మారి కృష్ణుడు తనమహిమ లోకమునకు చాటెను. ఈ బాలుని నోటిలో పెంపుడుతల్లి యశోద, భూగోళమునే గాంచెను. కురూపియగు కుబ్జను అందమైన సుందరిగా మార్చెను. లోకభయంకరుడగు కంసుని జంపి తలిదండ్రుల చెఱనుండి విడిపించెను. లోక కంటకుడగు నరకాసురుని పీచమడంచి పదునారువేల స్త్రీలను బంధవిముక్తుల గావించెను పిడికెడు అటుకులు భక్షించి బీదభక్తుడగు కుచేలుని కుబేరునిగా చేసెను. భక్తురాలగు ద్రౌపదికి, గోపికలను మానభంగ మొనర్చిన కృష్ణుడు మానసంరక్షణము

గావించెను. పాండవులను శపింపవచ్చిన, దుర్వాసుని, అతని శిష్యుల పదివేలమందిని, అక్షయపాత్రలోని ఒక్కమెతుకును తాను మ్రింగుటద్వారా తృప్తుల గావించి పాండవుల రక్షించెను. కౌరవుల సభలో తన విశ్వరూపమును ప్రదర్శించెను. సైంధవ వధకై పార్థుని రక్షించుటకై సూర్యబింబమును కృష్ణుడు మరుగు పరచి లోకులను ఆశ్చర్యచకితులఁ గావించెను. ఉదకములేని ఉదంక ముని ఆశ్రమ ప్రాంతమున జలమును గల్పించెను. పదునారువేల గోపికల యిండ్లలో పదునారువేల కృష్ణుస్సుగా నారదునకు గన్ప ట్టెను. అందుచే భగవంతుడీతడని మునులు పొగడిరి. భక్తులు కీర్తించిరి. ఆపదలో ఆదుకొనినవానిని దేవుడని పొగడుట మాన వులకు నైజమేగదా!

కృష్ణుడు చోరుడా ?

ఈయన దొంగిలించినది పాలు పెరుగు వెన్నమాత్రమే గాని పరుల ధనమపహరింపలేదు. ఆ దొంగతనమైనను తోడి బాలకుల కొరకేగాని తనకుగాదు. ఆయనను యశోదా నందులు ముద్దుగ పెంచినటుల మరొకబిడ్డడు పెరిగియుండడు. ఇక ఆయన రెండవ దొంగతనము గోపికల చీరలపహరించుట. అదియును బాల్యమునందొనర్చినదేగాని యౌవనమందుగాదు. ఒక్క ఆడ మనిషి ఒంటరిగ స్నానమొనర్చునపుడొచ్చి చీరె నపహరించినచో ఆ దొంగ బుద్ధి నీచమైనదేనని యనవచ్చును. అట్టినీచుడ నేక మంది జలకములాడుచుండ చీరెలు దొంగిలించినచో వాని చావు దాపున

కొచ్చినట్లే యని యెల్లరెరింగినదే. గనుక బాలుడగు కృష్ణుడు భగవంతుడేనని మునులనుచుండ గోపికలు వినియుండిరి. నిస్వార్థ పరుడు నిష్కపటుడు నిష్కళంకుడు నిరంజనుడు నిరామయుడు గనుకనే గోపకాంతలాతనికి చేతులెత్తి ప్రార్థించిరి. లేనిచో ఆ బాలుని వారు చితకబొడిచి యుండెడువారు. అట్లు చెయ్యెత్తి నమస్కరించిన దిగంబర గోపికలకు అపచార మొనరింపక వారి చీరలు వారికిచ్చి పంపుటలోనే ఆయన గొప్పతనము వెల్లడి యగుచున్నది గదా!

కృష్ణుడు జారుడా?

ఇతడు జారుడు కాదనుటకొక్క యుదాహరణమే చాలును. మరియు ఈయన రాసక్రీడలు జలక్రీడలు నిష్కపటమగు బాల్యమున జరిగినవేగాని యౌవనములో జరిగినవిగావు. కృష్ణుడు పారిజాతమును రుక్మిణికిచ్చినాడని తెలిసినంతనే అలిగిన సత్యభామ ఆయన శిరమును కాలితో తన్నిన ముద్దులమూటయగు అలేమ, నిజముగా గోపికలతో విహరించుచున్నచో కృష్ణుని కాలరాచి యుండదా? అట్టి సత్యభామయే కృష్ణుని కీర్తించుచుండగా మనమాయనపై అభాండములు వేయుట మన యవివేకమును వెల్లడించుకొనుటయే గదా! పదునారు వేల గోపికలతో పదునారువేలరూపముల క్రీడించి అష్టభార్యలతో ఆటలాడి యానందించు కృష్ణుని వ్యభిచారి యని నిందించు వారట్టి పనిని నేయుగలరా? పైగా గోపికల భర్తలందరు కృష్ణుని ప్రార్థించిరి. మనమట్లు చేసినచో మనకు లభించినవి ప్రార్థనలు

గాకపోగా బడితె పూజలు బాగుగ జరుగును. కృష్ణుడొచ్చి తమ్మాదరించక పోయేనేయని గోపికలల్లాడిరి గాని గోపికలకై కృష్ణుడల్లాడలేదని గుర్తించుట యవసరము. ఆయనకు కోరికలే లేవు. లోకుల కోరికలు దీర్చువాడాయన. అందుచేతనే అయన అస్ఖలిత బ్రహ్మచారి యని యనబడెను. ఒక్కభార్యతో సంసారము చేయజాలక సతమతమగుచున్న మనవలెగాక అంతమంది వనితలతో వయ్యారముగ నయగారముగా శృంగారముగా సరసముగా ఛలోక్తులతో చమత్కారములతో కలతలులేక కాపురమొనరించు కృష్ణుని సామర్థ్యము జూచి యైనను ఆయనను మానవాతీతుడని మ్రొక్కవచ్చునే. కృష్ణుడు స్త్రీలోలుడు కాదనుటకు ఈ క్రింది ఉదాహరణము చాలును, మత్స్యయంత్రము గొట్టుట తనకు తెలిసియుండియు సౌందర్యశాలియగు ద్రౌపదిని తాను పెండ్లాడ ప్రయత్నించలేదుగదా! ఒక్క గోసాయివచ్చి మంత్రములతో కోర్కెలను సఫలము చేయగలనని యనికచో, మనము మన భార్యలను వాని వద్దకంపి తృప్తిగ బయట శివశివా యనుచు పడిగాపులు గాయుట నేడెరింగిన యథార్థము, వైద్యుని వద్దకు పరీక్షకై మనవనితల నంపి మనము నిర్విచారముగ వెలుపల వేచియుండుట లోక అటులే కృష్ణుడు భగవంతుడని నమ్మిన భక్తులగు గోపకులు తమ తమబాధల బోగొట్టుకొనుటకై తమ భార్యల భగవంతుని సేవకు బంపిరని ఉత్తమ భావమును గ్రహింప లేరేమి యీ విమర్శకులు? ఆడదాని కాలితన్నులుతిన్న ఆయనేమి దేవుడయ్యా యని యరచు వారు కొందరు ఈ చర్యలోని అంతరార్థమమోఘము. కృష్ణుడు

సత్యభామచే తన్నులు దినిననూ గోపించక మరల యామె పాద మెక్కడ నొప్పిజెందెనో యని యొత్తును. దీని యర్థమేమన: "ఓలోకమందలి భర్తలారా! మీరు మీ భార్యలను నావలెనె ప్రేమించండి ఆదరించండి అన్యోన్యముగ నుండండి సేవించండి సుఖించండి. శాంతముతో సాధింపలేనిది లేదని" లోకమున కెరుక పరచెను. భార్యల కోపములలోని ఆంతర్యములు ప్రేమ బాంధవ ములేనని ఆయనకు బాగుగ తెలియును. అందుచేతనే ఆయనెప్పుడును పత్నులపై పగబూనలేదు. అపకారికి నుపకారము చేయవలయునను నీతిని ఆచరించినాడు. శిక్షయనగా మనసు మార్చగల శిక్షయే శిక్ష. శరీరమును బాధించు శిక్ష మనస్సును మార్చలేదు. ఈ సూత్రమును కృష్ణుడమలు పరచి కఠిన చిత్తురాలగు సత్యభామను పరమ భక్తు రాలిగా మార్చుకొన గలిగినాడు. గాంధి మహాత్ముని సత్యాగ్రహ మిట్టిదే. క్రీస్తుప్రభువు పద్ధతియు నిట్టిదే. బుద్ధుని బోధయు నిట్టిదేగదా!

కపటియా కృష్ణుడు ?

ఈయనను కపట నాటక సూత్రధారి యని భక్తులు కొని యాడుదురు. యితరులు కోపగించెదరు. దొంగను పట్టవలె ననిన దొంగవలె తాను నటించవలసి యుండునుగదా? ఈయన లోకులను రక్షించుటకై కపటోపాయములు పన్నెను. ఉపాయముచే అపాయ ములు తప్పించుకొనవలెనని ఆచరించి లోకమునకు భోధచెనెను. తన బిడ్డల తప్పిదములను సరిదిద్దుటకు తండ్రి ఉపాయమును

పన్నును. ఒకప్పుడు గద్దించును. మరియొకప్పుడు మాయజేసి లాలించును, ఇంకొకప్పుడు బిడ్డలకు అడిగినది యిచ్చి తగాదాలు సర్దుబాటు జేయును. భగవంతుడగు కృష్ణుడొనరించిన పనులన్నియు నిట్టివే యని చదువరులు గ్రహించవలయును.

పాండవుల యుద్ధము కొరకు మాత్రమే కృష్ణుడు కపటోపాయములు పన్నలేదు. ఆయన పుట్టినది మొదలు ఆయనొనరించిన కార్యములన్నియు కపటోపాయములే. ఆ కపటోపాయముల ఫలితము దుష్టశిక్షణ శిష్టరక్షణ మాత్రమే. అనగా ఆస్తికుల నాదుకొనుట. నాస్తికులను నాశనమొనరించుట సాధువులను సంరక్షించుట దుర్మదాంధులను దుష్టబుద్ధులను లోకకంటకులను స్వార్ధపరులను శిక్షించుట .... ఇట్టి ఉపాయశాలియగు కృష్ణుడు పాండవుల ప్రక్కజేరియుండగ కౌరవులు యుద్ధమునకు దిగుటయే శుద్ధబుద్ధి తక్కువ పని. అట్టి ఉపాయములను అధిగమించలేక కౌరవులు కృష్ణుని విమర్శించుట వారిదుష్ట లక్షణమునకు నిదర్శనము.

ఈనాడుగూడ ఆటల పోటీలలో రాజకీయ ఎలెక్షనులలో, ఓడినవారు గెల్చిన వారిని విమర్శించుట మనము చూచుచుంటిమి గదా! అట్టి విమర్శలే కౌరవులు కృష్ణునిపై జేసినవి. ఆధునికుల విమర్శలు వానిట్రూకాపీలేయని నకళ్ళు పాఠకులు గ్రహింతురుగాక. మొదట ఒక పద్ధతిలో నడచి, కౌరవుల యుద్ధములో మాత్రమే ఆతడు కపటోపాయములను పన్నినచో అట్టి వానిని విమర్శింప వచ్చును. కృష్ణునికి బాల్యము నుండియే శత్రువులతో పోరాడుట

కంసుని పుణ్యమా యని అలవాటైనది. బాలుడగు కృష్ణుడు మహా వీరులగు రాక్షసులను వారితో మంచిగా యున్నటులే నటించి వారి మాయలను మట్టుబెట్టెను. యుద్ధమునకు దిగకపూర్వమే న్యాయా న్యాయ విచక్షణ ధర్మాధర్మ పరిశీలన జరుపవలసినది. యుద్ధమునకు దిగిన పిదప ఉపాయమే శరణ్యము అపాయము అధిగమించుటకు, అని కృష్ణుని చర్య దెలుపును. కన్ను మిన్నుగానక ఎదిరి శక్తి నెరుంగక పెద్దలను తృణీకరించి సాధువులను హింసించువారు చివరకు నాశనమగుదురని తెలుపు చర్యలే నాస్తికులగు కౌరవులవి. తన భక్తుల రక్షించుటకు రాక్షసుల మాయలను మట్టు బెట్టుటకు కృష్ణు డప్పుడపుడు కపట నాటక మాడినాడని సాధు పుంగవులకు సహృదయులకు విదితమే, లోకక్షేమమునకై చేయు పాపకార్యము సయితము పుణ్యముగనే పరిగణింపబడు చుండుట లోకనైజము. ఒక ఘరానా దొంగను పోలీసువారు హతమార్చినపుడు ప్రజలందరు సంతసింతురు. ప్రభుత్వ మాపోలీసును బహూకరించును, అట్టివే కృష్ణు డొనర్చిన అక్రమములు అన్యాయములని గ్రహించవలయును. భీష్మ ద్రోణుల వధోపాయముల యుద్ధ ప్రారంభమునకు పూర్వమే కార్యసాధకుడగు ధర్మజుడు పోయి వారలకు నమస్కరించి తెలుసుకొనివచ్చెను. తదుపరి సమయ మాసన్నమైనపుడు కృష్ణుడు పాండవుల ప్రోత్సహించుట మాత్రమే జరిగెను.

కృష్ణుడు కపటియని దుర్యోధనుడు పలుమార్లు విమర్శిం చెను. తాను పాండవులయెడ అనేక కపటము లొనర్చియుండెను. అట్టి దుర్యోధనుడు యుద్ధములో గూడ కపట యుద్ధములు చేసి యుండియు శతృపక్షీయులు, తనపై కపట యుద్ధములు చేయుదు రేమో నను జాగ్రత్తలో నుండవలసిన యవసరమతనికి లేదా? వెఱ్ఱిమొగమువలె అధర్మ యుద్ధములు చేయవలదని శత్రువులను బ్రతిమలాడుట కర్ణునికిగాని దుర్యోధనునికిగాని తగునా? ఇది వీర లక్షణమా? అట్లు బ్రతిమలాడుటకు బదులు నిష్ఠురములు వల్లించు టకు మారుగ ఆచివరి క్షణములో నైనను కృష్ణుని వారు శరణు అని పల్కినచో వారు బ్రతికి యుండెడివారు. తమ పక్షము వారిని బ్రతికించి యుండెడి వారు. తాము గెలువలేమని తెలిసియు పోరా టము వీడని వారా రాజనీతిజ్ఞులు?

పాండవుల యక్రమములకు ప్రధాన కారకుడు కృష్ణుడు గనుకనే తాను యుద్ధము చివరలో కాలువిరిగి నేలబడినపుడు దుర్యోధనుడు "దీనికంతయు మూలకారకుడవీవే" యని కృష్ణుని నిందించును. పాండవులను పల్లెత్తు మాటనలేదు. ఇందును బట్టి దుర్యోధనుడే పాండవులను నిర్దోషులని తలంచియుండ మన మిప్పుడు పాండవులను విమర్శించుట వింతగా దోచుచున్నది. ఇట్లె బ్రతికి వున్నంతకాలము భీష్మద్రోణాదులను పాండవ పక్షపాతులని దుర్యోధనుడు నిందించెనేగాని చనిపోయిన పిదప వారిని విమర్శించ లేదు. మరియు వీరులగువారు గతించిరే యని దిగులొందెను గనుక

వీరిపై గల దుర్యోధనుని కోపము తన అక్కర దీర్చుకొనుటకు మాత్రమే గాని వారిలో దోషము లేమియు లేవని తెల్లమగు చున్నది. వారు పాండవపక్షపాతులు గాదు, నిష్పక్ష పాతులని గుర్తెరుంగ బట్టియే రారాజు భీష్మని ద్రోణుని సైన్యాధిపతులుగ నియమించెను. మరియు దుర్యోధనునకు పాండవులపై వ్యక్తిగత కోపమేమియును లేదు. తన రాజ్యకాంక్షయే యుద్ధమునకు ప్రధాన కారణము. ద్రోణుని సైన్యాధిపతిగా చేసినపుడు ఆయన రారాజును వరము గోరుకొమ్మనెను. నిజముగ పాండవులాతనికి శత్రువులే యగుచో అపుడాతడు భీమునిగాని అర్జునునిగాని చంపమని కోరి యుండవచ్చును. కానీ అతడట్లు గోరలేదు. ధర్మరాజును ప్రాణము లతో బట్టి తెమ్మని మాత్రమే గోరెను. ఆయనతో మరల జూద మాడి ఓడించి క్షేమముగా కాంక్షదీర రాజ్యమేలుకొన వచ్చునని ఆతడు వెలిబుచ్చెను. ఈ విషయమే పాండవులు ధర్మాత్ములు నిర్దోషులు, కౌరవు లవకాశవాదులు స్వార్ధపరులు మూర్ఖులు దయాదాక్షిణ్య రహితులని వెల్లడి చేయుచుండ మనమిపుడు తల నిలనుబెట్టి కాళ్ళు గగనము వైపుంచిన దచినటుల తలక్రిందు విమర్శ లకు బూనుకొనుట పిచ్చివాని పనిగా గన్పట్టుచున్నది.

అసలు కృష్ణుడు అక్రమములు చేయలేదు. కృష్ణునికి అక్రమ ములు అన్యాయములు చేయుటయన్న మిక్కిలి భయము. అపనిందలు భరించుటన్న అంతకన్న బాధ. అందుచేతనేగదా సత్రాజిత్తు యొక్క మణిని వెదకి జాంబవంతునితో పోరాడి తెచ్చి సత్రాజిత్తుకు

యిచ్చి తనపైగల యపనిందను బాపుకొనినది. అట్లు అపనిందలు భరింప నోర్వజాలని కృష్ణుడక్రమములు అన్యాయములు చేసెనని విమర్శకులన్నచో మనమెట్లు వినగలము?

భక్తుడు పండితుడు తన అభిమాన పక్షమునకు సంబంధించిన వాడైన ద్రోణుని పుత్రుడగు అశ్వత్థామ, నిద్రించు ఉప పాండవులను సంహరించి నందులకు గోపించిన కృష్ణుడు నిర్దాక్షిణ్యముగ ఆతనిని మూడు వేలేండ్లు అన్న వస్త్ర విహీనుడై శరీర దుర్గంధ భూయిష్ఠముతో బ్రతుకునట్లు శపించెను. బంధు ముఖ్యుడుఅగు అభిమన్యుని మరణమున నోరుమెదల్పని కృష్ణుడు అశ్వత్థామను శపించెను. ఈ విషయమును పరిశీలించినచో కృష్ణుడు వర్గపక్షపాతి గాదు. నిష్పక్షపాతి యని నిరూపితము కాగలదు. ఈయన బీదలపాలిటి పెన్నిధి యని చెప్పుటకు కుచేలుడు కుబేరుడగుటయే నిదర్శనము. అధికార గర్వమావంతయు లేదనుటకీతడు పార్థునికి సారథిగ కుదురుటయే సాక్ష్యము. ఈయన స్త్రీలోలుడు గాదనుటకు ద్రౌపదీ స్వయంవరములో మత్స్య యంత్రమును గొట్టుట తనకు తెలిసియుండియు యత్నించకుండు టయేసాక్ష్యము. ఈయనపై విమర్శలు అర్థరహితములని నిరూపించుట కిట్టి యుపమానముల నెన్నింటినో చూపవచ్చును.

కవిత్వములు రెండు రకములు. యదార్థములు, కల్పితములు. యదార్థములు లోక కల్యాణార్థములు, కల్పితములు తాత్కాలిక మనోరంజకములు. లోకకళ్యాణార్థమై వ్రాయు

కవులకు ప్రభువులు ప్రాధేయపడుదురు. కల్పితముల కవులు ప్రభువుల ప్రాపుకు ప్రయత్నించెదరు. అనగా పోతన్నవంటి నిస్వార్థులు కొందరు శ్రీనాధునివంటి స్వార్థపరులు మరికొందరు వ్యాసవాల్మీకుల రచనలు లోకకళ్యాణార్థమై రచింపబడిననవి. అట్టి విషయములు వినవలసినవే గాని విమర్శింపదగినవి గావు. పురాణములను విడదీసి విమర్శింప బూనుట తమ కొంపను పగులగొట్టి పరిశీలించి నట్లగును. కొంప పోయిన జనులు దేశద్రిమ్మరులైనట్లు పురాణములను, పోగొట్టు కొనినచో మతములేని మనుజులమై సంస్కృతి లేని సన్యాసులమై దిక్కులేని దీనులమై దారితెలియని దరిద్రులమై చెట్టునకొకరు గుట్టకొకరుజేరి పశువులవలె పక్షులవలె పరాయివారి అధీనములో బ్రతుకవలసినగతి పట్టుననుటలో అనుమానమనవసరము. గృహస్థునివంటివాడు ఆస్తికుడు. దేశద్రిమ్మరివంటి వాడు నాస్తికుడు.

పురాణ పురుషుడు శ్రీకృష్ణుడు తన ప్రథమ భక్తురాలిగా గుర్తించి రక్షించిన పాండవుల పట్టంపురాణి ద్రౌపదిని కులట యని విమర్శకులు విమర్శించుచున్నారు. ఇట్టి విమర్శలనే కువిమర్శలందురు, వీరికంటికి మంచిగాన్పింపదు. చెడ్డయే ప్రత్యక్షమగుచుండును. ఉత్తమ పరిశీలించిన గావించినచో హిందూ పురాణములవంటి ఉత్తమ గ్రంధములు లోకములో లేవని విదితమగును, ఒక పట్టణమును గాంచినపుడు. అందలి విశాల వీధులు అందమగు అంగళ్ళు నాగరికుల నాణ్యమగు వేషభాషలు చిత్ర విచిత్ర శిల్పములుగల భవనములు జూచియానందించుట సహ

జము. అట్లుగాక మురికిచెత్తగల మునిసిపాల్టీల తొట్లు మల మూత్రములు నిసర్జించు పాయఖానాలు జూదగృహములు త్రాగుబోతుల పానశాలలు వ్యభిచారపు విహార కేంద్రములా గాంచవలసినవి? ఇట్లున్నదనిపించును, నేటి విమర్శకుల పరిశీలన మత గ్రంధములయందు.

ద్రౌపది కులటయా ?

ఈమె కయిదుగురు భర్తలయినందున కౌరవులీమెను కర్ణుని ప్రోత్సాహమున కులటయని గేలిగావించిరి. విమర్శకులకీమాటలు మంచి పట్టుగొమ్మలయినవి, ద్రౌపది కారణజన్మురాలు. ఈమె వివాహము రాచబాటలో జరిగినదే గాని దొంగచాటుగ జరుగలేదు. తల్లి మాట జవదాటని పాండవుల తల్లియగు కుంతి సమ్మతితో భారతకథకే భారత వీరులకే మూలపురుషుడగు వేదవ్యాసుని సలహాపై భగవత్స్వరూపులగు కృష్ణబలరాముల యాశీర్వాదముతో ద్రౌపదికి తల్లిదండ్రుల అధ్వర్యమున ధర్మపద్ధతిని పాండవులతో వైభవముగ వివాహము జరిగినది. ఇట్టి వివాహమును గురించి విమర్శించుట వివేకమనిపించునా?

అయితే యిట్టి వివాహములానాడు జనసామాన్యములో మాత్రము ఆచరణమందు గానరావు. ఒకవేళ రాజవంశములలో యిట్టి పద్ధతి కలదందుమా! అదియును సరిగాదు, పాండవులవలె కౌరవులకుగూడ ద్రౌపదివంటి భార్య యొకతే యుండవలయును

గదా! పాండవులతో అన్నింటిలో పోటీపడిన కౌరవులిట్టి వివాహములో పోటీపడలేకపోయినారు. గనుక ఈపద్ధతి రాజవంశములందు గూడ అరుదుగనే యున్నది. ఒక భార్యను భర్తలనేకులు పొందుట లోకవిరుద్ధమని కుంతియే చింతించినది. పాండవుల కితర భార్యలు గలరు. వారికి వీరులగు పుత్రులు పుట్టిరి. కాని భారత గాథకు కారణభూతురాలగు పౌరుషవంతురాలగు నీమెకు ఊరు పేరులేని పుత్రులు ఉపపాండవులు పుట్టుట విచిత్రము. ధర్మరాజు భార్యలు దేవిక, పౌరవతి. కొడుకులు యుధేయుడు, దేవకుడు. భీముని భార్యలు జలంధర, కాళి, కొడుకులు సర్వగుడు సర్వగతుకు. మరియు హిడింబి ఆమెకొడుకు ఘటోత్కచుడు గలరు.

అర్జునుని భార్యలు ఉలూచి, చిత్రాంగద, సుభద్ర. కొడుకులు ఇరావంతుడు, బభ్రువాహనుడు, అభిమన్యుడు. నకులుని భార్య రేణుమతి. కుమారుడు నిరమిత్రుడు. సహదేవుని భార్య విజయ, కొడుకు సుహోత్రుడు. కులటయని యామెను భర్తలు నిర్లక్ష్యముగ జూడలేదు. ఆమెను ఒక వేల్పుగ ఆరాధించిరి,

కష్టసుఖములలో సమానముగ భర్తలతో పాలు పంచుకొనినదే భార్య అనునీతి యామె యందు మాత్రమే గోచరము. అరణ్యవాసమందు భర్తల ననుసరించినదీ పతివ్రత, మిగత భార్యలు మాత్రము పుట్టినిండ్ల కేగిరి. ఇట్లు భర్తలతో నన్యోన్యముగ బ్రతికిన ధర్మపత్నిని కులటయని సంబోధించుట యొరుల మంచిని గాంచి యోర్వలేనివారి విమర్శ దప్ప అన్యము గాదనిపించును.

ఆమె నిజముగ కులటఅయి యుండినచో సైంధవునితో సరసమాడి యుండునేగాని దుఃఖించ నవసరము లేదు. కీచకుని కోరిక దీర్చి ఆనందముగ అజ్ఞాతవాసము గడిపి యుండునే గాని విరాట రాజ సభలో ఏడువవలసిన యవసరము గావరాదు. దుర్యోధనునకే వెసరు బెట్టి మాయతో మట్టుబెట్టి భారత యుద్ధమునే జరుగకుండ చేసి యుండవచ్చును. లేదా కర్ణుని కరము బట్టి బెట్టుసరిగా కౌర వుల కాలరాచి పాండవులకు యిక్కట్టులు లేకుండజేసి యుండ వచ్చును.

ఇట్టి నీచకార్యముల కామె పాల్పడజాలదు. అగ్నిలో పుట్టినది. పాండవుల చేపట్టినది. పౌరుషముగ బ్రతికినది. బాధల భరించినది. భక్తితో భర్తల సేవించినది. పగతుర నాశముతో శాంతించినది. పుత్రశోకము భరించినది. కులట యగుచో రాజ సూయమున ఆమెకు అవభృథస్నానమాడు అదృష్టము లభించునా? వేలాది జనులు వందలాది రాజులుగల నిండు సభలో ఆమెకట్టి గౌరవము లభించినదనగా ఆమె విలువ వర్ణనాతీతము. ఆమె యొకస్త్రీ రత్నము. యోనిజులతో పోల్చి అయోనిజను విమర్శిం చుట విడ్డూరము. అయోనిజులకు సంగమదోషము యోనిజులకు వలెలేదు. యుద్ధానంతరం ధర్మరాజుల పట్టాభిషేకోత్సవమున పాండవుల ప్రక్కవ ద్రౌపదికే స్థానము లభించినదిగాని మిగత భార్యలకు లేదుగదా? ద్రౌపదీ మాన సంరక్షణానంతరమామెను ధృతరాష్ట్రి డోదార్చుచు "మాకోడండ్రలో నీవు తలమానికమవని

పొగడెను. అక్షయపాత్రకు ఆమె చేయి తగిలిననేగాని అందుండి ఆహార పదార్థములు బయల్పడవు. నిరతము అరణ్యములో సహిత మామె అనేకవేల జనులకు విందులు చేయుచుండెను. అందరు భోజనము చేసిన పిదప మాత్రమే ఆమె భుజించును. ఇట్టి పుణ్యాత్మురాలను కులటయని యనుటకు నోరాడు టెట్లు? దుశ్శాసనుడు తనకొప్పును ముట్టినది మొదలు ఆతడు చచ్చువరకు ముడివేయనని శపథమొనర్చి కులటలవలె అందమునకు అలంకారములకు అపేక్షించని మహోత్తమ ఇల్లాలామె.

సీతమూలమున రావణుడు నాశనమయ్యెను. ద్రోవది కారణమున కౌరవులు నశించిరి. ఇట్టి మహిమగల మహిళారత్నములను మనము విమర్శించుట కర్హులమేనా యని ఒకమారు లోజూపు జూచుకొనిన మననోళ్ళు మూతలుపడును. ద్రౌపది పతిభక్తికి అత్త ఆశ్చర్యపడినది. సత్యభామ విస్తుపోయినది, శ్రీకృష్ణుడామెను స్వంత సోదరి సుభద్ర కన్నను మిన్నగ జూచుకొనెను. రాజసూయ యాగము వరకామెనెవ్వరును కులటయని పిలువలేదు. యాగానంతరము పాండవుల విలువ హెచ్చినపిదప మాత్రమే కర్ణాదులామెను కులటయని విమర్శించుట ప్రారంభమైనది.

జూదమాడుటకు పాండవులు హస్తిపురికి జేరినపుడు వారి వెంటనున్న ద్రోవదిని గాంచిన కౌరవ పత్నులామె గొప్పదనమును గూర్చి మిక్కిలి కొనియాడిరి, శత్రువుల భార్యలే ఆమెనట్లు గొనియాడగా పరులామెను విమర్శించుట వివేకమనిపించునా?

కర్ణుని గాంచినపుడామెకాయనపై ప్రేమగలుగుచుండునని యొకప్పుడు కృష్ణునితో ద్రౌపది చెప్పినట్లు లోకప్రచారమున గలదు. కర్ణుడుగూడ కుంతికి జనించిన వాడే గావున ద్రౌపది కాయనపై ప్రేమ పుట్టుచుండునని చెప్పుట యొప్పిదముగనే గన్పట్టును. కానీ యదార్థముగ నామెకాతనిపై ప్రేమలేదు. కర్ణుడు కుంతీపుత్రుడని యామెకు తెలియదు. పాండవు లరణ్యముల కేగినపుడా వార్త దెలిసి వారి నోదార్చుటకై వచ్చిన కృష్ణునితో ద్రౌపది యిట్లనను. "కృష్ణా! కౌరవులు కొలువులో నన్నవమానము గావించినపుడు కర్ణుడు జూచినవ్వెను. నన్ను ఆరవ భర్తగా దుర్యోధనుని గట్టుకొమ్మని పలికెను. బంధకియని నన్ను నిందించెను, అట్టి అవమానపు మాటలచే నాలో పుట్టిన కోపాగ్ని నన్ను దహించుచున్నది. నాకోపాగ్ని చల్లారుటెన్నడోయని" ద్రౌపది అన్నతో చెప్పుకొని దుఃఖించును. ఈ మాటలను గమనించిన ద్రౌపదికి కర్ణునిపై ప్రేమలేదని విశదముగా తెలియుచున్నది గదా! ఆమె కర్ణుని చావేగోరినది.

ద్రౌపదికి పాండవులు మానసంరక్షణము చేయవలసిన అగత్యములేదు. ఆమె కామెయే రక్షించుకొనగలదని ధర్మరాజుకు మున్నే దెలియును, కానీ పురుషుల బాధ్యతను ఆమె సభలో వెల్లడించినది. దిక్కులేని వారికి దేవుడే దిక్కని ఋజువు జేసినది. అంత మాత్రమేగాని అయోనిజులను యోనిజులు రక్షించుటేమిటి? ఆమె అయోనిజ, పాండవులు యోనిజులు గదా! ధృష్టద్యుమ్నునకు అగ్ని

ఇచ్చిన సహజకవచకుండలములవలె అగ్నిదేవుడిచ్చిన వస్త్రము ఆమె శరీరమున గలదను సంగతి ధర్మరాజునకు తెలుసును. ఆమెశక్తి స్వరూపిణియను సంగతి భీముడెరుంగును. భీమునకా సంగతి కృష్ణుడు తెలిపెను, కౌరవుల దుశ్చేష్టలు బయలు కావలయునను తలంపుతో పాండవులు శాంతముగ నుండిరేగాని భార్యను రక్షించుకొనలేక గాదు. ఈమె జీవితమే విచిత్రమైనది. లోకములో పోల్చుట కిట్టి మరొక స్త్రీ లేదాయె, సముద్రమునకు సముద్రమేసాటి. సూర్యునికి సూర్యుడేసాటి యన్నట్లు ఆమెకామెయే సాటి. అగ్నిలో జన్మించినది. అర్జునునిచే వరింపబడినది. భీమునిచే మిక్కిలి ప్రేమింపబడినది. ధర్మజునిచే బాధలకు గురిఅయినది. అయిదుగురకు నియమ ప్రకార మన్యోన్యముగ సేవ యొనర్చినది. అన్యథా శరణం నాస్తియని కృష్ణుని యాశ్రయించినది. పుట్టినింటికి మెట్టినింటికి పేరుదెచ్చినది. అత్తలచే సవతులచే నుతులు గొనినది. ఇట్టి యామెను విమర్శించుట ఆకాశముపై యుమియుటవంటిదే. పాండవు లయిదుగురయినను వారందరు ఇంద్రునిలోని వేర్వేరు శక్తులనుండి శివుని మహిమచే పుట్టినవారని భారతము తెలుపుచున్నది. ద్రౌపది పాండవుల పూర్వజన్మల వివరములను వ్యాసుడు ద్రుపదునకు దివ్యదృష్టిని జూపిన పిదపనే వివాహము జరిగెను. ఆ ఇంద్రుని శక్తులే యమ అనిల ఇంద్ర అశ్వనీదేవతల ద్వారా. పాండవులుగ జననమొందెను. అయిదుగురు భర్తలతో కృష్ణ కాపురమొనర్చెను గదా యని మనము గూడ అట్లు ప్రయత్నించిన యెడల మన భర్తలు సుందోప సుందులవలె పోరాడి చత్తురను

సంగతి మరువరాదు. అంతియే గాక పలువుర ప్రేమించిన స్త్రీకి శూర్పణఖకు పట్టిన గతియే పట్టునని గూడ మనము మరచిపోరాదు.

ఈ విమర్శకుల దృష్టిలో కుంతిగూడ కులటయే అత్తకు దగిన కోడలు కోడలుకు దగిన యత్త, అని విమర్శకులు వినోదింతురు. గ్రంధములో, కవి రూపము గాంచవచ్చునందురు. అనగా కవి భావములు గ్రంధములో గన్పించుననిచెప్పుట. అటులే విమర్శకుల అనుభవములబట్టియే వారి వారి విమర్శ ప్రదర్శితమగు చుండును గదా ! ఇందుకొక యుదాహరణము పరిశీలింతము. ఒక చోట హరికధ జరుగుచున్నదనుకొందము. అచట శ్రోతలనేకులుందురు. వారిలో భక్తులు, బాలురు వృద్ధులు యువకులు విటులు విమర్శకులు గృహస్తులు సన్యాసులు వ్యాపారులు ఉద్యోగులు భాగ్యవంతులు బీదవాండ్రు గాయకులు కవులు పండితులు పామరులు దానపరులు జేబుదొంగలు రంకుబోతులు రౌడీలు త్రాగుబోతులు జూదగాండ్రు ఉపకారులు అపకారులు ఏడ్చువారు ఏడ్పించువారు ఆస్తికులు నాస్తికులు మతబోధకులు విజ్ఞాశాస్త్రవేత్తలు స్త్రీలు పురుషులు అత్తలు కోడండ్లు యిట్లనేక రకముల ప్రజ సభలో అగనుండును. ఇందులో ఉత్తములు మొత్తము మీద భక్తితో కధ వ నాలకించి భగవంతునికి నమస్కరించి భాగవతుని సన్మానించి పోవుదురు. రెండవజాతి వారట్లు గాక వేరు వేరు విధముల వారి వారి భావనలకు దగినట్లు పరిశీలించుచు పకపక వెకిలిగ నవ్వుచు కధకుని గేలిచేయుచు వింతగ విమర్శించుచుందురు. కధకు డందరికి

అనుకూలముగ నడచుకొనుట దుర్లభముగదా! అందుచే కథకుడు తన పాటికి తాను భక్తితో కథను చెప్పుకొని వెళ్ళుట ఆయన ధర్మము. పురాణములపై విమర్శలు గూడ యిల్లే పరిపరి విధముల నుండును. ఆ విమర్శలను గాంచి భక్తులు బాధపడరాదు. వారి భావములు మార్చుకొనరాదు. భక్తి అనునది తన ముక్తి కొరకే గాని పరుల మెప్పుకొరకు మాత్రము గాదని ప్రతిమానవు డెరుంగదగు విషయము.

లోకములో సంసారులగు మానవులకు ఆచారములు అల వాట్లు సిగ్గులు బిడియములు సంఘములు సంస్కారణములు అవసరము. మానవాతీతులగు సన్యసించిన ఋషితుల్యులకిట్టి కట్టు బాట్లనవసరము. అట్టి మానవతీత ద్రౌపది. ఆమెకీలోకముతో నిమిత్తములేదు. అమె జీవితములో జరిగిన అద్భుత ఘట్టములను చక్కగ పరికించిన ఆమెయొక మహాభక్తురాలు. అపరశక్తి స్వరూపిణి.లక్ష్మిఅంశ సంభూతురాలు అని తెలియును. అట్టి పాత్రను విమర్శించుటకు మనము పాత్రులమా? ఇట్లువిమర్శించి యదార్థమును దెలియుటకు మనకీ జన్మలోని ఆయుఃప్రమాణము చాలదు. గనుక నమ్ముటయే కర్తవ్యము. అట్లు విమర్శించినందున పురాణ పాత్రలకొచ్చు నష్టమేమియును యుండదు. నష్టపోవునది మనమేనని గుర్తించుట మంచిది.

కుంతి పతివ్రత కాదా ?

కుంతి కన్నెప్రాయమున అక్రమ సంతానమును కనెను. బిడ్డను నదిలో పారవేసెను. యమ అనిల ఇంద్రులతో గలిసి పుత్రుల గనెను. కర్ణ జననమును దాచెను, ఇవి ఈమెపై గల విమర్శలు.

ఈమెను మనము విమర్శించుచున్నామే గాని ఆమె బంధువులుగాని పెద్దలుగాని విమర్శించి యుండలేదు. చివరకు కొడుకైన కర్ణుడుగూడ యీమెను వ్యభిచారిణిగ విమర్శించ లేదు. తన జన్మమును రహస్యముగా దాచినందులకు తాను సూతునింట పెరుగవలసి వచ్చినందులకు మాత్రమే విమర్శించినాడు. వ్యభిచారమనునది ఈనాడేగాదు ఆనాడుగూడ అపచారముగనే పరిగణింప బడినది. అందువలననేగదా కుంతి సూర్యునితో నన్నుముట్టవద్దు నాకు నింద తేవలదని బ్రతిమలాడుకొనినది. కానీ "నీ కన్యాత్వమునకు భంగము రాదు'' అని సూర్యుడు వరమిచ్చెను. అనగా మానవులు మానవులతో కలిసినచో నేరమగును, మానవులు దేవతలతో గలిసిన నేరము గాదని తెలియుచున్నది. గనుక యిపుడు మనము గ్రహింపవలసినది. మానవుల సంగమము తీరునకు దేవతల సంభోగ రీతికి వ్యత్యాసముగలదని గమనించుట, పశుజాతి పక్షిజాతి క్రిమికీటకాదుల కలయికలు పలురీతులని మనమెరింగినదే. అట్లు పరిశీలించినచో జరా మరణములులేని ఆకలి దప్పులు లేని నిద్రాహారములు లేని దేవతల

సంభోగము మానవులతో మానసికమైనదే గాని శారీరకమైనది గాదని తలంప వలయును. శుక్తిమతి యను నదిని కోలాహలమను పర్వతము కలియగా గిరిక యను కన్యపుట్టినది. వసువదాను రాజు యొక్క ఇంద్రియమును చేప మింగెను. దానినుండి మత్స్య గంధి పుట్టెను, విభాండకుడను ముని వీర్యమును మ్రింగిన జింకకు ఋష్యశృంగుడు పుట్టెను ఇట్లు జననతీరులు సంభోగరీతులు వేర్వేరు విధములుగ నున్నవి గనుక కుంతి సూర్యునితో గలియుట మానసికమైనదే. అనగా మనలో స్థూలశరీరములు సూక్ష్మశరీరములు గలవు. అట్టి సూక్ష్మశరీరముల కలయిక అయియుండునేగాని స్థూల శరీరపు కలయిక మాత్రముగాదని మనము యూహించవల యును. ఒకవేళ సూర్యుడు శరీరముతో ఆమెకు చిక్కినచో ఆమె యదృష్టము పండినట్లేగదా! ఈ రోజులలో కన్యలవెంట బడిన పురుషులను పట్టి బంధించి పెండ్లిండ్లు జరిపించుట మనము జూచుచున్నదేగదా! ఆమెకు సూర్యుని మించిన భర్త భూలోకమున దొరకునా? గనుక ఆమె భయపడవలసిన పనిలేదు. సామాన్యు లకు దొరకని సూర్యుడామెకు దొరకినాడు ఆతనిని బాహువుల బంధించి కేకలువేసినచో ఇరుగు పొరుగు వారొచ్చి దివ్యముగా పెండ్లిగావించి యుండెడివారు. సూర్యుడే దివినుండి భువికి దిగి వచ్చిన ప్రేమించని వనితలుందురా యీనాడు మాత్రము? గనుక సూర్యుని మానవునిగ జమకట్టి మనము విమర్శించుటకు విలు లేదు. సూర్యుడు కుంతితో గలిసెను. తోడనే బిడ్డపుట్టెను. వెంటనే నదిలో గొట్టుక వచ్చిన పెట్టెలో బిడ్డను విడచెను. అంతియేగాని

కుంతి గర్భము ధరించుట నవమోసములు మోయుట చెలికత్తెలతో నదికేగుట బిడ్డను నదిలో విడచుట యనుకథ కల్పితము. అసంగతము ఒకవేళ అట్టికథ నిజమగుచో కుంతి గర్భము అంతఃపురమున రహస్యముగా దాచుట అసంభవము. శరీరమార్పులు ప్రసవ వేదనలు మొదలైనవి రహస్యమును బట్టబయలు సేయక మానవుగదా!

మనకు బిడ్డలు లేనిచో దేవుళ్ళకు మ్రొక్కుదుము. తదుపరి పుట్టిన బిడ్డలకు ఆ దేవుళ్ళ పేర్లు పెట్టుచుందుము. అటులే కుంతీ మాద్రులు మంత్రములు భక్తితో పఠించిరి, దేవతలు కరుణించిరి. పుత్రులగనిరి. అయితే ఆ కాలమున వారికి దేవుళ్ళు ప్రత్యక్షమైరి. మనకీకాలమున కలలోకన్పించుచుండిరి. ఈ భావనలేని విమర్శకులు కుంతీమాద్రులు వ్యభిచరించినటుల జమకట్టెదరు. దేవతలతో గలియుటకు పాండురాజామోదించెనే గాని సాటి మానవులతో గాదను విషయము మనము గమనించవలయును. పురాణములందు వ్యభిచారముగ గన్పట్టు చరిత్రలన్నియు నిట్టివేయని గుర్తించవలయును.

"ఇన్నాళ్ళుగా నీవు నాకు తల్లివని యేల చెప్పక దాచితివని కర్ణుడు కుంతితో నిష్ఠుర మాడుటను ఆస్కారముగ గైకొని విమర్శకులు కుంతిని దూషించెదరు. కానీ తాను కుంతి కొడుకునను సంగతి సూర్యుని ద్వారా నెరింగిన పిదప కర్ణుడేల ఆ విషయమును

మనస్సునదాచుకొని యుండెను ? కుంతి తనను పలుకరించువరకు తానా సంగతి యేల కుంతితో అనలేదు. సిగ్గా ? లేక బిడియమా ? కర్ణుడు పసిబాలుడా ? "జీవితమంతా ముగిసినది. ఇపుడు నేను పాండవులవైపు రానగలిగిన కర్ణుడు కుంతి పొరబాటొనరించినచో ఆమెను తానే ముందుగా పలుకరించి నిందించ వచ్చునుగదా ? పాండవులను ద్రౌపదిని యిష్టమొచ్చినట్లు నిందించ గలిగిన కర్ణుడు కుంతితో పలుకుటకు జంకెనా ? కర్ణుడెట్లామెతో ముందుగా మాట్లాడుటకు జంకెనో ఆమెయు అట్లే కర్ణుని పలుకరించుటకు జంకినదని మనము తలంచవలయును. స్త్రీకి జంకుట సహజము. పురుషునకంత జంకుండదు. గనుక ఈ రహస్యమును దాచుటలో కుంతి తప్పిద మిసుమంతయును లేదని చెప్పవలయును. తప్పిద మంతయు కర్ణునిదే అయియున్నది. కృష్ణుడు చెప్పిన పిదప కుంతి కర్ణుని పలుకరించినదేగాని అంతకు పూర్వము పలుకరింపనామె సాహసించలేకపోయినది.

మరియు కర్ణుని పాండవులవైపు త్రిప్పుకొనుటకామె ఆసించిన దనుటయు అర్ధ రహితము. అట్లగుచో అరణ్యవాస కాలమున ఆమె హస్తినాపురిలో నున్న సమయమున ఎప్పుడో కర్ణునితో మాట్లాడి పాండవులవైపు త్రిప్పుకొనుటకు ప్రయత్నించి యుండెడిదిగదా ! అట్లు చేయలేదు గనుక కుంతి నిస్వార్థపరురాలని గ్రహింపవలయును. ఒకవేళ ముందుగా కుంతియే కర్ణునితో జన్మ రహస్యమును వెల్లడించినను కర్ణుడొనరించు ఘనకార్యమేమియును

లేదు. కుంతి వెల్లడించిన తదుపరి కర్ణుడు సోదర పక్షము వహించెనా? లేదు గనుక కర్ణుడు కుంతిని నిష్ఠురమాడుటలో అర్థములేదు. అంతియేగాక కర్ణుని జనన రహస్యము వ్యాసునకు దెలుసును, ఆయన భీష్మునకు చెప్పియుండెను. కానీ వారు గూడా ఆ రహస్యమును దాచియే యుంచిరి. గనుక రాజకీయములలో కొన్ని కొన్ని విషయములు రహస్యముగనుంచి తగిన సమయము లందే బయలు సేయదగునని దెలియుచున్నది, అనగా ఇట్టి సంఘటనలు రాజకుటుంబములలోనే జరుగుచుండును గాని సామాన్యులలో గాదని గమనించవలయును. సామాన్యుల దృష్టిలో నుంచుకొని రాజుల చరిత్రలను విమర్శించుట సక్రమము గాదని విశదమగుచున్నది.

రాజకుటుంబములలో అట్లు రహస్యముగ నుండదగు విషయములు సమయాసమయము లెరుంగక బట్టబయలు చేసినచో మంచిచెడుగుగామారుట యు జరుగవచ్చును. అందుచే అట్లు సంభవించు మార్పులవలన కలుగు కష్ట నష్టములు రాజవంశీయులకేగాక ప్రజలకు గూడ సంప్రాప్తమగుచుండును. అందుచే అట్టి రహస్యములను తగిన సమయములందే విజ్ఞులు వెల్లడి చేయుచుందురు. కర్ణుని జన్మరహస్యమును వ్యాసుడు తనకింతకు పూర్వమే చెప్పియున్నటుల భీష్ముడు అంపశయ్యపై యున్నపుడు కర్ణుడాయనను చూడబోగా భీష్ముడు చెప్పెను. అయితే యీ రహస్యమును భీష్ముడెందులకు దాచినట్లు? తనకీ రహస్యమును వెల్లడించిన

వ్యాసుని యనుమతి లేదాయె. ఒకవేళ వెల్లడించినను ఫలితము శూన్యమను సంగతి భీష్మునకు దెలుసును. కర్ణదుర్యోధనుల స్నేహమంత గాఢమైనది. అంతియేగాక వారిరువును భీష్మద్రోణాదుల హితవులను తిరస్కరించు వారని సర్వులకు విదితమే. వారి నోటవచ్చు యదార్థములు కర్ణాదుల చెవులకు అబద్ధములుగనే గోచరించు చుండెను. కుంతి ఉత్తమ యిల్లాలని చెప్పుటకనేక యుదాహరణములు గలవు. వ్యాసుని సలహాలపై ఇంద్రలోకము నుండి అర్జునుడు రప్పించిన ఐరావతమును పూజించి వ్రతమాచరించెను. గాంధారి అట్లు చేయజాలక మట్టిఏనుగును మాత్రమే పూజించగలిగెను. దూర్వాసుడిచ్చిన మంత్ర ప్రభావమున దేవతల నారాధించి పుత్రుల బడెసెను, ఇచ్చట గమనించదగినదేమనగా మంత్రములు దేవతల దయగలుగుటకై పఠించ బడునే గాని మానవుల యభిమానము పొందుటకు గాదనుట. మానవులు స్త్రీల వద్దకు జేరుటకు మంత్రములతో నిమిత్తములేదు. మాయలే చాలును. దేవతల కలయికలు గనుకనే వారనుకొన్న ప్రకారమే పుత్రులుదయించిరి. మానవుల కలయికలట్లు జరుగవనుట లోకవిదితము. పాండురోగి యగు పాండురాజును భక్తితో సేవించిన కుంతీమాద్రులుత్తమ పతివ్రతామణులనుటలో అతిశయోక్తి లేదు. కుంతి పుణ్యవతి గానిచో భీమార్జునులవంటి వీరులామెకు పుత్రులగుదురా? వీరిద్దరి వలననేగదా కౌరవులకు క్రౌర్యమెక్క కురుక్షేత్రమున కదం త్రొక్కినది.

భీముని యుద్ధము యక్రమమా?

మత్స్యయంత్రమును గొట్టకనే ద్రౌపదిచే మిక్కిలి ప్రేమింపబడిన యదృష్టశాలి. ఈయన కృష్ణుని ప్రేమ మిక్కుటముగ చూరగొనిన నిష్కపటుడు.

ఈయనకు గల విమర్శ ఒక్కటే. దుర్యోధనుని తొడలు అధర్మముగ విరుగ గొట్టెనట. ఇందీతని తప్పిసుమంతయునూ లేదని ఆనాడే కోపించిన బలరామునితో కృష్ణుడు వాదించెను. బాధ నొందువారిపై సానుభూతి గలుగుట మానసిక సహజలక్షణము. మరియు బలరాముని లాంటి నిష్కపటులకట్టి సమయములో సానుభూతి జనించి నేరస్తునిపై కోపోద్రేకము గలుగుట సులభము. తొడలు విరిగి నేలబడిన దుర్యోధనుని జూచునరికి బలరామునికి భీమునిపై తాత్కాలికోద్రేకము కలిగినది. అంతియేగాని వారి తగాదకు గల గత చరిత్ర ఆయన మనసునకు రాలేదు. అట్లు మన స్సున కొచ్చుటకు కోపమను భూతమావేశించి అడ్డుగ యున్నది.

జరాసంధుని వధయందు కృష్ణుని సలహాను గైకొని నట్లే యిప్పుడు గూడ భీముడు కృష్ణుని సలహా గైకొనియే దుర్యోధనుని తొడలు విరుగ గొట్టెను గనుక యిందు ప్రత్యేకముగ భీముడొన రించిన అక్రమము లేదని విశదముగ దెలియుచున్నది. అది చావు బ్రతుకుల సమయము. కౌరవులను బాల్యమున బాధించిన విరోధి

భీముడు. యుద్ధములో సుయోధనుని సోదరుల ననేకుల హత మార్చినవాడు. అట్టిశత్రువు దుర్యోధనునకిప్పుడొంటరిగ చిక్కెను. అది చివరి అవకాశము. అందుచేతనే కసి దీరసుయోధనుడు భీముని చావుదెబ్బలు గొట్టుచుండెను. బాల్యమున సుయోధనుడు మోసముచే భీముని చంప యత్నించి విఫలుడయ్యెను. దుర్యోధనుని దెబ్బలకు బాధనొందుచున్న భీముడావేళములో ఆక్రోశములో ఆవేదనలో బడి రొప్పుచు రోయుచూ చిత్తశాంతిలేక కృష్ణుడు గుర్తు చేయగా ఎగిరెగిరి యుద్ధము గావించు దుర్యోధనుని తొడలు భీముడు గదతో మోది విరుగగొట్టెను. భీముని ప్రతిజ్ఞను మరచి నిర్భీతిగ పైకెగిరి యుద్ధమొనర్చుట కౌరవాగ్రజుని యవివేకమని శుభ్రముగ దెలియుచున్నదిగదా! అసలు భీముని సుయోధనుడు జంపగలడను కొనుట కల్ల. అది జరుగనిపని బకాసుర హిడింబాసుర కిమ్మీర కీచకులకన్నా ఘనుడా దుర్యోధనుడు? వారిని వధించగలిగిన భీముడీతనిని జంపజాలడా? వారిని వధించునపుడు భీమునికి కృష్ణుడు సాయమొనర్చెనా? అట్టి బలశాలిని దుర్యోధను డోడించ గలడనుట వట్టి భ్రాంతి. తనవారందరు బ్రతికియుండగనే చంపలేని రారాజిప్పుడు భీముని చంపగలుటయా?

అడవిలో హనుమంతుడు భీముని వరము కోరుకొమ్మనెను. కోరినచో కౌరవుల జంపెదననెను. కానీ అట్టి కోరికను భీముడు గోరలేదు. ఇదిభీముని విరత్వమునకు ధర్మమార్గమునకు నిదర్శనము. అశ్వత్థామ గూడ బలరాముని వలెనె దుర్యోధనుని గాంచి తాత్కా

లికోద్రేకుడై దుర్యోధనునిపై కలిగిన సానుభూతిచే ఆవేశపరుడై గత చరిత్రను విస్మరించి రారాజును తృప్తిపరచుటకై నిద్రించు ఉపపాండవుల అక్రమముగ వధించివచ్చెను. అంతకు పూర్వము కౌరవుల చర్యలక్రమములు పాండవులు ధర్మాత్ములని వాదించు చుండిన అశ్వత్థామ చివరకు కౌరవ పక్షము వహించుట పాండవుల కపకారము సేయుటవింతగా యున్నదిగదా? దానికి తగిన ఫలితముగా అతడు శ్రీకృష్ణునిచే ఘోరమగు శాపమును బొందెను. నిలుపు నిదానము సహనము శాంతగలిగి ముందు వెనుక లాలోచించని వారిచర్యలిట్లే అస్తవ్యస్తములుగా నుండును. తన చర్య అక్రమ మని తెలిసియే అశ్వత్థామ పాపపరిహారార్థము తపస్సు చేయుట కేగెనుగదా! నిష్కపటులందరు యిటులే ఉద్రేకము చెందుట చేయరాని పనులు సేయుట పిదప పశ్చాత్తాపపడుట సహజముగా చేయుచుందురు. మడుగులో నుండి బయటికి వచ్చిన పిదప మాలో ఎవరితో పోరాడెదనో కోరుకొమ్మని ధర్మజుడడుగగా దుర్యోధనుడు భీముని గోరెను. ఈ సందర్భమున కొందరు కౌరవాగ్రజుని వీరత్వమును కొనియాడెదరు. అసలు కారణమది గాదు. బాల్యమున కౌరవులను ముఖ్యముగా బాధించిన వాడు భీముడు అందులకై అనేకమారులు భీముని చంప దుర్యోధనుడు యత్నిం చెను. దుర్యోధన దుశ్శాసనుల వధింతునని ప్రతిజ్ఞ చేసిన వాడితడు. అట్టి బద్ధశత్రునిపై గల కోపముచే అతనితోనే దుర్యోధనుడు యుద్ధ మొనర్చుటకు తలపడెను. అంతేగాని వేరుగాదు. రారాజుకు ధర్మ జుని మీద కోపమేలేదు. అర్జునుడు గాండీవమును పుచ్చుకొనినచో

దుర్యోధనుని గద నగ్గునుగ్గగును. అర్జునునితో పోరాడ దలచినచో దుర్యోధనుడు గదనుచేపట్టరాదు. విల్లునంబు చేపట్టవలయును, నకుల సహదేవుల నంతగా నాతడు పట్టించు కొనలేదు. గనుకనే సుయో ధనుడు భీముని యుద్ధమునకు రమ్మని కోరెను. ఇందాతని గొప్ప దనముగాని వీరత్వముగాని శూన్యమని తేట తెల్లముగ గన్పట్టు చున్నదిగదా :

ఇతడు యుద్ధమునకు సిద్ధమగువాడు తలవంచని వీరుడు రాక్ష సులనేకుల హతమార్చిన వాడు లక్కయింట పాండవుల రక్షించిన వాడు కృష్ణుని సైతము భయమందజేసిన జరా సంధుని జంపి రాజసూయ యజ్ఞమును చేయుటకు ప్రథమ కారకుడైనవాడు యుద్ధమందు ద్రోణునితోసహా రథమునే విసరివేసిన వీరుడు. నారాయణాస్త్రమునకు నమస్కరించమని కృష్ణుడు చెప్పిన నిరాక రించి ధైర్యముగ రథముపై నిలబడిన ధీరుడు. ఇట్టి వీరలక్షణము లాయనలో లెక్కకు మిక్కుటముగా గలవు గనుకనే కృష్ణుడాయ నను సమానముగ గౌరవించెను. అర్జునుడింతటి వీరుడైనను భీమునివలె దూకమనిన దూకువాడు గాడు.

అర్జునుడు స్త్రీలోలుడా ?

అర్జునుని అమోఘ కార్యము లందరికిని దెలిసినవే గనుక వానినిక్కడ మరలవల్లె వేయుటనవసరము. అయితే తీర్థయాత్రల సమయమున ఈతడు ఉలూచిని చిత్రాంగదను సుభద్రను వరుసగా

పెండ్లాడినందున ఈయనను స్త్రీలోలుడని విమర్శకులందురు. వెయ్యేండ్లు తపస్సొనరించినను లభింపని దేవవేశ్యయగు ఊర్వశిని తృణముగా తిరస్కరించగలిగిన అర్జునునిలోని నిశ్చలత్వమును, మంచి యవ్వనముతోగల ఉత్తరను పెండ్లాడమని విరాటుడు గోరినపుడు తనన డ్డుపెట్టు వారెవ్వరును లేకపోయినప్పటికి ఆమెను తన కోడలిగా గైకొనిన ఆయన సాంసారిక పద్ధతిని విమర్శకులు గమనించరు. తాను జయించిన సొత్తును తాననుభవించుట లోక సహజము. కాని అర్జునుడందులకు విరుద్ధప్రవర్తకుడు. తాను జయించిన సంపదనంతయు అన్నలకు సోదరుల కప్పగించిన నిస్వార్థపరుడు, ఋషితుల్యుడు. త్యాగశీలి. ద్రౌపది పెండ్లి రాజ సూయము పట్టాభిషేకము అశ్వమేధయాగమే యిందులకు నిదర్శనములు.

అర్జునుడు వీరుడుగాదా ?

ఆధునికమున కర్ణుడే వీరుడు. కాని అర్జునుడు గాదని వింత విమర్శ చేయుచున్నారు. ఇట్టి విమర్శకులకు యుద్ధములలో చచ్చిన వారందరును వీరులవలె గన్పట్టుచు గెల్చినవారందరు భీరులవలె గన్పట్టుదురు గాబోలు! అర్జునుడొనర్చిన యద్భుతముల వంటివానిని కర్ణుడొక్కటి యైనను గావించి యుండలేదు. అర్జునుడొనర్చిన వింతలు వర్ణనాతీతములు. విద్యా ప్రదర్శనములోనే అగ్రగణ్యు డయ్యెను. ఇతరులు గొట్టలేని మత్స్యయంత్రమును గొట్టెను. అద్భుతమగు గాండీవమును సంపాదించెను. దీనిని బ్రహ్మ నూరు

వేల యేండ్లు ప్రజాపతి అరవైనాలుగువేల యేండ్లు ఇంద్రుడు అయిదువందల వేల యేండ్లు వరుణుడు అగ్ని కొన్ని వందల యేండ్లు ధరించిరి. అగ్ని అర్జునకిచ్చెను. ఇది తిరుగులేని ఆయుధము. ఇతడు ఇంద్రునే ఓడించెను. అన్నచే రాజసూయమును చేయించెను. శివునితో పోరాడి పాశుపతమును బడసెను. బొందితో దేవలోకమున అయిదేండ్లుండి తిరిగివచ్చెను. జలధికుక్షిలో దాగిన అరువదినాలుగు వేల నివాతకవచులను కాలకేయులను హతమార్చి ఇంద్రునకు సాయపడెను. మొసళ్ళగానున్న అప్సరసల శాపమును బాపెను.

పాతాళ లోకమందలి ఉలూచిని వివాహమాడెను. దేవలోకమందలి ఊర్వశిని త్యజించెను. కౌరవుల నోడించిన గంధర్వుని చిత్రసేనుని క్రీడి యోడించెను. ఉత్తర గోగ్రహణ సమయమున కౌరవ పక్షము నంతయు ఓడించెను. ఇట్టి ఘనకార్యముల కర్ణుడొక్కటియును చేయలేక పోవుటకు కారణమేమా యని యూహించగా పార్థుడు ఆస్తికుడు కర్ణుడు నాస్తికుడటయే యని తెలియుచున్నది. కర్ణుని నడవడి కపటముతో గూడియున్నది. గనుక ఎంతటి వీరులైనను దైవకృప లేనిచో చివరకు వారికి అపజయమే ప్రాప్తము అనునది జగమెరిగిన సత్యముగా నున్నది. గనుక అర్జునుడే వీరుడగును గాని యితరులెవ్వరును గాదు. నిజమెరింగిన భీష్మద్రోణాదులు మొదటినుండియు అర్జునుడజేయుడని పలుకుచుండినను, కౌరవులు ఆధునిక వింతవిమర్శకులవలె ముసలివారైన

భీష్మ ద్రోణులను పీరులుగా నమ్మి వారి మాటలను పాండవ పక్ష పాతములుగ జమకట్టి ఆఖరుకు యపజయమును పొందియుండిరి.

తీర్థయాత్రలకేగిన పార్థుడు పెండ్లిండ్లు చేసుకొనుటేమిటి యని ఒకపామర విమర్శ. తీర్థయాత్రలో ఉలోచితో మాత్రమే వివాహమాడెను. ఆమె నాగజాతి కన్యయేగాని మానవజాతి కన్య గాదు. ఆ సంపర్కము గూడ ఈయన కోరుకొనినది గాదు, ఈయన కోరి చేసుకొనిన వివాహములు చిత్రాంగద సుభద్రలతో మాత్రమే. అప్పటికాయన తీర్థయాత్ర కాలమగు సంవత్సరము గడచిపోయినది. గనుక ఇందులో ఆయన దోషమేమియును లేదని గ్రహించవలయును.

పాండవులు అన్నగారిమాట మీరరు. ఆయన యాజ్ఞలేనిదే యేపనిని చేయరు. అందుచేతనే గదా ద్రౌపది అవమానమును యడ్డగింపలేక పోయినది యర్జునుడు. అర్జునుడు దుర్యోధనాదుల అడ్డుకొనలేడందుమా? కాదుకాదు, ధర్మశాస్త్ర పారంగతుడగు అన్నగారి ఆలోచన రాజకీయ చతురత ఏమిటో? అని యూర కుండెను! అంతమాత్రమేనని యూహింపవలయును. ధర్మరాజు మంచి ఆలోచన గలవాడని అర్జునకు మాత్రమే దెలుసును. ద్రౌపదిని తాను రక్షింపలేక పోయినను రక్షింపబోవ నుద్రేకుడైన భీముని సయితము ధర్మజుడు వారించెను. అట్లై కీచకుని అక్రమ మునకు, ఆగ్రహావేశుడై ఆతనిని జంప వృక్షమును బెకలింప

బోవు భీముని మరల ధర్మజుడు వారించెను. ఇట్లే ఘోష యాత్రా సమయమున తమ్ము నవమాన పరచవచ్చిన కౌరవుల గంధర్వుల వారినుండి రక్షింపుడని తమ్ముల భావమునకు విరుద్ధమగు ఆజ్ఞను అన్నగారిచ్చెను. ఇట్లు వీరులైన సోదరులు అన్నగారి ఆజ్ఞను సిర సావహించి బుద్ధి బలమునకు శరీరశక్తి లోబడుట శ్రేయస్కరమని నిరూపించిరి.

తంత్రములు రెండురకములు. రాజకీయ తంత్రములు. యుద్ధ తంత్రములు. కౌరవులు రాజతంత్రము లాచరింపగా పాండవులు యుద్ధ తంత్రము లాచరించిరని యనవచ్చును. ఈ యుద్ధ తంత్రములు గూడ పాండవులు బుద్ధిపూర్వకముగా చేయలేదు. కృష్ణుడే వారిచే చేయించెను. ఈయన వారికి చేసిన సహాయములు సలహాలన్నియు యుద్ధతంత్రములే. పాండవులలో కౌరవులలో ముఖ్యముగా వైరులిద్దరు మాత్రమే. కర్ణార్జునులు భీమదుర్యోధనులు. వీరిలో ముఖ్యు లిద్దరు మాత్రమే. కర్ణదుర్యోధనులు. వారివలన దేశమున కంతటికిని యుద్ధ జ్వాలలు వ్యాపించెను. ఈ అగ్నిలో నుండి బయటపడుటకు తెలివిగలవారు దొడ్డిత్రోవలు వెదకిరి. మన యిండ్లు తగులబడుచుండ మనము బయటబడుటకు చేయుపని యిట్టిదే గదా!

ఒకవేళ యుద్ధములో అక్రమములు ఉభయులును సాగించిరనుకొందము. ఆ యక్రమములలో గూడ కొన్ని సక్రమములు

కొన్ని అక్రమములు వుండును, స్వార్థమునకు జేయు అక్రమములు అక్రమములే. పరార్థమునకు జేయు అక్రమములైననూ సక్రమములే యగును. దుర్యోధనుడు కోరుకొనిచేయించినవి కౌరవుల అక్రమములు. కృష్ణుని బలవంతమున చేసిన అక్రమములు పొడవు లవి. యుద్ధము కావలయుననినవాడు కౌరవాగ్రజుడు. యుద్ధము వలదనినవాడు ధర్మరాజు. ఈ పరిశీలనతో జూచిన పాండవుల అక్రమములు న్యాయ సమ్మతము లేననిపించును.

కర్ణుడు పరశురామునివద్ద విలువిద్య నేర్చుటకై తన కులమును దాచి అబద్ధమాడుట న్యాయమా? చావుబ్రతుకుల సమయములో ధర్మరాజొక్క అబద్ధమాడినట్లు నటించుట అన్యాయమా! వెనుకపాటున విల్లుద్రుంచి అభిమన్యువధకు తోడ్పడిన కర్ణుని చర్య ధర్మమా? కర్ణుని చంప ప్రతిజ్ఞ చేసియున్న అర్జునుడు కృష్ణుని ప్రోత్సాహమున కర్ణుని వధించుట అధర్మమా? మోసగించి శల్యుని తనవైపునకు త్రిప్పుకొనుట రారాజుకు సక్రమమా? తను ధర్మజున కిచ్చినమాట నిలబెట్టుకొనుటకై శల్యుడు కర్ణునితో నిరుత్సాహపు మాటలనుట అక్రమమా? ఒకరు నిరుత్సాహ పరచినచో నిరుత్సాహపడువాడెట్లు వీరుడగును? యుద్ధమునకు కారణమేమిటా యని పరిశీలించి న్యాయాన్యాయములు విచారించుట సబబు. అట్లుగాక ఆవేశములో నున్నపుడు ఉభయులు అక్రమములు అనుకోకుండనే చేయుట సహజము. యుద్ధములో దిగిన పిదప నీవు నన్ను రెండు దెబ్బలు వేసితివి. నేను నిన్ను ఒకే దెబ్బ కొడితిని.

గనుక నీది అక్రమమని వాదించుకొనుట అసంభవమగు విషయము గదా! గనుక పాండవుల యుద్ధ తంత్రములు అక్రమములైనను విమర్శింప రానివని విదితమగుచున్నది. అసలు అక్రమ కార్య మాచరించువారికంటే ప్రోత్సహించువారికే ఎక్కువ శిక్షబడుట నేడు న్యాయస్థానములందు జరుగుచున్నదే గదా! అట్లగుచో పాండవులకేయ దలచిన శిక్ష శ్రీకృష్ణునికే విధించవలసియుండును.

యుద్ధానంతరము పాండవులు గాంధారి నోదార్చుటకై కృష్ణునితో వెళ్ళిరి పుత్రులవియోగమువలన కోపాగ్నితో కుమిలి పోవుచున్న గాంధారి దృష్టి తనకండ్లగంతయొక్క సందులోగుండా ధర్మజుని యెడమకాలి బొటన వ్రేలిపై బడి వ్రేలు మాడిపోయినది. పాండవులే దుర్మార్గులని తలంచుచో ఆమె తనకోపదృష్టిచే పాండవులను భస్మము చేసి యుండెడిది. కానీ వారిది తప్పిదము లేదని గ్రహించినది గనుగనే గాంధారి తన కుమారుల చావుకు మూల కారకుడు కృష్ణుడని భావించి ఆయనను శపించినది.

తన కుమారుల చర్యలను నిందించుచున్న విదురిని అడవిలో నున్న పాండవులపద్దకు వెళ్ళదరిమిన ధృతరాష్ట్రుడు తన పొరబాటును తాను గ్రహించి చిత్తశాంతిలేక విదురుని మరల రావించుకొనెను. అట్లుభయులు దరిజేరుట జూచి వీరుభయులు మరల మునుపటివలె పాండవులను రప్పించి రాజ్యమిత్తురేమోనని రారాజు యను మానించెను. అపుడు శకుని యిట్లనును. "నిత్యసత్యరతులగు

పాండవులు తాముచేసిన సమయము పూర్తిగ నొనరింపక తిరిగి పురములకు రారు. నీవేల యనుమానించెదవని శకుని సుయోధనుని ఓదార్చును. ఈ పరిశీలనవలన శత్రువులే పాండవులను ధర్మాత్మ లని యొప్పుకొనియుండ మనము వారిని అధర్మపరులుగ మార్చుట తల్లక్రిందుగ తపస్సు చేసినటులున్నది. కర్ణుడులేని భారతమా యని యనుటకు బదులు పార్థుడు లేని భారతమాయని యనవల యును. అర్జునుని విలువిద్యా నైపుణ్యమే కర్ణుని కార్పణ్యమునకు కారణము. కర్ణుని స్నేహమే కౌరవాగ్రజుని దురాశకు దురాగత ములకు మూలము. అర్జునుడు లేనిచో పాండవపక్షమున మరొక వీరుడేలేడుగదా! అందుచే భారతకధకు మూలకారకుడర్జునుడని యెరుంగవలయును.

కర్ణుని వధించుట అర్జునుని దక్రమమా ?

పాండవులకు కౌరవులకన్నను ప్రధమ శత్రువు కర్ణుడే అయియుండెను. అతడొనర్చిన యపకారములు లెక్కకు మిక్కుటము, అనవసరముగా అర్జునుని ద్వంద్వ యుద్ధమున కాహ్వానించెను. మత్స్యయంత్రమును గొట్టజాలక క్రీడి మామయగు ద్రుపదుని పైకి పోయిన రాజులకు కర్ణుడు నాయకత్వము వహించెను. ద్రౌవది పరాభవమక్రమమని పల్కువికర్ణుని వారించెను, మరియొక భర్తను గట్టుకొనమని ద్రోవదిని గేలిచేసెను. ఆమెను కులటయని సంబోధించెను. అభిమన్యుని వెనుకపాటున వచ్చి విల్లుద్రుంచెను.

తనను వల్లెత్తు మాట యనని ధర్మరాజును రక్తముగార గొట్టెను. ఆపుడా శాంతమూర్తి అశాంతుడై ఆగ్రహముతో కర్ణుని చంపిరాలేదా యని అడిగి గాండీవమును వీడుమనగా అర్జునున కెన్నడురాని కోపమువచ్చి ఆయన కోపాగ్నికి కర్ణుడు గురి యయ్యెను. గనుక కర్ణుని వధించుటలో అర్జునుని యక్రమమావ గింజంతైనను గానరాదు తన తప్పులకు తానే శాపములబొందెను. తనశాప ఫలముల తానను భవించెను. తనకు గల శాపములసంగతి ముందుగా కౌరవులకెరింగించి యున్నచో వారు సైంధవుని రక్షించ యత్నించి నటుల కర్ణునిగూడ చుట్టుముట్టి కాపాడి యుందురేమో? ఏల అట్లు తనశాపముల దాచెనో యని ఆలోచించిన ఈతడు దుర్యోధనుని రక్షించుటకు అతని ప్రక్క జేరిన వాడు గాడు. తన సౌఖ్యమును మాత్రము జూచుకొనుటకే కౌరవపక్షము జేరె నని దెలియును. అట్లు తనరక్షణను తాను గల్పించుకొనలేక 'నేను విరథుడను నన్నుగొట్టవద్దు కొంచెమాగుమని శత్రువులతో బేర మాడుటమే కర్ణుని అల్పత్వము వెల్లడియగుచున్నది. వీరుడట్లు బేరమాడునా? అభిమన్యుడు నేలపడిపోవుచున్నను అతడనేక విధముల యుద్ధమొనరించెను గదా? కర్ణుడు రథమెక్కనిదే యుద్ధముగావింపలేడు గాబోలు? గనుక అభిమన్యుడే వీరమరణము బొందెనని యనవచ్చును. కర్ణునిది దుర్మరణమేయనిపించును. కర్ణుడిట్టి బేరములు యుద్ధప్రారంభమునకు పూర్వమే జేసియుండి నచో భారతయుద్ధమే జరిగి యుండదుగదా? ఇట్లు సర్వనాశనము నకు కారకుడగు కర్ణుడెట్లు వీరుడగును? అరునుడే అన్నివిధముల

విరుడనబడును. ఇంతకూ ఎవరు వీరులైనను శని వంటి శకుని లేనిచో యింత అనంతమగు ఘోరము జరుగదుగదా యని యనిపించును.

శకుని మోసగాడా?

ఇతడు గాంధారరాజపుత్రుడు, వృషకుడు, అచలుడను వారలు యితని సోదరులు, ముఖ్యముగ జూదములో ధర్మ రాజునోడించుటచే ఈయనకీబిరుదు సార్థకమైనది. కాని కోరికలు గలవానినే యితరులు మోసము చేయగలరు, కోరికరహితుని పరు లేమిచేయగలరు? గనుక దుర్యోధనుని దురాశయే శకుని చర్యకవ కాశమిచ్చినది. అసలు జూదములో శకుని చారచక్యము పూజ్యము, ఆతడుపయోగించిన పాచికలే మాయపాచికలు, మహిమగలపాచి కలు. జూదమందు ధర్మజుడు మంచినేర్పరి. అందుచే శకుని, ధర్మజుని మాయపాచికలద్వారా ఓడించగలిగెనేగాని యదార్థముగ జూదమాడిగాదు, గనుక ఆ మాయపాచికలదే నేరముగాని శకుని తప్పిదము గానరాదు. అందుచే ఆయనను మనము నిందించరాదు. మరియు ఆ మోసమైనను శకుని స్వార్థమునకు జేసినదిగాదు. అంతేగాక ఆ పాచికలకా మోసపుశక్తి ఎట్లు లభించినది? అవి శకుని తండ్రియొక్క యెముకలు, కౌరవ వంశ నాశనమొనరింప శకునివద్దకు చేరినవి. ఎందువలన? దుర్యోధనుడు తన తాతను అకారణముగ బంధించి బాధించినందున, ఇట్లు పరిశీలించిన ఎవరి

ఖర్మకువారే బాధ్యులని దెలియును. కౌరవవంశ నాశనమునకు కారకుడు దుర్యోధనుడేగాని శకునిగాదని గ్రహించవలయును.

పురాణపాత్రల విమర్శించరాదు!

ఇట్లు ప్రతివిషయమును మనము విమర్శించుచూ పోయినచో ప్రపంచములో చెడ్డపదార్థమే మనకు గనుపింపదు. చెడ్డమను జూడే గన్పట్టడు. అరిషడ్వర్గములను ఆరు దుష్టశక్తులు గూడ మంచివిగనె పరిగణింపబడవలయును. మనమన భావములకొద్ది అయాపాత్రలు కొందరికి యోగ్యములు మరికొందరికయోగ్యములుగ గన్పట్టును. రాయబారస మయమున ధర్మజుడు కష్ణునకిచ్చిన సందేశసారాంశమిదియే. ఇట్టి దృష్టితో జూచిన విమర్శ అను పదమునకే సాహిత్యములో చోటుయుండదు, కొడుకు కష్టములకు తండ్రి కారకుడు తండ్రి కష్టములకు తాత కారకుడు. తాత కష్టములకు ముత్తాత కారకుడు. ముత్తాత కష్టములకు వానితండ్రి. ఇట్లు జూచిన మూలకారకుడు సృష్టికర్తయే యని దెలియును. గనుక ఒకరి నొకరు నిమర్శించుకొనుట అవివేకము. పురాణపాత్రల విమర్శించుట అంతకుమించిన అజ్ఞానము, అందుచేతనే గదా భారత యుద్ధములో గతించిన మనుజుల జీవములన్నియు శత్రుమిత్ర సహితముగా వాసుదేవునిలో విలీనమైనవి. మరణాసన్నసమయమునకు మాత్రము శత్రువులుగూడ కృష్ణుని విష్ణువుగా రామాయణమున రాక్షసులు రాముని నారాయణునిగా గుర్తెరుంగ గలిగిరి.

అటులే అజ్ఞానదశయగు యౌవన దుర్మదములో ధన మధాంధతలో స్వార్థ చింతనలో గలవారందరు యిటులే అవివేక ముగ విమర్శించి విమర్శించి విసిగి వేసారి అంత్యమున ఈశుని గాంచెదరు. ఆధునిక ప్రపంచపరిస్థితి యిట్లేయున్నది, విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానమబ్బినందున ప్రపంచమిప్పుడు యౌవన దశలో వలె కన్ను మిన్ను గానక ఏదో కాంతిగ గన్పట్టు భ్రమలో యున్నది. మనిషికి నాలుగు దశలవలె ప్రపంచమునకు గూడ యుండుట నైజము, అందుచే ఎప్పుడో ప్రళయము సంభవింపక తప్పదు. అనంతరము శూన్యమందు భగవంతుని గాంచుటయు తప్పదు, అందుచే మనము హేతువాదన అను నెపమున అర్థ రహిత వితండ వాదనలు వింత విమర్శలు జేసుకొనుచు కాలమును వృధా పుచ్చుకొనరాదు. ప్రపంచము మాయ ప్రకృతిమాయ మను జుడుమాయ మన్మధుడుమాయ సర్వంమాయ సమస్తం మాయ.

ఇట్టి మాయాప్రపంచమిప్పటికెన్నిమార్లు పుట్టెనో ఎన్ని మార్లు గిట్టెనో ఏరికెరుక? మతములు వేరైనా అందలి యుప మానములన్నియు పంచభూతములకు సంబంధించినవే. విజ్ఞాన శాస్త్రిమిటీవలెనే పుట్టి, చంద్రునిపై అధిరోహించువరకు శరవేగ ముతో అభివృద్ధి గాంచినది. ఇట్లు సైన్సు అభివృద్ధి అయిన కాల గమనమును బట్టి గతమును లెక్కించినచో సృష్టి ప్రళయములు ననేకమార్లు జరిగియుండునని దెలియును, ఇట్లు గతికాలమును గమ నించుచు ప్రస్తుత అభివృద్ధిని పరిశీలించిన నేడు మానవుడు సాధిం

చిన విజ్ఞానమత్యల్పమని బోధపడును, గనుగ మనము గ్రహించవలసిన సారాంశమేమనగా ఈ మార్పులు చేర్పులు నేర్పులు సంస్కృతులు సాహిత్యములు నాగరికతలు నాణ్యతలు అశాశ్వతములనియు, అస్థిరములనియు ఋషులముందు మన విజ్ఞానమతి స్వల్పాతిస్వల్పమనియు గ్రహించి విజ్ఞాన శాస్త్రమెంత యభివృద్ధి గాంచినను భక్తిని విడనాడరాదనియు మతమును మరువరాదనియు గతించిన రచయితలపై ధ్వజమెత్తరాదనియు పరులను విమర్శింప దలచిన ముందు తనను విమర్శించుకొనవలయుననియు పుట్టినందుకు పురాణముల పఠించి పెద్దల బోధల నాలకించి పుణ్యమార్జించుకొని జన్మల పునీతములగావించుకొన యత్నించుట యుత్తముని లక్షణమనియు పౌరాణికులు పలికిన పలుకులను మనము నమ్మవలయును.

రావణుడు శివభక్తుడా?

రామాయణము రావణుని దుర్మార్గుడని దెలుపుచున్నది. ఈనాడాతడు సన్మార్గుడుగ నెన్నబడుచున్నాడు. భారతములో కర్ణ దుర్యోధనులు రామాయణములో ఈతడీనాడు ఉత్తములై కీర్తింపబడుచున్నారు. ఇట్టిమార్పులే ఈనాటి వింత విమర్శలకు ఫలితములు.

పండితుడు గాయకుడు శివభక్తుడు తపోధనుడు భాగ్యవం

తుడు భోగలాలసుడు. దిక్పాలకుల జయించినవాడు దిగ్విజయ మొనర్చినవాడు నిరంకుశపాలనజేసినవాడు అనుగుణములచే యీత డీనాడున్నతుడయినాడు. అంతియుగాక యీనాడితనికొక క్రొత్త కీర్తిని గూడ ఆధునికులు తెచ్చిపెట్టినారు. ఉత్తరాదివారి యధికార మును ధిక్కరించిన వీరుడట. వాల్మీకినే అధిగమించిన ఆధునిక పండితులను మనమే మనగలము. మునులవలె మౌనమువహించవల సినదే. మౌనమువహించుటయే మంచికి నిదర్శనముగదా! కాలము మారినది.

ఆధునికమున మానవునికి తృప్తి తక్కువై క్రొత్తసృష్టిపై కోరికలెక్కువైనవి. ఇట్టి ఆధునికుల తృప్తిబరచుటకై సంగీత సాహిత్య సాంస్కృతిక సాంసారిక శారీరక మానసిక సర్వవిష యములందు సర్వవస్తువులయందు సంకరసృష్టి చిత్ర విచిత్రము లుగ జరుగుచున్నది. ఇట్టిసంకర కాలమందు మనబోటి సాధువు లేమి చేయగలరు. సద్విమర్శ గానించుకొని చిత్తశాంతిని పొందు టకు ప్రయత్నించెదరు. రావణుడుత్తముడని చెప్పుటకు పైన జూపిన గుణములు ఆయనలోని మంచిగుణములక్రింద పరిగణింప బడవు. అవి వానికిగల సంపదలు శక్తిసామర్థ్యములు మాత్రమే మనిషియొక్క మంచితనము వానికిగల సంపదల, శక్తిసామర్థ్య ములయొక్క సద్వినియోగముపైన మాత్రమే ఆధారపడియుండును కానీ రావణుడు తన సంపదల దుర్వినియోగమునకు మాత్రమే ఉప యోగించినాడని అతని చరిత్రను చదివిన చదువరులకు సులభ

ముగా దెలియును, ఈతడు తపోధనుడయ్యును ఋషులను మును లను దేవతలను బాధించెను, యజ్ఞములను పాడుచేసెను, పండితు డయ్యును పతివ్రతల బాధించెను, భక్తుడయ్యును విష్ణుభక్తుల హింసించెను, శివభక్తుడయ్యును పార్వతిని గోరెను, గాయకు డయ్యును, గానలోలుడగు విష్ణువును లోబరచుకొనలేక పోయెను, శివుని మెప్పింప దనశిరస్సులు ద్రెంచుకొనినను ఋషులశిరములు ఖండించెను. ఇట్లీతనిసంపద యంతయు దుర్మార్గాచరణమునకే విని యోగమైనందున ఈతనిని సర్మార్గుడనుట సమంజసము గానేరదు. అహంకారము ఆవేశన అశాంతి అలజడి అతృప్తి యను ప్రవృ త్తులకీతడాటపట్టు ఈతడు ప్రజానురంజకుడుగాదు. కోతియగు హనుమంతుడు లంకను గాల్చినపుడు రాక్షసస్త్రీలు కోతిని తిట్టుటకు బదులీతనినే నిందించిరి.

రావణుడు మిక్కిలి స్వార్థపరుడు. ఈతని స్వార్థమునకు మితమేలేదు. శ్రీరాముని వంశపు పూర్వీకులలో ఇరువదితొమ్మి దవ తరమువాడగు అనరణ్యుడు రావణునిచే దెబ్బలుతిని చావ బోవుచు మా వంశములో భవిష్యత్కాలమున విష్ణువు దశరథునికి పుత్రుడుగ జన్మించి నిన్ను సంహరించునని శాపమిచ్చియున్నాడు. ఆ విషయమెరింగిన రావణుడు దశరథునికి కుమారునిగ విష్ణు మూర్తిని పుట్టకుండజేయుటకై కౌసల్యా దశరథుల వివాహమునే భగ్నము చేయ ప్రయత్నించెను, అట్టి ఘనుడీతడు, పుట్టినప్రాణి కేనాటికైనను గిట్టుట తప్పదనుసంగతి నెరింగియున్న పండితుడగు

రావణాసురుడు అప్పటికే అనేకవేల సంవత్సరములు జీవించి యుండియు తృప్తిజెందక శాశ్వతముగ బ్రతుకు నాశతో, రాముని జన్మను నిరోధించుటలోనే దెలియుచున్నదీతని మేరలేని స్వార్థ పరత్వము. తనసోదరియగు శూర్పణఖను ముక్కుచెవులుగోయించిన రామునిగాని కోసిన లక్ష్మణునిగాని బదులుగ బాధించుట న్యాయము. కానీ తప్పుచేసిన దొకరు శిక్ష యనుభవించినదింకొకరుగ నున్నది రా: ణుడు సీతను బాధించుట, ఇట్టిచర్య ఏవిధముగ నాలోచించినను ధర్మసమ్మతముగలేదు. ఒక దుష్టస్త్రీ యయిన శూర్పణఖ సలహాను పాటించి రావణుడు సర్వనాశనమైనాడు. ఇదేనా ఆయన రాజనీతిజ్ఞత? రాజు తనమంత్రుల సలహాలు పాటించవలయునుగాని బంధువుల మాటలు పాటించుట న్యాయ సమ్మతము గాదుగదా? ఆధునికులు రావణుని మంచివానిగ జేయ ఎంత ప్రయత్నించినను ఆతడు రామునిస్థాయికెన్నడును రాజాలడు. తమ్ముడగు భరతునకు రాజ్యమును వదలినవాడు రాముడు. తమ్ముడగు విభీషణుని వెడలగొట్టినవాడు రావణుడు. ఏకపత్నీవ్రతుడు రాముడు బహుపత్నీవ్రతుడు రావణుడు. రాముడు త్యాగి రావణుడు భోగి. ప్రజాభీష్టముగ పాలించినవాడు రాముడు. స్వాభీష్టముగ పాలించినవాడు రావణుడు. రాముడు వానరులను బ్రతిమలాడి సహాయమునుపొందెను. రావణుడు తనసహాయముకొరకు రాక్షసులను బెదరించెను. యుద్ధములో తనస్వార్థమునకై రావణుడు తన బంధువుల నందరినిదింపి వారు జచ్చుటకు కారకుడయ్యెను. కానీ రాముడు తనబంధువులనెవ్వరినీ రణమునకు

రప్పించలేదు. భారతయుద్ధము రాజకీయమైనది. రామరావణ యుద్ధము వ్యక్తిగతమైనది. గనుక రామాయణము ఉత్తరాది వారికి దక్షిణాదివారికి జరిగిన తగాదాగాదు. ఉత్తరాదివారు రామ లక్ష్మణు లిద్దరుమాత్రమే. వానరులందరూ వింధ్యపర్వతములకు దక్షిణప్రాంతమువారేగదా? గనుక రాక్షసులచే లంకకు దాపునగల కిష్కింధాప్రాంతపు వానరులు బాధలనొందియుండి వారికసిదీర్చు కొనుటకై రామలక్ష్మణులను నరులతీరపున రాక్షసులపైకి యుద్ధ మునకేగిరి. రాక్షసులకు వానరులకు సంబంధము లున్నవని చెప్పుటకు వాలి రావణాదుల స్నేహమే దృష్టాంతము. అరణ్యమందు ఖరదూషణ త్రిశిరాది రాక్షసుల నేకవేలమంది రామలక్ష్మణు లచే శూర్పణఖ కారణమున జచ్చియుండిరి. వీరు దక్షణహిందూ దేశములో నున్నవారేగదా? ఈ కారణముల ననుసరించి రాక్షసులు వానరులు యుద్ధములు జేసుకొనిరేగాని నరసమూహమీయుద్ధ మున పాల్గొనలేదనుట విదితమగుచున్నది. గనుక దక్షణాది వారికి ఉత్తరాదివారు వైరులు గాదని నమ్మదగును.

రావణుడు తనమేనమామ మారీచుని బెదిరించి మాయ లేడిగ నుపయోగించుకొనుట ద్వారా జంపించెను. తనబావ శూర్పణఖ భర్తయగు విద్యుజ్జిహ్వుని చంపి తదుపరి తెలియక చంపితినని చెల్లెలకు చెప్పుకొనెను. ఇట్లె సీతాన్వేషణార్థమై లంక జేరిన ఆంజనేయుని అందరు గలిసి బట్టుకొనవచ్చునుగదా! అట్లు గాక ఒకరితరువాత నొకరినిబంపి అక్షయకుమారుని జంబుమాలిని మొదలగు బంధువర్గమును జంపించుకొనెను.

శృంగార లీలలు

లోకములో పురుషుడు స్త్రీని ప్రేమించుట సహజము.
ఇట్టి ప్రేమ ఫలింపనిచో తానాత్మహత్యగావించుకొనుట సాధులక్ష
ణము. నిజమైన ప్రేమకు నివర్శనము. కానీ ఈ శృంగార
రసికమూర్తి ప్రెమకలాపమట్టిదిగాదు. అదొక విచిత్ర పశు
ప్రవృత్తి. రెండునెలలో సీత తనను ప్రేమింపవలెనట. లేనిచో
ఆమె యాతని చద్దిభోజనమునకు కూరయగునట. ఆహా! చూచి
తిరా! పది తలల యందగాని శృంగారలీల! దీనినిబట్టి పరి
శీలింపగ ఆమె శీలమును జెరచుట మాత్రమే అతని యుద్దేశ్యమై
యున్నట్లు దోచుచున్నదిగాని ఆమెతో అతడు భోగింప నుద్దేశించి,
గైకొనిపోలేదని దెలియును. మరియు సీతాప హరణ కాలము
నాటికాతడు చాలాముదుసలి. ఆ సమయమునకు దశరథుడు అరు
వదివేల యేండ్లవాడు. కౌసల్యాదశరథుల వివాహమునే రావ
ణుడు నిరోధించ ప్రయత్నించినాడు. అంతేగాక ఇరువది తొమ్మి
దవతరము వాడగు దశరథుని వంశ పూర్వీకుడగు అనరణ్యునితో
యుద్ధమొనరించినవాడు రావణుడు. అయిదువేలమంది భార్య
లతో కామవాంఛ దీర్చుకొనియున్నాడు. అట్టి ముసలి రావణు
డింకను కామాంధతలో యుండెనా? యని యాలోచించిన యుండ
దని దోచును. అయితే సీత నెందుకుదెచ్చినట్లు? పరస్త్రీలనేడ్పించి
తానానందించుట నతని యలవాటు. మరియు తనను యవమాన
పరచిన రామలక్ష్మణులు సులభముగా జిచ్చుటకీయుపాయమును

శూర్పణఖ అన్నకు సలహానిచ్చెను. సీత యనిన రామునకు అంతు లేని ప్రేమ, రాముని యుద్ధమున జయించుట దుస్తరము, ఖర దూషణ త్రిశిరాది ఘోరరాక్షసుల ననేకవేలమందిని హతమార్చు టయే రాముని పరాక్రమమునకు నిదర్శనమాయె. గనుక సీతా రాముల కెడబాటు గావించినచో సీతకై దిగులొంది రాముడు, రామునికై దిగులొంది లక్ష్మణుడు తమకుతామే మర ణింపగలరని శూర్పణఖ రావణునికి బోధించెను.

చెల్లెలు జెప్పిన యుపాయమును అన్న అమలు జేసెను. అంతేగాని సీతను ప్రేమించి యనుభవించుటకు కాదని రావణుని చర్యలు స్పష్టము జేయుచున్నవి. సీతారాముల ప్రణయమట్టిగాఢ మైనదని ప్రత్యక్షముగ జూచిన శూర్పణఖ చెప్పగా వినిన రావణు డామెను ప్రేమించియు లాభముండదని గ్రహించియే యుండును. గనుక సీతాపహరణగాథ రాముని మరణమునకు బూనిన యుపా యము మాత్రమే.

సీత లంకలో రావణునిచే చెరుపబడకుండునా?

రామాయణము పరిపూర్ణముగ చదువనివారుమాత్రమే యిట్టి పామర విమర్శజేయుచున్నారు. లంకలో అన్వేషణమాచ రించుచు హనుమంతుడు సూక్ష్మరూపమున వృక్షముపైదాగి, రావ ణుడు సీతను బెదరించుట సీత రావణునికి బుద్ధిచెప్పుట సీతను

రావణుడు నరుకబోవుట కృశించి శల్యావశిష్టగనున్న సీత ఆత్మ హత్య గావించుకొనబోవుట యిట్టి యనేక విషయములు హనుమంతుడు కనులార జూచినట్లు రామాయణమందు వ్రాసియుండగా వానిని గమనించక పన్నెండు నెలలు లంకలోనున్న సీతను రావణుడు ముట్టకయుండినాయని విమర్శించు మూఢులకు నచ్చ జెప్పుట కెవ్వరికి తరము!

రావణునిది దిగ్విజయమా?

రావణుడు వెయ్యేండ్లు తపస్సు గావించినను తొమ్మిది తలలు త్రెంచి హోమగుండములో పడవేసినను అతని యుద్దేశము మాత్రము స్వార్థమేగాని మోక్షార్థముగాదు, ఒకనాడు కుబేరుడు పుష్పక విమానము నధిరోహించిరాగా అతని భాగ్యభోగ్యమును గాంచిన కైకసి అసూయపడి కొడుకును ప్రోత్సహించగా అప్పుడారావణుడు బ్రహ్మనుగూర్చి తపస్సు చేయుటకేగెను, ఇంతకూ అతని తపస్సువలన పొందిన వరముల ఘనత యేమనగా సోదరుడగు కుబేరుని తరిమి లంకను తానాక్రమించుట, అతని పుష్పక విమానమును కాజేయుట, కుబేరుని రావణుని తల్లులు వేరు, తండ్రిమాత్ర మొక్కడే, నిజ సోదరుడగు విభీషణునే వెళ్లదరిమిన వానికి సవతితల్లి కొడుకగు కుబేరుని వెళ్ళదరుము టొకలెక్కయా? విశవసుబ్రహ్మ కొడుకయ్యును పండితుడయ్యును బ్రాహ్మణుడయ్యును రావణునిలో బ్రాహ్మణపద్ధతులు

సాత్వికము శాంతము సహనము తృప్తి లేకనేపోయెను కనబడిన బ్రాహ్మణులనెల్ల బాధించెను, ఋషుల కాలరాచెను, ఋషుల తపము జెరచెను. ఇదియా ఆయన తపస్సునకు ఫలితము? తపస్సుచేసినందులకు రావణుడు లోకమునకు చేసిన యుపకారము లేమైనావున్నవా యనియంటే ఏమియునూ లేవని జవాబు దొరకును. తన తపస్సు పొగరువలన కైలాసపర్వతముపై తనవిమానము ఆగినదను నెపమున పరమేశ్వరుని ప్రార్థించుటకు బదులు పర్వతమునే పెకలింప జొచ్చెను. నందీశ్వరుని రూపమునుజూచి నవ్వి ఆయనచే శాపమును బొందెను. రావణుని పొగరు అణచవలయునని శివుడు కాలి బొటనవ్రేలితో నొక్కగా పర్వతము క్రిందగల రావణుని చేతులు నలిగెను. ఆ బాధకు రావణుడు అరచెను. పొగరు యణగి శివుని ప్రార్థింపగా బోళాశంకరుడు కరుణ గలిగినవాడై రావణుని బాధనుండి విముక్తుని గావించెను. మొదటనే శివుని ప్రార్థించినచో రావ ని భక్తికి ఎంతయో విలువ నివ్వవచ్చును. కాని అతడట్లుచేయలేదు. ఇట్లు రావణుని అవకతవక పనులు అవమానపు కార్యములు లెక్కకు మిక్కుటమైనవి.

విష్ణుమూర్తిని భర్తగా బడయదలంచి తపస్సు చేయుచున్న కుశధ్వజుడను మునికుమార్తెయగు వేదవతిని అక్రమముగ పెండ్లాడమని నిర్బంధించి ఆమె కొప్పుబట్టి లాగి ఆమెచే శాపమును బొందెను. దూతలను చంపరాదని రాజులెల్లరకును దెలియును. కానీ తనకు హితవు బోధింప కుభేరుడు పంపిన దూతను ఇతడన్యా

యముగా చంపివైచెను. చెప్పుడు మాటలువిని ముసలివాడని ఆయిననూ కనికరింపక అయోధ్యానగర రాజగు అనరణ్యునిపైకి బోయి ఆయనను జంప యత్నించి ఆయనచే శాపమునుబొందెను. మాహిష్మతీపుర రాజగు కార్తవీర్యునితో యుద్ధమునుగోరి ఆయనచే ఓడింపబడి చెఱసాలలో నుంచబడెను: సిగ్గులేని రావణుడు తన దిగ్విజయ యాత్రఅను అపజయయాత్ర నంతటితోనైనను ముగించుకొనక వాలి మీదకు బోయెను. సంధ్యవార్చుచున్న వాలిని సముద్రములో ద్రోయదలంచి ఆయన చంకలలో తనచేతులు పోనివ్వగా గుర్తించిన వాలి తన భుజములను నొక్కగా రావణుని చేతులిరుక్కొనిపోయెను, ఇట్లు రావణుడు తనవీపున వ్రేలాడు చుండగా వాలి నాలుగు దిక్కుల సముద్రములు దిరిగి సంధ్యవార్చి చివరన రావణుని వదలి అతడు క్రిందబడగా అవమాన పరచి పంపెను. ఏడు రోజులు యమునితో పోరాడి చివరకు తనకు తానే గెలిచితినని చెప్పుకొనుచూ వెళ్ళెను. కానీ బ్రహ్మదేవుడు బ్రతిమలాడగా యముడు బ్రహ్మాస్త్రమును ఉపసంహరించు కొనెను. పన్నెండునెలలు మణిమతి పాలకులగు నివాతకవచు లతో పోరాడియు వారిని గెలువలేక రావణుడు రాజీపడీ వెనుదిరిగి పోయెను, అశ్మపురమునకేగి కాలకేయులపై యుద్ధముచేసెను. వారిని ఓడించలేక పోయినను వారిలోని తనబావయగు శూర్పణఖ భర్తయగు విద్యుజిహ్వుని మాత్రము అవివేకముగ చంపుకొని సాతసించిపోయి అయ్యో యిట్లేల నాభర్తను నాశనమొనర్చితి వని సోదరి శోకింపగా కోపావేశములో నేనాతనిని గుర్తించలేక

పోతినని చెంపలువేసుకొనెను. పురమందు లేని సమయమున వరుణునిపైకి యుద్ధమునకేగి, "వరుణిని మంత్రి నీవు గొప్ప వాడివని" పొగడగా సంతసించి వచ్చెను. సుతల లోకమును పాలించు బలిచక్రవర్తి పైకి పోగా ఆయనీతనిని పసిపిల్లవానిగ జూచి తనతొడపై కూర్చుండబెట్టుకొని విష్ణుని గొప్పతనమును బోధించి పంపెను., మాంధాతయను అయోధ్యరాజుపై కేగెను. కానీ జయించకనే పులస్త్యబ్రహ్మ బుద్ధిచెప్పగా వెనుదిరిగెను. చంద్రునిపైకి బోయి బ్రహ్మచే వారింపబడి నొకమంత్రమునేర్చు కొని మరలిపోయెను. యక్ష గరుడ గంధర్వ కిన్నర కింపురు షాది దేవతల వనితల నీతడతి నీచముగ బాధలుపెట్టెను. శత్రు వుల స్త్రీలనైనను క్షమించి రక్షించుట ధీరుని లక్షణము, ఉత్తమ మానవ ధర్మము, అట్టిచెడ్డ రావణునుత్తముడని యీనాటి మానవు లెట్లు పొగడుచుండిరో అగమ్య గోచరము. ఆ దేవతాస్త్రీల శాపములే నతని నాశనమునకు కారణములైనవి.

రావణుడు స్వంతబుద్ధి లేనివాడు

కైకసి ప్రోత్సాహమున, కుబేరుని వెళ్ళదరుముటకు తపస్సుగావించెను. సుమాలి ప్రహస్తుల ప్రోత్సాహమున కుబేరుని లంకనుండి దరిమెను. నారదుని ప్రోత్సాహమున యమునిపైకి బోయెను. బ్రహ్మదేవుని బోధవిని వెనుదిరిగివచ్చెను. నివాత కవచులపై యుద్ధమును శతానందుని మాటలువిని మానెను. పర్వ తముని ప్రోత్సాహమున మాంధాతాపైకి బోయెను. పులస్త్య

బ్రహ్మ బోధన విని వెనుదిరిగి వచ్చెను. విభీషణుని ప్రోత్సాహమున తనచెల్లెలు కుంభీనసను, యెత్తుకొని పోయిన మధుడను వాని పైకి బోయెను. కుంభీనస బ్రతిమలాడగా అతనిని వదలెను. నారదుని ప్రోత్సాహమున నదీసముద్రమున గల శ్వేతద్వీపమున కేగి అచటి స్త్రీలు యీతని తుమ్మెదవురుగుగా భావించి ఎగురవేసి యాడుకొని యవమానించగా యేడ్పుతో నింటికివచ్చెను. తుదకు శూర్పణఖ ప్రోద్బలమున సీతా నపహరించి సర్వనాశనమాయెను. ఇట్లీతడు పరబుద్ధిపై యాధారపడి పతితుడయ్యెనేగాని స్వంతబుద్ధి లేని వాడాయెను. స్వంతబుద్ధిపై ప్రవర్తించిన రాముడు జయ మందెను. పరబుద్ధిపై ప్రవర్తించిన రావణుడపజయమందెను. భక్తి తనముక్తి కొరకు పయోగించుటకే యవసరముగాని పరుల హింసించుటకు గాదుగదా! మరియు శివుని భక్తుడు విష్ణువుని ద్వేషించుటయా? అసలు ద్వేషభావము భక్తునిలో యుండరాదు. రాగద్వేష రహితుడేగదా భక్తుడనబడును? విభీషణుడు కుంభ కర్ణుడు మొదలుగాగల రాక్షసులనేకులు రామునిపై యుద్ధము వల దన్నను వారిన బలవంతముగా యుద్ధమునకంపిన రావణుడు భక్తుడా? బంధుప్రియుడా? రాక్షసులే ఆతనినిందించియుండ మన మాతనని ఉత్తముడని యనుట మనది చిత్తవిజ్ఞానమని యన దగును.

మరణమాసన్న సమయమునకు రావణుడే రాముని విష్ణువుగా గుర్తించి తన తప్పుల యొప్పుకొనియుండెను. అట్టి వాల్మీకి

నిర్ణయమునే తలక్రిందొనర్చి చిత్రించు యీనాటి చదువరుల వాద ప్రమునకు చింతించగలమే గాని మూర్ఖుల మనస్సును మార్చ జాలము గదా! రాముని మంచితనము వీరికి అసమర్థతగా గాన్పించును గాబోలు!

శ్రీరాముడుత్తముడు కాడా?

వాల్మీకి శ్రీరాముని మచ్చలేని మనిషిగ లోకమున కాదర్శ పురుషునిగ సర్వగుణ సంపూర్ణునిగ ధీరోదాత్త నాయకునిగ తీర్చి దిద్దినాడు. అట్టిరాముడీనాటికి విమర్శకు గురియైనాడు. ఆనా డాయన శత్రువులగు రాక్షసులు రాముని గెలువలేక నిస్పృహా నిరాశలతో విమర్శించిన విమర్శలేగా. నేడు ఆధునికులనేకులు ఇవి క్రొత్తవేమియుగావు.

ఈతడసమర్థుడు. చేజిక్కిన రాజ్యమును జారవిడచు కొనెను. సీతను శంకించెను. తాటకిని జంపిన స్త్రీ హంతకుడు. వాలిని నేరుగా గెలువలేక చెట్టుచాటున నుండి గొట్టెను. తనను వలచిన శూర్పణఖను దరిజేర్చుకొనజాలక అవమానపరచిన దయావిహీనుడు. విభీషణుని సహాయములేనిచో వానరుల యాధారము దొరకనిచో రావణుని రాముడు జయింపలేడు. ఈత నిది కృష్ణునివలె ఆనందమయ జీవితముగాదు. ఆతడు నవ్వు చుండ యీతడేడ్చుచుండును. ఇట్టివింతవిమర్శలీయనకు ఆపా దింపబడినవి.

చేజిక్కిన రాజ్యమును రాముడొదలకొనెనా?

నిజమైన రాజనదగువాడు రాముడే యని చెప్పదగును
ప్రజల సౌఖ్యమునకు పాటుపడువాడే రాజు. కానీ తన స్వంత
సౌఖ్యమును జూచుకొనువాడు మాత్రముగాదు. ప్రజలకాదర్శముగ
నుండువారే పెద్దలనబడుదురు. రాజవంశీయులు అట్లు దేశమునకు
నాయకులవలె నడచుకొనుట ధర్మము. నాయకుడనగా జనులకు
మంచి నడవడికను తానాచరించి చూపువాడని చెప్పదగును. ప్రజల
సుఖమును జూచువాడే ప్రభువు. ప్రజాసౌఖ్యమునకై తన సౌఖ్య
మును వీడువాడే ప్రభువు అను విషయమెల్లరికిని విదితమే. ఇట్టిది
రామునిమతము. అందుచే రామరాజ్యము వంటి రాజ్యము
కావలెనని భువిలో గోరుచుందురు. అంతేగాని కృష్ణునివంటి పాల
నను గోరుటలేదు. నేనేదేవుడనని చెప్పినవాడు కృష్ణుడు కాగా.
తాను మానవుడేనని భావించినవాడు రాముడు రాముడేకపత్నీవ్రతుడు.
కృష్ణుడు బహుపత్నీవ్రతుడయ్యును బహురూపముల ప్రత్యక్షమగు
వాడు. అయితే అద్భుతముల జేసి జూపి తాను దేవుడనని ఋజువు
చేసుకొనినవాడు కృష్ణుడు. రాముడు నరునివలె అమాయకునిగా
నున్నను ఆయనలోని గొప్పదనమును మునులచే కీర్తింప జేసు
కొనెను. వీరిరువురిలో ఒక్క సామ్యము మాత్రము గలదు.
దేవతలగు పాండవుల ప్రక్క జేరి రాక్షసులగు కౌరవుల హతమార్చిన
వాడు కృష్ణుడు. దేవతలగు వానరులపై నుండి రాక్షసులగు రావణా
దుల జంపినవాడు రాముడు. ఉభయుల యుద్దేశ్యములు రాక్ష

సుల బారినుండి దేవతలను రక్షించుటయే. అన్యాయమును అణగ ద్రొక్కి న్యాయమును గాపాడుటయె. ఉభయుల నాటకములు వేరుగ గాన్పించినను అంత్యములో సామ్యము గోచరించు చున్నది. పదివేలమంది ప్రజల విమర్శలను పెడచెవినిబెట్టి కఠిన చిత్తులై పదవులను విడక పట్టుకొని వ్రేలాడువారు మన నాయ కులు. ఒక్క రజకుని విమర్శకు తట్టుకోలేనివాడు కరుణా మయుడు రాముడు.

ప్రజలందరు రాముని అడవికి పోవలదని ప్రార్థించినను వారికోరికను మన్నించక పినతల్లి ఆజ్ఞమేరకు అడవి కేగినవాడు రాముడు. ఇది ప్రజాస్వామ్యపాలనకు విరుద్ధముగదా యని కొందరు విమర్శింతురు. ఇది అర్థరహితము. ఇచ్చట ప్రజల కోర్కెను రాముడు మన్నించవలయునా? లేక తనధర్మాచరణము నకు ప్రాధాన్యమీయవలయునా యని యాలోచించిన రాముడు పితృ వాక్యపాలనకై అడవులకేగుటయే ధర్మమగునని దెలియును. ప్రజలజ్ఞానులు. ధర్మశాస్త్రరహస్యములెరుంగజాలరు. అట్టియెడ మూకబలమును చూచుకొని రాముడు తనవిజ్ఞానమును నీటద్రోసి ధర్మశాస్త్రవిరుద్ధముగ నడచుకొనవలసినదేనా? ప్రజల కష్టసమ యములందు వారి కనుగుణ్యముగా ప్రభువు నడచుకొనుట న్యాయమేగాని తన కుటుంబ విషయమునందు తన వ్యక్తి ధర్మ మును ఆచరించి తన శీలమును ప్రభువు కాపాడు కొనవలదా? గనుక యిది రాముని వ్యక్తిగత విషయమేగాని ప్రజాసంబంధ

మైనది గాదని గ్రహించవలయును. అజ్ఞానులగు ప్రజలకు సక్రమమార్గమును బోధించి వారిని వక్రమార్గమునుండి త్రిప్ప గలిగినవాడే ప్రజానాయకుడనబడును. ప్రజల అరుపులకు ప్రక్క తాళము గొట్టుచు ఎక్కువ ఓట్లను లెక్కజూచుకొని యూరేగు వాడా ప్రజానాయకుడు. కైకకోరికను ధిక్కరించి నిండుసభలో దశరథుడు ప్రకటించిన రాజ్యాభిషేకమునకే ప్రాధాన్యమీయవల యునని లక్ష్మణుడే రామునికి చెప్పియుండెను. నిస్వార్థుడగు రాముడు పరబుద్ధికి లోబడక స్వబుద్ధిని యాలోచించి తండ్రి కపాపదు రాకుండు విధమును రాముడాచరించెను. ఇట్లు తానడవికేగి నందున ప్రజలకు రారాని యిబ్బందులేమియు రాబోవుటలేదుగదా యని రాముడాలోచించెను. లక్ష్మణుడు బోధించినది ప్రజలు అడ్డు పడినది కుటిలరాజనీతిని యాచరించు స్వార్థపరులకు మాత్రమే యుపయోగము. రావణ దుర్యోధనాదులకు అట్టి సలహాలు యోగ్యములగునేగాని రామునివంటి వారికట్టి యుపాయములు పట్టవు.

ఒకవేళ రాముడ్డే గనుక అప్పుడు రాజ్యమాసించియుండిన భరతుని భక్తి రాముని యెడ విరక్తిగామారి యుండెడిది. భ్రాతృ ప్రేమ భాగపంపకములకు దారితీసియుండెడిది. ప్రజలు ప్రభువులపై తిరుగబడి యుండెడివారు. ఇట్టి దూరదృష్టిగల రాముడు పాండవ కౌరవులవలె రాజ్యభాగ పంపకములకై పోరాటము రానివ్వకుండగ ముందుగనే తన త్యాగబుద్ధిని తెలివిగ ప్రదర్శించి

నాడు. రాజనీతియన యిట్టిదేగాని సర్వనాశనము చేసుకొనునట్టిది గాదుగదా! రామునిపద్ధతికి విరుద్ధముగా నడచుకొనిన రావణుని గతి యే మయ్యెనో వారి సోదరుల అన్యోన్యత యెట్లు విపరీత మయ్యెనో లోకవిదితమేగదా!

రాముఁడు ధీరుడుగాడా?

ధీరుడు గనుకనే కైక కోరికను మన్నించి రాజ్యమును త్యజించెను. శత్రువుని క్షమించినవాడే ధీరుడు, శరణని వచ్చిన విభీషణుని వెంటనే లంకకు రాజు జేతునని ఆశీర్వదించెను. ఒకవేళ రావణుడొచ్చి శరణుజొచ్చిన ఆతనికయోధ్యనె యిచ్చెదననిపలికెను. ఇట్టివి గదా ధీరుని లక్షణములు. మరియు పరిశీలింప రాముని యుద్ధము సీతను రక్షించుటకేగాని లంకను పొందుటకు గాదని తెలియజేయును, తమ్ముడగు విభీషణుని తన్ని వెళ్ళగొట్టిన వాడు రావణుడు, తమ్ముడగు భరతునిచే తనపాదుకాలు మోయించు కొనిన వాడు రాముడు, వీరిరువురి చర్యలలోని వైరుధ్యమును గమనించిన రాముని గొప్పదనము గోచరించును, పెద్దల పలుకుల గైకొని పేరు వహించినవాడు రాముడు. అందులకు విరుద్ధముగ ప్రవర్తించి పతనమైనవాడు రావణుడు,

రాముడు సీతను శంకించెనా?

సీతను రాముడు ప్రేమించినటుల లోకములో మరొక పురుషుడు తనభార్యను ప్రేమించి యుండడని రామాయణము

దెలుపును. సీత సత్ప్రవర్తన రామునకు సువిదితము. అందు వలననే అరణ్యవాస కాలమందు సీతను పుట్టినింటకేగమనెనేగాని అత్తవారింటగూడ నుండమనలేదు. భర్త వెంట లేనపుడు భార్యకు అత్తవారింటిలో నుండు అస్వాతంత్రసు గూడా అయన గుర్తించెను. తనవెంట అరణ్యమునకు రావలదని యనిన భర్తతో సీత యిట్లనును. "నీవు మగవాడివనుకొని మా తండ్రి జనకుడు నన్ను నీకిచ్చి పెండ్లిచేసెనని నిష్ఠురమాడెను". అ దెబ్బకు రాముని బుర్ర గిర్రున తిరిగి సీత తనవెంట వచ్చుటకా మోదించెను. రాముడంతటి స్వాతంత్రత నివ్వబట్టి గదా అట్లు నిష్ఠురమాడగలిగినది. మాయలేడికై పోవలదని లక్ష్మణుడు వారించినను పోయిన రాముని విధమే సీతపై అయనకుగల మిక్కుటమగు ప్రేమకు నిదర్శనము. రావణుడపహరించిన సీతను వెదకుచు రాముడు సీతకై విలపించినట్లు వేరొక పురుషుడు దుగు లొంద డనుటలో అతిశయోక్తి యుండదేమో. భార్య చచ్చిన పిదప కర్మక్రియలు అయిన మరునాడే మరొక భార్యను గట్టుకొని మొదటిభార్యను మరచి పోవు యీ కాలపు వారా రాముని విమ ర్శించువారు?

తాను స్త్రీతను యవమానించిన చో ఇలువెడలగొట్టి తావింకొక భార్యను చేపట్టియుండెడివాడు మనమాదిరి. కానీ రాముడా మెను వాల్మీకాశ్రమము చెంత విడచి వచ్చినపుడెంత దుఃఖమనుభ

వించెనో చెప్పనలవిగాదు. పామరుడగు చాకలివానివలె ఎందరెందరట్టిఅపవాదును యనుకొనుచుండిరో యని ఆయన వేదన !ఆ యపవాదును పోగొట్టగలందులకు సీతను అడవికిబంపి అట్లు గలిగిన వియోగమున కెంతయో రాముడు దిగులొందెను. రావణవధానంతరము సీతారాములు పదివేలయేండ్లు సుఖముగ కాపురమొనరించిరి. పిదపనే చాకలివానిమాట వినబడినది. అట్టి సీతపై రామునకు శంకలేదని ఘట్టిగ చెప్పవచ్చును. మున్యాశ్రమ ప్రాంతమున సీతను ఉంచి రమ్మటనుయే సీతను కష్టపెట్టు తలంపు రామునకు లేదని గ్రహింపజేయును. తనవలన లాభము పొందిన మునులామెను చేరదీసి కాపాడగలరను సంగతి రామున కెరుకయే. ఒకవేళ ఆమెను పుట్టింటికంపగూడదాయని తలంచుచో ఆపనిందతో జనకుడామెను రానిచ్చునా? లేనిచో సీతనయోధ్యలోనుంచి తానే అడవికి పోవలయును, అట్లయిన రాజ్యమరాచకమగును.

ప్రత్యక్షపు పొగడ్తలకంటెను పరోక్షపు నిందలే యథార్థములని గుర్తెరింగిన రాజనీతి పారంగతుడు రాముడుదప్ప అన్యుడు లేడు. తాను సుఖించుచూ భార్యను కష్టపెట్టిన చర్యను విమర్శింపదగునే గాని ఉభయులు వియోగబాధనొందిన చర్యల విమర్శింపరాదు. అరణ్యవాసపు పదునాలుగేండ్లును భార్యాభర్త లిరువురొక్కచో నుండియూ బ్రహ్మచర్యమును పాటించిన ఇంద్రియనిగ్రహపరులగ సీతారాముల నిష్కామ దాంపత్య ప్రేమను,

తుచ్ఛమగు కామవాంఛతో విచ్చలవిడిగా రచ్చల జరుగు
యీనాటి కపట ప్రేమికులా విమర్శించునది? ప్రజలను మరచిం
తమ యానందమే ప్రధానముగ ప్రవర్తించిన ఫ్రాన్సు దేశపు
పాలకులగు పదునారవలూయీ ఆయన అందాలరాణి మేరియా
ఆంటి యోనెట్ చివరకు గిల్లిటన్ యంత్రమున ఉరిదీయబడిరని
మనకుచరిత్ర దెలుపుచున్నది గదా! సీతారాముల చరిత్రను వారు
చదివియుండెనచో వారికాగతి పట్టియుండెడిది గాదు" దా! యనియ
నిపించును. పూర్వపు గ్రంధములు కధలు మనుజుల ప్రవర్తన
లవలన ఫలితము నిట్లుండును అని ప్రజలకు ధీరోదాత్తానాయకుల
చరిత్రలద్వారా మంచి బోధనము గావించినవి. ఈనాడందులకు
విరుద్ధముగ యదార్ధ కవితయను పేరుతో ప్రపంచమిట్లున్నదని
దెల్పుచూ ప్రజల చరిత్రలు ప్రచురణగావింప బడుచున్నవి. రాచ
రికపుపాలనలో రాజుల చరిత్రలు స్వామ్యపాలనలో ప్రజల చరి
త్రలు ప్రాముఖ్యమునకొచ్చినవని యనిపించును పూర్వకధలు
రాముని కధ, కృష్ణునికధ వంటివి. నేటివి ప్రతిమనిషిది ఒక్కొక్క
కథయే, ఇది ఈనాటి సాహిత్యపు మార్పు ఇట్టి మార్పుతో ఈ
నాడు రావణు డెంతమంచివాడని ప్రచారము గావించిననూ ఐదు
వేల మందికిభర్త ఆయిన రావణుని స్త్రీలు మన్నించరని యెల్లి
రకు దెలియును. ఏకపత్నివ్రతుడగు రాముడు సర్వదా పూజ్యుడని
లోకవిదితమగు విషయము. అయితే కృష్ణునకు పదునారు వేల
మంది లేరాయని ప్రశ్నవచ్చును. పదునారువేల గోపికలవద్ధ

పదునారువేల కృష్ణున్కు ప్రత్యక్షమైరి. కాని రావణుడొక్కడు భార్యలు అయిదువేలు, వారితో ఎల్లవేళల కాపురమొనరించెనా? అదియునూ లేదు, "సీతా ఇంతకు ముందుగల నా భార్యలు నీకాలి గోటికి బోలరని రావణుడు పలికిన పలుకులే ఆ మన సంసార బండారమును బయటవేయుచున్నవి. రావణుని దుశ్చర్యలను రావణుని భార్యలే సీతకు దెల్పియుండిరి. అట్టి రావణునిలాంటి భర్తల నీనాటి స్త్రీలైనను గోరుదురా? శూర్పణఖలాంటి స్థిరనిర్ణయములేని సతుల నీనాటి పురుషులు వాంఛింతురా! ఒకవేళ అట్లు వాంఛించి లోకములోని పురుషులందరు రావణ కుంభకర్ణ దుర్యోధన దుశ్శాసన శకుని సైంధవ కీచక జరాసంధ శిశుపాల కంసులే యగుచో స్త్రీలందరు తాటకి మంధర, కైక, శూర్పణఖ పూతన లంఖిణులే యగుచో అట్టి ప్రపంచ మెంత నీచమైన యలంకార అందములతో గూడి యుండునో వూహించుడు మీకే గోచరించును.

వాలివధ యక్రమమా;

శ్రీరాముడు బయలుదేరినది అరణ్యవాసము చేయుటకే గాని దిగ్విజయ యాత్రకు గాదు, సైన్యసమేతముగా పోలేదు. అడవిలో సీతను పోగొట్టుకొనిన వాడై అమెను వెదకుచు వెళ్ళినాడు. దైవవశమున వానరుల కంట బడిరి. సుగ్రీవు నాజ్ఞతో హనుమంతుడు రామలక్ష్మణులనొద్దగేగి వారి వివరమెఱింగి తమ సంగతి చెప్పి వారల సుగ్రీవునొద్దకు తీసుకొని పోయెను, ఉభయులు

ఒకరి చరిత్ర మరొకరు ఎరింగించుకొనిరి. రాముని బలమును సుగ్రీవుడు పరీక్షించెను. అగ్నిసాక్షిగా స్నేహమేర్పరచుకొనిరి. రాముడు స్నేహితునకు సాయము చేయవలసివచ్చెను. వాలిని వధించి తనభార్య రుమను సుగ్రీవునకు ముందు అప్పగించిననేగాని సుగ్రీవాదులు సీతాన్వేషణకు నిర్భయముగా బయలుదేరజాలరు. వాలిని జయించలేక ఋష్యమూక పర్వతముపైకి శాపకారణమున వాలిరాలేడు గాన, అచట సుగ్రీవాదులు దాగియుండిరి. శరణని స్నేహముగోరిన వారికి సాయము చేయకుండుటెట్లు! అందుచే బలవంతుడైన వాలిని ఏదో యొక యుపాయమున వధించవలయును. కార్యసాధకుడు తానునుకొనిన అసలుకార్య పర్యవసానమును గురించి యాలోచించునుగాని నడుమ నడుమ సంభవించు అడ్డుఆటంకములతో ధర్మాధర్మ విచక్షణ జేయుచూ కాలయాపన జేయజాలడు. ఇట్టి ధర్మసూక్ష్మమును ప్రథమ కార్యమగు తాటకి వధయందే విశ్వామిత్రుడు రామునకు బోధించియుండెను. అడుగడుగునకు ఆలోచన యారంభించినచో ఆతడు అడుగుదీసి అడుగువేయజాలడు. ఇట్టిపద్ధతి ఉత్తమ రాజధర్మముగానట్టిది. అట్టి యుపాయముల యుద్ధమందాచరింపనిచో వాలి గెలిచియుండెడివాడేమో? అపుడు రాముని పరిస్థితిని వూహించిన అదొక విషాదాంతనాటకమై యుండును.

వాలి సుగ్రీవుని వధించును. రామలక్ష్మణుల బందిఖాలోనా నుంచును. సీతకై లంకకేగును. రావణుడు వాలిదెబ్బకు భయపడి

సీతను యిచ్చును, పరస్త్రీల ననుభవించుటలో రావణుడు వాలి స్నేహములు గావించుకొనియుండిరి, సీతననుభవించుటకు రావణునకనేక శాపములుగలవు, వాలికట్టివేమియునులేవు. ఒకవేళ సీత వాలితో కలియుట కిచ్చగింపనిచో చచ్చియుండును. తోడనే సీతకై విలపించి రామలక్ష్మణులు జచ్చియుందురు, ఇట్టి తెలివితక్కువ పనిని రాముడొనరించునా? వాలి ధీరుడు. రాముడే భీరుడని యనుకొందమా? అట్లనుకొనవీలులేదు. ముందుగనే సుగ్రీవుడు పరీక్షించి రాముడు వాలిని మించిన వాడను నమ్మకము కుదిరిన పిదపనేగదా, యుద్ధమునకు మరల సుగ్రీవుడు వాలిపైకి పోయినది? గనుక చెట్టుచాటున నుండి కొట్టినంతమాత్రమున వాలి బలశాలి, రాముడు బలహీనుడని పల్కుట సమంజసముగాదు, వాలికి వానర సైన్యముగలదు. రాముడు సైన్యరహితుడు. సుగ్రీవునివద్ద సైన్యములేదు. కిష్కింధాప్రాంతము వానరులకు పరిచయము. రామునకు క్రొత్త. వారిబలాబలములు పరీక్షసేయుచూ కాలయాపన గావించుకొనుచున్న సీతగతి యేమగునో యని దిగులుండుట రామునకు సహజము. వాలి సుగ్రీవుల చరిత్ర ముందుగనే తెలుసుకొని వాలిచర్య అక్రమమని రాముడు నిర్ణయించుకొనెను. అధర్మముగ తమ్ముని భార్యను గైకొనిన వాడు క్రూరమృగముతో సమానము. క్రూరమృగములను చాటుననుండి గొట్టుటయే ధర్మము. అట్టి ధర్మసంస్థాపన చేయుటయే రాజుల లక్ష్యము. అధర్మప్రవర్తకులను అధర్మముగా జంపినను ధర్మమేయగును.

రాముడొకవేళ తనభార్యను సంపాదించుకొనుటకై వానర సహాయము పొందదలచి అట్లు అక్రమము సాగించెననుకొందమా? సుగ్రీవుడు ముందుగనే వాలి మహాబలవంతుడని రామునకు చెప్పి యుండెగాన రాముడు స్వార్థపరుడగుచో సుగ్రీవుని విడచి వాలి ప్రక్కకేగి సులభముగా రావణుని జయించి తన కార్యమును నెరవేర్చుకొని యుండెడివాడు, కానీ రాముడట్లు చేయలేదుగనుక వాలిని మించినవాడే రాముడని మనము గ్రహించవలయును, బలవంతుల సాయమునకెప్పుడును రాముడగు వీరుడు ప్రాధేయపడడుగదా। అట్లు వాలిని ప్రార్థించినచో యిక రాముని గొప్పతనమేమున్నది। ఇట్లే కృష్ణునితో అర్జునుడు గూడా పలికెను, నేను యుద్ధము చేయను బుద్ధికిదోచిన సాయముచేసెదననగా "నీవు యుద్ధమొనరించిన నాకు వీరుడను పేరెట్లువచ్చును. గనుక నీవా యుధమును ధరింపవలదు, మాపక్షమున నున్నజాలునని కిరీటి కృష్ణునితో ననెను, వీరులు ఇట్లితరుల సాయమపేక్షింపరు, రాముడు ముందు సుగ్రీవునకు సాయమొనరించి పిదప వారి సాయమును బొందెనేగాని తాను ముందుగా సాయమపేక్షించలేదు. గనుక రాముడితరులకు సాయముజేయువాడేగాని సాయముకోరువాడుగాడు.

సుగ్రీవునకేవరో సాయము వచ్చిరి, లేనిచో మరల ధైర్యముగా సుగ్రీవుడు యుద్ధమునకు రాడు. గనుక యుద్ధమునకు పోవలదని చెప్పు భార్యయగు తార మాటలు తిరస్కరించుట వాలిది తప్పు, తమ్ముని భార్యను గైకొనుట వాలిది మరియొక తప్పు,

సుగ్రీవునకు సహాయమొచ్చిన వారెట్టిధీరులో వారితో తమతగాదా సంగతి చెప్పుకొందము, పెద్దల సలహా విందము, సోదరుల మన్యోన్యముగ నుందమను భావన లేక బలగర్వముచే పరధనాపహరణము పరస్త్రీల వ్యామోహము గల వాలిని అక్రమముగ వధించుటయూ సక్రమమనియే తలంపవలయును.

అన్నభార్యను తారను గ్రహించుట ధర్మవిరుదము, అన్న భార్య తల్లిలో సమానముగదా! యనికొందరు సుగ్రీవుని విమర్శింతురు. తమ్ముని భార్య బిడ్డతో సమానమని తలంచక అట్టిఋమను గైకొనుట వాలిదిమాత్రము తప్పుగదా! పిన్నలకు మార్గదర్శకులుగ నుండదగు పెద్దలు తప్పిదమొనరించినచో అట్టినేరము పిన్నలొనరించిన దానికన్నను మిన్నయగును. గనుక వాలిదే పెద్దనేరము, మరియు పతి పరోక్షమున తారను గైకొనినవాడు సుగ్రీవుడు, పతి సమక్షమున ఋమను చేపట్టినవాడు వాలి. గనుక వీరిరువురిలో వాలిదే పెద్దనేరమని విదితమగుచున్నది. మరియు తార అయోనిజ, రుమయోనిజ, యోనిజులవలె అయోనిజులకు సంగమ దోషము లేదుగదా!

అన్నదమ్ముల యన్యోన్యము

అన్న దమ్ముల యొద్దికకాదర్శ పురుషులు దశరథుని పుత్రులు దప్ప అన్యులులేరని చెప్పవచ్చును. పాండవ సోదరులప్పు

డప్పుడు క్రుద్ధులైనప్పుడు ధర్మరాజు నెదిరించుటగలదు. కానీ దశరథపుత్రు లెప్పుడును అగ్రజునెదిరించుట గానరాదు. అయితే అన్నను మించిన సోదరులు ధర్మజునకు లోబడుటలోగల గొప్ప దనము రాముని సోదరుల విధేయతకంటే మిక్కుటముగ నెన్న దగినదని ఒకవాదముగలదు. ఇందుకు మనమొక విషయమును గమనించవలయును. రాజ్యార్హుడు జ్యేష్ఠుడు గనుక ఇచట రాముడు అచట ధర్మజుడు రాజ్యార్హులు. పాండవులు బలవంతు లైనంత మాత్రముననే ప్రయోజనమేమున్నది? రాజ్యమును ముక్కలు జేయుటకు ప్రజలామోదించరుగదా? వంశపారంపర్య ముగా పుత్రులు మనుమలు రాజ్యమును భాగించుకొనుచూ పోయి నచో చిట్టచివరకు ఒకఊరి కొక్కొక్కరాజు తయారగునుగదా? అట్లని పెద్దవానినే రాజుగచేయుచుండిన అతడు దుర్మార్గుడగుచో ప్రజలు సహింపరుగదా। దుర్యోధనాదులు దుర్మార్గులు గనుకనే పెద్దలు పాండవ పక్షము వహించవలసి వచ్చినది। ఈ చట్టము లన్నియు పరిశీలించియే ధర్మరాజు చాకచక్యముగా తీర్పును పెద్ద లకే వదలినాడు. తాను యుద్ధమును వలదనినాడు. అందుచే రాజ్య మేలుటకు తనకధికారము లేక పోయిననూ పెద్దల తీర్పువలన ప్రజలకోర్కె ననుసరించి అధర్మము నిరంకుశము నశించినపిదప రాజ్యలక్ష్మి ధర్మజుని వలచినది. ఇట్లు రాజ్యమునకర్హుడు పెద్ద వాడని తెలిసియే రాముని సోదరులు తమ అధికారమును గ్రహిం యించి అన్నకు విధేయులైరి. పాండవ సోదరులట్లుగాక తమ అధి

కారణమును గ్రహించజాలక బలగర్వముచే ఆవేశులై అప్పుడప్పుడు అన్నను ధిక్కరించి మరల తమతప్పు తామెరుంగుచూ మదించిన ఏనుగులు మావటివానికి లోబడినట్లు లోబడియుండిరి,

రాజులకు శారీరక బలముకంటె మానసిక బలము ప్రజా బలము ముఖ్యావసరము, అందుచే ధర్మజుడు తమ్ములకన్ననూ బల వంతుడనియే చెప్పవలయును. ఏది యెట్లైననూ తమ తాహ తును గుర్తెరింగి ప్రవర్తించువారే యుత్తములనబడుదురు. ఇట్టి పరిశీలనలో జూచిన త్రేతాయుగమునకు దశరధపుత్రులు ద్వాపర యుగమునకు పాండవసోదరులు ఆదర్శప్రాయులేనని చెప్పవల యును. ఎంతటి వీరుడయినను కాలమున కెదురీదజాలడు. యుగ ధర్మమునను సరించి ధర్మమొకపాదము క్రమముగా తగ్గుచుండును. గాన పాండవసోదరులు యుగధర్మముననుసరించి యుద్రుక్తు లగుట జరిగినదని మనమూహింపవలయును.

శూర్పణఖను పరాభవించుట యక్రమమా?

శూర్పణఖ అందమైన స్త్రీ వేషమునవచ్చి రాముని ప్రేమిం చినది. హాయిగా ఆనందముగా స్త్రీతో క్రీడించవలసిన రాముడు ఆడదాని ముక్కుచెవులు గోయుట అన్యాయమని కొందరివాదము. అది పెద్ద తప్పిదమా? ఆయన తండ్రి పలువుర భార్యలతో కాపురమొనరింపలేదా యని యందురు. ఇది సద్విమర్శకాదు.

భర్త విద్యుజ్జిహ్వుడు చనిపోయెను. తపస్సుచేయు తనకుమారు నికి ఆహారము తెచ్చిన శూర్పణఖ, లక్ష్మణుడు ఖడ్గమును తెలియక విసరగా ఎదురు పొదలో నున్న తనకొడుకు తలతెగి చనిపోయెను. భర్తపోయిన విధవ పుత్రుడు గతించెనని చింతించవలసిన శూర్ప ణఖ రాముని అందమును గాంచి వరించుటయా? కాదుపొమ్మనిన లక్ష్మణునొద్దకు బోవుటయా? అతడు వలదనిన మరల రాము నొద్దకువచ్చుటయా? ఇట్టు వచ్చినదానిని వ్యభిచారిని రాముడు చేర దీయవలయునా? ఈనాటక మంతయు గాంచుచున్న సీత: ఒకవేళ రాముడు రాక్షసిని చేరదీసినచో ఏమనుకొనును? భర్త ప్రవర్తన భార్యకు ఆదర్శముగ నుండవలయును గదా సీతనుగూడ శూర్ప ణఖ వలె నడచుకొనమని బోధించుటనేయేనుగదా! రాముడు రాక్షసిని చేరదీసినచో, పలువుర భార్యలతో పడుచున్న తండ్రి బాధలు రాముడు ప్రత్యక్షముగచూచియే యున్నాడు, అందుచేతనేఅత డేకపత్నీవ్రతుడైనాడేమో. ఉభయులకట్టి దాంపత్యములోనే నిష్క ళంక నిరుపమాన యానందము గలదని రాముడు గ్రహించినాడు భర్త చావును పుత్రమరణమును విస్మరించి పశువువలె పరపురుషుని గోరు స్త్రీని ముక్కుచెవులు గోయుట తప్పుఅని యే స్త్రీగూడా చెప్పజాలదు, రాముడు భూతదయ గలవాడు గనుగనే దానిని సంహరించక అవమానము మాత్రమే చేసి పంపినాడు. గనుక స్త్రీజాతియందు రామునికి లేని గౌరవము మరొక మానవునికుండ దని చెప్పుటలో అనుమానమేలేదు.

విభీషణుడు రామునికి సాయముచేసెనా?

రావణ వధోపాయమునకై విభీషణుడు రామునకు సాయము జేసెనట. లంకలోని రహస్యములు తెలియ జేయుట రావణుని నాభియందలి అమృతభాండ మర్మము నెరింగించుట మొదలైనవి విభీషణుని సహాయములు ఈ సహాయములు లేనిచో రావణుని రాముడు గెలువలేడట, అసలు విభీషణుని తన వైపు రమ్మని రాముడాహ్వానించెనా? అతడట్లొచ్చునని రాముడు ముందుగ గుర్తెరింగెనా? రావణుని యనేకసార్లు జయించినవాలినే యుపాయముచే చంపగలిన రాముడు రావణుని జంపజాలడా? ఖర దూషణ త్రిశిరాది రాక్షసుల పదునాలుగు వేల మందిని ఒక ముహూర్త కాలములో సంహరించినపుడు రామునికెవ్వరైననూ యుపాయములు చెప్పిరా? లంకలోని సర్వమును పరిశీలించి వచ్చిన ఆంజనేయుడుండ రామునికితరుల సాయమెందులకు? రాముడు మందితరులకు సాయముచేయువాడేగాని తాను సాయము గోరువాడుగాదు. రామునికుదాహరణము [illegible] నేటి తిరుపతి వెంకటేశ్వరస్వామినే జూపవచ్చును. భక్తులనుండి గైకొనిన సొమ్మును భక్తులకే వినియోగించును. తాను భుజించుట లేదుగదా! తనతో స్నేహమును గోరిన సుగ్రీవునకు పట్టాభిషేకము జేసెను. తనను శరణన్న విభీషణునకు తోడనే లంకారాజ్యమొసంగెను. అక్రమ ప్రవర్తకులకు బుద్ధిచెప్పెను. ఇట్టి రాముని విమర్శించుటేమిటి? వానరుల సహాయము [illegible]

రావణుని గెలువగలడనుటకనేక యుదాహరణల జూపవచ్చును. ఆయన, అంతకు పూర్వమొనరించిన ఘనకార్యములందాతని కితరుల సహాయము లేకపోవుటయే గమనింపదగినది.

రామునిది దిగులు జీవితమా ?

రాముడెల్లప్పుడు దిగులుతోనుండెను, సీతకై దుఃఖించెను కానీ కృష్ణుడెల్లవ్వుడును ఆనందములో జీవితము గడిపెను. గనుక కృష్ణపాత్రయే మంచిదని రామునిపాత్రను విమర్శించుచుందురు. ఈ విమర్శ సబబుగాదు. రెండు విభిన్నపాత్రలను పోల్చుకొనిన సరియగు సమాధానము దొరకదు. శ్రేష్టమగు గుణములు రెండు. శాంతము సౌఖ్యము. శాంతమును రాముడు కోరుకొనెను, కృష్ణుడు సౌఖ్యము ననుభవించెను, సౌఖ్యము ఆనందమును కలుగజేయును. ఆనందములో కష్టములంతర్గతమై యుండును. అట్టి కష్టములను కృష్ణుడు చిరునవ్వుతో భరించెను. రాముడు తన కష్టములలోని దుఃఖమును బహిర్గతమొనరించెను. అయితే రాముడు తాను మానవుడనని యే తలంచెను. తానే దేవుడనని కృష్ణుడు వెల్లడించెను. గాన కృష్ణుడు తన కష్టములకు తాను దుఃఖమొందినటుల వెల్లడించలేదు. కృష్ణునకనేక కష్టములు కలిగెను. రామునకొచ్చిన కష్టమొక్కటియే. ఆ వొక్కటియైనను మిక్కుటమైనదే. అదియే భార్యా వియోగము.

కృష్ణుడు పుట్టినప్పటినుండియు కంసుడాయనను చంపుటకనేక ప్రయత్నములు చేసెను. అట్టి కష్టములన్నియును తొలగించుకొని గట్టెక్కిన పసిబాలుడగు కృష్ణమూర్తి విష్ణుమూర్తియే.

పరుల రక్షణకై కృష్ణుడు బాధపడెను. రాముడు స్వకుటుంబ విష యమై చింతనొందెను. కృష్ణునివలె మనకు భోగములపై ఆశ యుండుట సహజము. కానీ ఆయనవడిన పాట్లు, భరించిన యిక్కట్లు మనము భరింపజాలము. గనుక మిక్కిలి కష్టములతో గూడుకొనిన అతి సౌఖ్యమునకంటే మితమగు కష్టములతో గూడిన శాంతమే శ్రేయోదాయకమని విష్ణుమూర్తియగు రాముడు తానను భవించుట ద్వారా లోకమునకు బోధించెను. అట్టిబోధయే శాశ్వతము, అందువలనే రామాయణము ఆచంద్రార్కము, స్థిరము. మనబోధన లట్టివికావు. తలంచున దొకటి చెప్పునది మరొకటి! చేయునదింకొకటి. అందుచే మానవుల చరిత్రలు అస్థిరములు. దేవతల చరిత్రలు స్థిరములు.

కైక

శ్రీరాముడు విష్ణువను సంగతి కైక ఎరింగియే రామపట్టాభి షేకమును భగ్నమొనర్చి రాముని అడవుల కంపినదని యొక క్రొత్తవాదము యిటీవల బయలుదేరినది. రాముని గొప్పతనము కైకకు విశ్వామిత్రునికి మాత్రమే దెలియునట.

విశ్వామిత్రుడనినచో, ఋషీశ్వరుడు దివ్యదృష్టి గలవాడు. వసిష్ఠునితో సమానుడు. సృష్టికి ప్రతిసృష్టి గావించినవాడు. అట్టి వానితో కైకను బోల్చుట ఎట్లు సరిపడునో అనూహ్యము. కైక కాకవేళ రాముడు విష్ణువేయని తెలిసియుండినచో తానే ముందుగా

దశరథునితో రామునికి పట్టాభిషేకమొనరించండి. అని చెప్ప
వచ్చునుగదా! అట్లు చెప్పియుండినచో దశరథుడు కైకను అనుమా
నించి యుండెడివాడు గాడుగదా! కైక, మంధర దుర్బోధనలు విన
వలసిన దుస్థితి సంభవించి యుండదుగదా! దశరథుని మరణము
ప్రాప్తించియుండదుగదా! భరతుడు పదునాలుగేండ్లు నందిగ్రామ
ములో ప్రజల కంటబడకుండ దొంగచాటుగ బ్రతుకవలసిన కష్ట
దశ వచ్చియుండదుగదా! రాబోవు విషయము నెరింగియున్న
వ్యక్తులు భవిష్యత్తులో కష్టములపాలు గాకుండ ప్రయత్నించ వల
యునుగదా! మరికైక అట్లు చేయలేదేమి? కైక కారణమున,
రాముని పరిపాలనను దశరథుడొక్క నాడైనను గాంచలేక
పోయెను. ఒకవేళ రాముడు విష్ణువను సంగతి కైకయెరింగి
యున్నచో భరతుని తిట్లకు మరల కైక మూరుట యెందులకు?
తాను జేసిన పని సబబైనదేనని భరతునికి చెప్పి యొప్పించ
వచ్చునుగదా? భరతుని వెంట తాసుగూడ అడవికేగి రాముని తిరిగి
అయోధ్యకు రమ్మనుటేమిటి? తాను తప్పొనరించితినని రాముని
ముందొప్పుకొనుటెందులకు? మరియు అడవులకేగు రామునికి నార
బట్టలిచ్చుటెందులకో? విష్ణువు కైకకేమైన అపకారము జేసెను
గాబోలు! భగవంతుని కష్టములకు జూచి భక్తులు బాధనొందుట
ధర్మము. అట్లు రామునికై భరతుడు చింతించెను. మిగత యెల్లరు
వగచిరి, కైకమాత్రమే కఠినముగా వర్తించినది, వసిష్ఠుడుగూడ
కైకను నిందించెను. కౌసల్య విచారించెను, సుమిత్ర శాంతచిత్త
రాలుగ నుండెను. దశరథుడు విలపించెను. వీరందరిది ఒక పద్ధతి.

ఆమెది మాత్రమింకొకపద్ధతి. విశ్వామిత్రుడు రాముని గొనిపోవు నపుడు యిట్టి ఏడుపులు లేవుగదా! గనుక కైకను విశ్వామిత్రునితో పోల్చరాదు. కైకనుగూడ మంచిపాత్రగ చిత్రించినచో విమర్శకుగల విలువయే అంతరించినట్లగును.

పురాణములు బూజుపట్టినవా?

పండుగనాడుగూడ పాతమొగుడేనా యనినట్లు నిత్యనూతనమును గోరు నేటి నాగరికులకు పురాణములు బూజుపట్టినట్లు గన్పించు చున్నవిగాబోలు?

ముక్తినిగోరువానికి భూలోకముతో నిమిత్తము లేదుగదా! అట్టిభక్తుల కేమతమైనను ఒక్కటే. ఇహలోకముతో నెక్కువ సంబంధముగల దొంగభక్తులకే మతప్రచారము లెక్కువ యీనాడు, ఇంతకూ అట్టి ప్రచార సారాంశమేమన, తనది మంచిది పరులది చెడ్డది తనది నిజము ఇతరుల దబద్ధము.

సృష్టి ఏకత్వమునుండి భిన్నత్వముగమారి వికసించుచున్నది. ఆ భిన్నత్వములో ఏకత్వము అంతర్గతమై యున్నది. భిన్నత్వములో గల చిత్రవిచిత్రమౌ లగు భిన్నరూపముల భిన్నగుణముల నలరారు సృష్టియొక్క అనంతమౌగు సౌందర్యమును గాంచి సమదృష్టితో స్వీకరించలేని ఆధునికుడు తనస్వార్థము ఈర్ష్యయను దుష్టశక్తుల ప్రాబల్యమున సృష్టినంతటిని ఏకరూపముగ మార్ప యత్నించుచున్నాడు. ఇది సృష్టికి వ్యతిరేకమగుభావన, ప్రపంచ

మున కంతయు ఒకేజాతి ఒకేభాష ఒకేమతము ఒకేకులము ఒకే గుణము గలిగి యుండుట ప్రకృతికి విరుద్ధమగు విషయము. ప్రస్తుతమానవులకు కావలసినది భిన్నరీతులలో అంతర్గతమైయున్న సామ్యమును సాధుభావనతో సమదృష్టితో స్వీకరింపగలుగు సహన శక్తియే. అట్టి సహనశక్తి ఆధునిక హృదయమున పూర్తిగ లోపించియున్నది. అందుచేతనే యతడు విమర్శయను నాయుధము చేబూని పురాణములపై పూర్వీకముపై వీరవిహారము చేయు చున్నాడు. పురాణములందు బోధింపబడినది యీ సహనశీలమే యని మనమెరుగవలయును. మానవుడు సంఘజీవి, సంఘ ములో సుఖజీవనమునకు సహనశక్తి యవసరము, కాని నేటి విమ ర్శకుల వాదన స్వార్థపూరితమై పాక్షికముగా యున్నది తమకు నచ్చినదానిని నిజమందురు. నచ్చనిదానిని అబద్ధమందురు, తమ వాదన కనుకూలమగు దానిని గమనింతురు, ప్రతికూలమగుదానిని గమనింపరు, శూద్రులకు వేదపఠన నిషేధింపబడుట విమర్శిం తురేగాని శూద్రులతోపాటు అన్నిజాతుల స్త్రీలకును వేదపఠన నిషేధింపబడుటను గమనింపరు. బ్రాహ్మణు డగ్రగణ్యుడనుట విమర్శింతురేగాని ఆయనకు విధింపబడిన కఠోర నియమములు గమనింపరు. స్త్రీలకు పురాణములందు ప్రాధాన్యతలేదని విమర్శిం తురేగాని వారి రక్షణబాధ్యతను పురుషులు స్వీకరించుట రామ రావణ యుద్ధములందు, కురుక్షేత్రమునందు పురుషులుమాత్రమే చచ్చుట, స్త్రీలు హాయిగా గృహములందుండుట, అను విషయ

ములు గమనింపరు, బాధ్యతకు తగినట్లేగదా హక్కులు లభించు చునది.

పురాణములందు కులముల విభజన యున్నదని విమర్శింతురేగాని బ్రాహ్మణులు నాల్గుకులముల వారిని వివాహమాడుట, సీత ద్రౌపది స్వయంవరములందు కులప్రసక్తికి తావులేకుండుటను గమనింపరు. రెండవపక్షమును గమనించిన మొదటి పక్షము న్యాయమనియు యదార్థమనియు పురాణములు ప్రపంచమునకు ప్రతిబింబములనియు మనకు తప్పక దోచును, ప్రపంచమునకు ప్రతిబింబములగు పురాణములను బూజుపట్టినవని చెప్పుట సబబు గాదు.

బ్రాహ్మణులే పురాణములను వ్రాసుకొని తమకు అగ్రగణ్యత్వమును కల్పించుకొనిరని విమర్శింతుమేగాని పురాణకర్త లగు వ్యాసవాల్మీకులు బెస్త, బోయ కులములకు సంబంధమున్న వారని గుర్తించలేము, కులరాహిత్యమును గోరు వారు పురాణములే కారణములని విమర్శింతురు, అంతేగాని నేడు లోకమున గల వందలాది కులములు పురాణములందు లేవని గ్రహింపరు.

బోయవాడగు ఏకలవ్యునికి విద్యగరపలేదని బ్రాహ్మణుడగు ద్రోణుని విమర్శింతుముగాని అట్టిద్రోణుని ఏకలవ్యుడే విమర్శించలేదని మనము గమనించము. రాజులనుచంపిన బ్రాహ్మణుడగు పరశురాముని విమర్శింతుముగాని ఆయన శిష్యులందరును

రాజువేయను సంగతిని గమనించజాలము. సూతపుత్రుడగు కర్ణునికి విద్యగరపలేదని పరశురాముని విమర్శింతుమేగాని తండ్రియాజ్ఞ మీరక స్వంత తల్లినిగూడ తునిమిన ధర్మపద్ధతిని యాచరించిన ఆయన నిస్వార్థతను గుర్తింపలేము. పరశురాముడు కర్ణునికి విద్య గరపని కారణమును పూర్వము బ్రాహ్మణులు శూద్రులకు విద్య నేర్పలేదని విమర్శింతుమేగాని బ్రాహ్మణుడగు ద్రోణునికి శిష్యుడే కర్ణుడను సంగతిని గమనింపలేము. రాజ్యవిహీనుడు బాలుడగు కర్ణుడు విలువిద్యాప్రదర్శనలో ప్రవేశించి కులనిషేధమును పనికి రాదని అర్జును నెదిరించి నిలిచిన సంగతిని ప్రశంసింతుమేగాని ఆ కర్ణుడే అంగరాజైన పిదప ద్రౌపదీ స్వయంవర సమయమున బ్రాహ్మణునికి రాచకన్య నివ్వరాదని రాజులకు నాయకుడై కుల వివక్షతను సమర్థింపుచు ద్రుపదుని మీదికి దుముకుటను గుర్తింప లేము. ఇట్టిది యీనాడు పురాణములపై వేయబడు వింత విమర్శ. పురాణకాలమునకు అనాటి పరిస్థితులకు పురాణములు సరియైనవే యథార్థములయినవే యని మనము చక్కంగ యూహించిన గోచ రింపను. ఈనాటి పరిస్థితులకవి విరుద్ధముగనే గన్పట్టి వచ్చును. సందొమ్మిదవ శతాబ్ది ఉత్తరభాగమునను ఇరువదియవ శతాబ్ది పూర్వ భాగమునకె దేశపరిస్థితులు తల్లక్రిందులుగ తారుమారై యుండ యిక పురాణకాలమునకు యిప్పటి కలికాలమునకు కెంతటి మార్పు జరిగి యుండునో వర్ణింప నశక్యము. కాలము మారినది. విజ్ఞాన శాస్త్రి మొచ్చినది. మంత్రయుగము పోయినది యంత్రయుగ

మానిర్ఛవించినది యని వాదించిన వాదించవచ్చునేమో గాని పురాణములబద్ధములని వాదించుట సమంజసమనిపించదు. పూర్వీకుల నజ్ఞానులని పల్కుట మనయజ్ఞానమునకు నిదర్శనమే కాగలదు. ఆధునికులు యంత్రవిషయములో గొప్పవారగుచో పూర్వీకులను మంత్రవిషయములో గొప్పవారని చెప్పక తప్పదు. దేవుళ్ళు దేవాలయము లెట్టివో పురాణములట్టివని తెలియనగును. భక్తి యనునది తన ముక్తికొరకేగాని కోరికల దీర్చు వ్యాపార కేంద్రమా? అట్టి ముక్తికి మార్గమును జూపు పురాణములు పుణ్యముల రాసులని వేరుగ జెప్పనవసరములేదు. అవి మనసు నిదానమునకు సాధనములు. నిత్యము పఠనీయములు, విమర్శకతీతములు.

ప్రస్తుతము కావలసినది పరమత సహనము. కులద్వేష రహితము. ఇట్టి నీతులెన్నో పురాణములందు గన్పట్టును. కాని తననుదిట్టు శిష్యునికి గురువేమి బోధింపగలడు? బ్రహ్మపాదముల నుండి శూద్రుడు ముఖమునుండి బ్రాహ్మణుడు పుట్టినారని పురాణములందు చెప్పుటను సమానత్వముగోరు నేటి నాగరికులు అట్టి విషయములన్నియును అబద్ధములనియు పక్షపాతములనియు పలుకుదురు. వారు పురాణములందలి యితర విచిత్రపు పుట్టుకల నన్నింటిని పరిశీలించినచో వారట్లు పురాణములను విమర్శింపరు.

సనకసనందనాదులు, సూర్యుడు, నవబ్రహ్మలు బ్రహ్మ ముఖమునుండి పుట్టిరి, బ్రహ్మ నేత్రమునుండి మరీచి, చెవులనుండి

అత్రి, శిరమునుండి అంగీరసుడు. బొటనవ్రేలి నుండి దక్షుడు, తొడనుండి నారదుడు. కంటి నీరు నుండి జాంబవంతుడు హృదయమునుండి భృగువు పుట్టిరి,

విష్ణువుయొక్క చెవులనుండి మధుకైటభులు, బొడ్డునుండి బ్రహ్మ. ఊరువునుండి ఊర్వశి, జన్మించిరి,

శివుని జటనుండి వీరభద్రుడు, భద్రకాళి, చెమట నుండి అంగారకుడు; కేకనుండి కాలభైరవుడు, యుద్భవించిరి. నంది భూమినుండి, శుకుడు అరణినుండి, యవనులు కామధేనువునుండి, ప్రమధ గణములు లింగములనుండి. కుమారస్వామి రెల్లు తుంగ నుండి, వల్లి అడవి మృగమునుండి. ఇక్ష్వాకుడు వైవస్వతుని ముక్కునుండి, మాంధాత యవనాశ్వుని డొక్కలోనుండి. వాలి ఋక్షరజుని తోకనుండి, సుగ్రీవుడు కంఠమునుండి, వసిష్ఠ అగస్త్యులు కుంభము నుండి, అశ్వనీదేవతలు గుఱ్ఱపు నాసికా రంధ్రములనుండి జన్మించిరి, ఈ పరిశీలన పురాణములు నిష్పక్షపాతములని దెలుపును,

వినయ బుద్ధితో పరిశీలించిన అసలు విషయము విశదమగును. కాని అహముతోచేయు వితండవాదమునకు జవాబు చెప్పుటకు ఆ బ్రహ్మదేవునికి గూడ అశక్యమేగదా! హిరణ్యకశిప హిరణ్యాక్ష రావణ కుంభకర్ణులు శిశుపాల దంతవక్త్రులుగూడ

యిస్లై విష్ణువుని విమర్శించి విమర్శించి తుదకు మాత్రమే యదార్ధ మును గ్రహించగలిగినారనుట ఆబాలగోపాలమునకు తెలిసిన విషయమే. నేటిమానవుడెంత విజ్ఞాన శాస్త్రివేత్త అయినను విచిత్రముగ ప్రకృతిని జయించుచున్నను అతడు, చివరకు ప్రకృతిలో లీనమగుట తప్పుటలేదు. అగ్నిప్రమాదములకు భూకంపములకు జలప్రళయములకు సముద్రపు యుప్పెనలకు తుపాసు భీభత్సములకు జరామరణములకు అతడు లోబడుచునే యున్నాడు. గనుక పురాణముల భక్తితో వర్తించి తరించవల యునే గాని విమర్శింపరాదు.

ఆధునికులింకను పూర్వీకులను మించలేదు. ఈ నాటి విమానము లెక్కిన దిగువరకు నమ్మకము లేదు. పురాణములం దలి విమానములెచ్చటను కూలినట్లగపడదు. ఈనాటి రైళ్ళు మోటార్లు నిత్యము ప్రమాదములకు గురియగుట మనమెరింగినదే. కాని పురాణకాలపు వాహనములనుండి క్రిందబడి చచ్చినవారు గానరారు. రామరావణ యుద్ధములో చనిపోయిన వానర సైనికులు మరల దేవేంద్రునిచే బ్రతికింపబడిరి. నేటి యుదములలో మన సైనికుల కింకను ఆ మంచిస్థితి లభింపలేదు. మనకంటి కగుపిం చిన దానిని నమ్మెదము, లేనిదానిని సులభముగ అబద్ధమని కొట్టి వేయగలము, నేటి బాలయోగుల తపస్సును నిజమని నమ్మెదము. కాని పురాణములందలి ఋషుల తపస్సులను నమ్మలేము, నేటి సైకిలాబులను నమ్మెదుమేగాని పూర్వము పర్వతములు ఎక్క

లతో నెగురుచుండెనను పురాణ విషయమును నమ్మజాలము. ఈనాటి కృత్రిమ యుత్పత్తియగు బేబిలను నమ్మగలుగుచున్నా ముగాని పురాణకాలపు అయోనిజులను నమ్మజాలకున్నాము. ఈనాడు మానవుడంతరిక్షములో తేలియాడుటను వొప్పుకొందుము కాని ఆంజనేయుడు గగనమున లంకేగుటను అనుమానించెదము. మంత్రమహిమ యెరుంగని మనబోటి వారికి పురాణములందలి విషయములు విచిత్రములుగనే గన్పట్టును. అది నేటి మన అశక్త తకు పాశ్చాత్యుల ఔన్నత్యమునకు దాసోహమని పొగడుటకు సరిపోవునేమోగాని పూర్వీకులను పురాణకర్తలను విమర్శించుటకు మనకావంతయును అధికారములేదనుట జగమెరిగిన సత్యము. ఇటీవల మానవుడు చంద్రునిపై అధిరోహించిన తదుపరి విమర్శ కుల యుత్సాహమతిశయిల్లినది. చంద్రుని, పురాణములలో దేవ తగా వర్ణించుట తప్పు. ఆయన దేవుడుగాదు. అదియొకగోళము. పురాణములందలి ఆయన కథలన్నియు కట్టుకథలేయని రచయితలు రగడయొనర్చిరి. లోకులు అవునుగదాయని ఆశ్చర్యపడిరి. అప్పుడు వీరికి హేతువాదనయే తోచలేదేమి? మొదటినుండియు మనము భూమిని, సముద్రమును గాలిని నిప్పును గంగను గగనమును ప్రత్యక్షముగ గాంచుచునే యుంటిమి. పురాణములందు వారి చరి త్రలనేకములుండెను. అప్పుడంతా మౌనముద్ర వేసిన విమర్శకులు చంద్రునిపై మానవుడధిరోహించిన పిదప మాత్రమే విమర్శయను నాయుధమును ఝుళిపించుటేమిటి? భూగోళపు పంచభూతము లెట్లు

దేవతలయిరో ఖగోళగ్రహములు సయితమట్లె దేవతలయిరి. ఇందు క్రొత్తదనమేమున్నది? ఇట్టి విమర్శలనువిని మనమయోమయుల మగుచున్నాము.

పెట్టువానికి కొట్టువానికి దణ్ణంబెట్టుట మనకలవాటు. ఐతే పెట్టువానికి ప్రేమతో కొట్టువానికి భయముతో చేతులు జోడింతుము. ప్రకృతిలో ఈ రెండు గుణములిమిడియున్నందున మానవుడు ప్రకృతినే దైవముగా తలంచి ప్రేమతో భీతితో పూజించుచున్నాడనిపించును. ఇది మానవ నైసర్గిక లక్షణము. ఇట్లు మానవ సహజలక్షణముల కనుగుణ్యముగ నున్నవి గనుకనే పురాణ రచన యదార్థమైనదని చెప్పదగును, కలియుగమున ధర్మములు తారుమారగుననియు, వర్ణసంకరము జరుగుననియు, నాస్తిక వాదము హెచ్చుననియు వరుసవావులుండవనియు, ఆయుపు తరుగుననియు ఆశలు పెరుగుననియు, అక్రమములు వక్రమార్గమున వృద్ధియగుననియు మొదలగు నేడుదేశమున జరుగుచున్న పరిస్థితుల తారుమారును గురించి పురాణములందిదివరకే వర్ణింపబడి యున్నందున పురాణములకు బూజుపట్టలేదని అవి నిత్యసత్యములని మనకు తేటతెల్లమగుచున్నది.

పురాణములు వ్యభిచార చరిత్రలా ?

ఇది యొక వింత విమర్శ. పామరులు పలుకునట్టిది. స్థూల దృష్టితో జూచిన పురాణములు వ్యభిచారచరిత్రలుగనే గన్పట్టి

వచ్చెను. సూక్ష్మదృష్టితో గాంచు పండితులకట్లు గన్పట్టవు. పురాణములు వారికి పవిత్రగ్రంథములు. నేటికిని పురాణములను పురుషులు విమర్శించినట్లు స్త్రీలు విమర్శించుటలేదు. దీనినిబట్టియే వారివారి జీవిత విధానములు మనోగత ప్రవృత్తులు సులభ గ్రాహ్యమగు చున్నవి. వ్యభిచారాభిలాషులగు పురుషులకు వ్యభిచారచరిత్రలవలె పురాణములు గన్పట్టుచున్నవేమో నని యనిపించును. బ్రతికించ సామర్థ్యము గలవాడు చంపినను ఆ దోషమాతనికి యంటదందురు. మరియు కీర్తి లభించును. పురాణ వ్యభిచారవిషయము లిట్టివి. మన శక్తి యితరులను చంపుటకు మాత్రమే యుపయోగపడునుగాని బ్రతికించుటకు గాదు. గనుక దేవతల చర్యలకు మనచర్యలకు అంతటి వ్యత్యాస మున్నదని గుర్తించవలయును. తండ్రి ఆజ్ఞ మేరకు తల్లిని నరికిమరల తండ్రిని వరమడిగి తల్లిని బ్రతికించు కొనిన పరశురాముడే పై విషయమునకు సాక్షి. భీముడు విషము త్రాగినను జీర్ణించుకొనెను. మనకు సంభవించునది మరణమే.

అగస్త్యుడు సముద్రమును గుటకలో మ్రింగెను. మనకా నీరు వాంతిని పుట్టించును. మానస సరోవరమునుండి భగీరథుడు తపస్సుచే గంగను భారత భూమికి గొనివచ్చెను. మనమట్టి ప్రయత్నమొనర్చుటకెన్ని కోట్లు ఖర్చుచేసి ప్రాజెక్టుల నిర్మించుచుంటిమో యెల్లరకు తెలిసిన విషయమే, గనుక దేవతలతో మనము పోటి పడుట పొరపాటు. నదిలో కొట్టుకపోవు దిగంబర స్త్రీని వాటవేసు కొని వొడ్డుకు జేర్చిన ఈతగాని భావనకు, అలంకరించుకొని అటు

నిటు నేత్రముల ద్రిప్పుచు ప్రక్కజూపుల వెక్కిరింతలతో చలిన చిత్రములకు షోకుగ పయనించు భామను తనబాహువుల బంధించి గొనిపోవు పొగరుబోతు మనోభావములకు భూమ్యాకాశమంతటి తేడాగలదుగదా! ఇట్టి పద్ధతిని పరిశీలించిన పురాణములందలి వ్యభి చార చర్యలవలె గన్పట్టు విషయములు పవిత్రకార్యములుగనే సాధుప్రవృత్తిగల వారి మనోనేత్రములకు గన్పట్టును. పాపపుణ్య ములు అంటుచోషములు ప్రకృతికి లోబడు మానవులగు యోనిజు లకేగాని అయోనిజులకు గాదని యెల్లరు తలంచవలయును.

పాండవ వంశమే లేకుండ అశ్వత్థామ గావించియుండ ప్రస్తుతముగూడ ద్రౌపది వంశములోనివారు అట్టి కాపురములను యెక్కడో ఉత్తరాదిన చేయుచున్నారని దేశము దిరిగిన పెద్దలు కొందరు పలుకుట అర్ధరహితము గదా! అట్టి కాపురములుండవచ్చు నేమోగాని వారిని ద్రౌపది వంశమునకు అతికించుట శుద్ధ అవి వేకము,

హనుమంతుని జన్మచరిత్రయు నిట్టిదే. కేసరియను వాన రుని భార్య అంజనీదేవిని వాయుదేవుడు ఆలింగనము చేయగా హనుమంతుడు గలిగెను. ఈ రోజులలో మాత్రము గాలిదేవుని స్పర్శసోకని స్త్రీ లెవ్వరైనను యుందురా? గనుక నేటి స్త్రీలనంద రిని వ్యభిచారిణులుగ పరిగణింప వలసినదేనా? తప్పుతప్పు, అయో నిజులు యోనిజులకంటె అసాధ్యులని గ్రహించవలయును. వసి ష్ఠుని శాపమున అష్టవసువులు భూలోకమున జన్మించు సమయమున

నెత్తురు మాంసములతో గూడుకొన్న మానవగర్భమున మురిగి ధుర్గంధ భూయిష్టమగు యోనులందు జనింప జాలక పవిత్రమగు గంగ గర్భమున పుట్టెదమని ఆమెను ప్రార్థించి గంగ గర్భమున జన్మించిరి. అట్టి నీచమగు మానవ యోనులనుండి పుట్టిన మనము ఘనులమా లేక పురాణములందలి అయోనిజులు ఘనులా? యని ప్రశాంత చిత్తముతో పరిశీలించిన మన తక్కువతనమును మనమే గ్రహింపగలుగుదుము. ధర్మపత్ని అను పదమునకు ఉంపుడుగత్తె అను పదమునకెంత తేడాగలదో అంతటి తారతమ్యము పురాణము లందు వ్యభిచారమువలె గన్పట్టు చర్యలకు కలికాలపు వ్యభిచార పద్ధతికిని గలదు. ఇట్టి మన తక్కువతనమును పోగొట్టుకొని పునీతులము గావలయునన్నిన పురాణ శ్రవణమే శరణ్యము. శారీరక రోగముల నివారణకు మందులెట్టివో మానసిక శాంతికి పురాణములట్టివి. పురాణములను భక్తితో పరిశీలించు వానికిమాత్రమే అందలి యుత్తమభావములు గోచరించును.

అయితే పురాణ పఠనములు నేడు మూలబడుట యేమిటని విచారించిన యీ క్రింది విధముగ కారణములు గన్పట్టును. పుడమిపై పుట్టిన ప్రాణులు తెలిసియో తెలియకయో పాపములు చేయుచునేయుందురని ఎఱ్ఱాప్రగడ భారతమందు దెలిపియుండెను. అట్లు పాపభీతిగల పూర్వీకులు పురాణములు విని తమ పాపము పరిహరింప బడినదని తృప్తి చెందుచుండెడివారు. నేడట్టి పాపభీతి ప్రజలనుండి పారిపోయినది. దుష్ప్రచార మెక్కువైనది, ఇహ

లోకవాంఛ ఇనుమడించినది. హేతువాదన శృతిమించినది. పాపము అనుపదమునకు నిఘంటువులో అర్థము గానరాకున్నది. పెద్దల మాట పిన్నలు వినుట పోయినది, తమకనుభవమునకు రానిదే నమ్మకము కలుగకున్నది. తమ కనుభవమున కొచ్చుసరికి వయసు ముసలిదగుచున్నది. పాపకార్యములు నేడు నిత్యకృత్యములైనవి. పంచమహాపాతకములిపుడు పుణ్యప్రదములుగ మారినవి. అరిషడ్వర్గములను నారు శత్రువులు నేడు మిత్రములైనవి. సదాచారములు మూఢాచారములని వ్యాఖ్యానించబడుచున్నవి. ఎవరెట్టిపని యొనర్చినను తప్పిదములేదని వ్యాఖ్యానము చేయుటకు అనువైన భవగద్గీత మాత్రము ముమ్మరముగ ప్రచార మందున్నది. కాల ప్రవాహమునకు నెదురీదగలవాడెవ్వడు? విధిబలీయము. అంతా అగమ్య గోచరము. ఆ పురాణ పురుషునిలీలలు ఆయనకే విదితము.

"సర్వేజనా సుఖినోభవంతు" అను పురాణ వచనము సర్వదా శ్లాఘనీయము.

ఓం. శాంతిః శాంతిః శాంతిః

సంపూర్ణం

మంగళం.